రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

**ఎంపిలో ఘోర ప్రమాదం**
సిమెంట్ ట్రక్కు అదుపుతప్పి వ్యాన్‌పై బోల్తా
9 మంది మృతి, మరో ఇద్దరికి గాయాలు

ఆక్సిజన్, ఐసోలేషన్ బెడ్లు, వెంటిలేటర్లు
**అందుబాటులో ఉంచండి**
రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు జారీ

లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 345 | గురువారం | 05-06-2025 | హైదరాబాద్
Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12 | వెల రూ. 5.00

# విజయోత్సవంలో విషాదం

## బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట
## 11మంది మృతి, 33మందికి గాయాలు



- ఆసుపత్రుల్లో బాధితులను పరామర్శించిన కర్నాటక సిఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సిఎం శివకుమార్
- ఐపిఎల్‌లో ఆర్‌సిబి ఘనవిజయంతో స్టేడియంలో సన్మాన కార్యక్రమం
- కిక్కిరిసిన అభిమానులు
- అదుపుచేసే క్రమంలో పోలీసులు లాఠీచార్జి
- మూడు లక్షల మంది తరలిరావడంతో తొక్కిసలాట



**బెంగళూరు :** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) జట్టు ఘనవిజయం సందర్భంగా బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియలో ఏర్పాటు చేసిన అభిమానుల విజయోత్సవ వేడుకలు పెనువిషాదాన్ని మిగిల్చాయి. 18 సంవత్సరాల నిరీక్షణ తర్వాత ఐపిఎల్ 2025లో ఆర్‌సిబి బృందం తొలి టైటిల్ విజయం సాధించడంతో అభిమానుల్లో అంబరాన్ని అంటే సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా విజయప్రదర్శన, విజేతలకు బుధవారం సాయంత్రం ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు స్టేడియానికి ఆర్‌సిబి అభిమానుల సంఖ్య భారీగా పోటెత్తింది. హఠాత్తుగా స్టేడియం బయట జరిగిన భారీ తొక్కిసలాటలో ఒ క బాలుడు, మహిళ సహా 11మంది మృతిచెందారు. 33మందికి పైగా క్షతగాత్రులయ్యారు. గేట్2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు అభిమానులు ఒక్కసారిగా దూసుకెళ్లే ందుకు ప్రయత్నించగా, వారిని అదుపుచేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. అభిమానులు వెంటనే కాంపౌండ్‌వాల్ ఎక్కేందుకు ప్రయత్నించారు. ఆ గోడ ఎక్కే సయమంలో ఓ వ్యక్తి కింద పడటంతో కాలువిరిగిపోయింది. హఠాత్తుగా మొదలైన తోపులాట తీవ్రస్థాయికి చేరి తొక్కిసలాటకు దారితీయడంతో చిన్నస్వామి స్టేడియం అంతటా అరుపులు, హాహాకారాలు, కన్నీటి రోదనలు మిన్నుముట్టాయి. సంఘటనా స్థలిలో చెప్పులు, బూట్లు తెగి పడ్డాయి. తమ వాళ్లు ఎక్కడున్నారు? ఏమయ్యారు అనే ఆత్రుతతో వెతుకులాటలు, పేర్లు పెట్టి పిలవడాలు

తరువాయి 2లో

### ప్రధాని మోదీ, సిఎం సిద్ధరామయ్య దిగ్భ్రాంతి

చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాటపై ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన ఆయన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతేకాదు ఆత్మీయులను కోల్పోయిన ఫ్యామిలీస్‌కు కేంద్ర తరఫున రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వాళ్లకు రూ. 50 వేల పరిహారం చెల్లిస్తామని మోడీ వెల్లడించారు. కర్నాటక ప్రభుత్వం కూడా తొక్కిసలాట మృతులకు నష్టపరిహారం ప్రకటించింది. ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేసిన కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బౌరింగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాళ్లను పరామర్శించారు. ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రమాదంలో మృతి చెందిన వాళ్ల కుటుంబాలకు రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. 'చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది

తరువాయి 2లో



# 2 దశల్లో కులగణన

## అదే సమయంలో జనగణన కూడా

అక్టోబరు 1, 2026 నుంచి తొలి దశ, మార్చి 1, 2027 నుంచి రెండవ దశ

ఈనెల 16న అధికారికంగా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం



**న్యూఢిల్లీ :** జనగణనపై కేంద్ర ప్రభుత్వం కీలక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తదుపరి దేశవ్యాప్త జనగణనను 2027 సంవత్సరంలో నిర్వహిస్తామని వెల్లడించింది. ఈసారి జనగణనతో పాటే తొలిసారిగా కులగణన కూడా నిర్వహిస్తామని తెలిపింది. బుధవారం విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్‌లోనూ ఈవిషయాన్ని ప్రస్తావించింది. నోటిఫికేషన్ ప్రకారం, జనగణనను రెండు దశల్లో నిర్వహించనున్నారు. దీనికి సూచన తేదీగా 2027 మార్చి 1ని పరిగణించనున్నారు. అయితే లడాఖ్, జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి మంచుతో కప్పబడిన, సమకాలీకరించని ప్రాంతాల్లో ముందుగానే జనాభా గణనను నిర్వహిస్తారు. ఇలాంటి ప్రాంతాల్లో జనగణన నిర్వహణకు సూచన తేదీగా 2026 అక్టోబర్ 1ని నిర్ణయించారు. 2027లో కుల గణనతో పాటు జనగణన నిర్వహించే వివరాలతో ఈనెల 16న అధికారిక గెజిట్‌ను భారత ప్రభుత్వం ప్రచురించనున్నట్లు సమాచారం. 1948 జనాభా లెక్కల చట్టం, 1990 జనాభా లెక్కల నియమాల ప్రకారం ప్రతి పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తుంటారు. 2027లో జనగణనతో పాటే కులగణన నిర్వహిస్తారు. జాతీయ జనాభా లెక్కల ప్రక్రియలో కులాల గణనను భాగంగా చేయడం ఇదే తొలిసారి. కులగణన సమాచారం ఆధారంగా భారత ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను తీసుకోవచ్చని రాజకీయ పార్టీలు, పలు రాష్ట్ర ప్రభుత్వాలు వాదించాయి. ఆ మేరకు ప్రభుత్వ విధానపరమైన ప్రణాళికలను, సంక్షేమ కార్యక్రమాలను రూపొందించొచ్చని సూచించాయి. ఈ నేపథ్యంలో జనగణనతో పాటే కులగణన నిర్వహణకు అంగీకారం తెలుపుతూ కేంద్ర సర్కారు నుంచి ప్రకటన

తరువాయి 2లో

# జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



ఆపరేషన్ సిందూర్‌పై చర్చ అప్పుడే

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను జులై 21వ తేదీ నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ తేదీలను సిఫార్సు చేసినట్లు రిజిజు వెల్లడించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిర్వహణపై పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సిఫార్సు చేసిన తేదీలను రాష్ట్రపతికి పంపుతామని ఆయన చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు పార్లమెంట్‌ను ప్రత్యేకంగా

తరువాయి 12లో

# నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం ఉదయం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే మంత్రినవర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. ఉద్యోగులకు కరువుభత్యం మంజూరు, రాజీవ్ యువ వికాసం, ఏటా ఉద్యోగుల సాధారణ బదిలీలు, రైతు భరోసా, రైతుబీమా, సన్న వడ్లకు బోనస్, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు గ్రీన్ చానల్ ఏర్పాటు, కాళేశ్వరంపై ఎన్‌డిఎస్‌ఎ నివేదిక, విత్తన చట్టం ముసాయిదా, ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) రూపకల్పన, ఇందిరమ్మ ఇళ్లు, హ్యామ్ రోడ్లు, ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం

తరువాయి 2లో





# ఉద్యోగ సమస్యల పరిష్కారం ప్రభుత్వ బాధ్యత

- కేబినేట్ సమావేశంలో ఉద్యోగ సమస్యలపై నివేదిక సమర్పిస్తాం
- సమస్యలకు పరిష్కార మార్గాన్ని కనుగొంటాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడి
- సహచర మంత్రులతో కలిసి ఉద్యోగ సంఘాల జెఎసి ప్రతినిధులతో భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై నివేదికను సమర్పించి, ఆ సమస్యలకు పరిష్కార మార్గాన్ని కనుగొంటామని తెలిపారు. గురువారం జరగనున్న మంత్రివర్గ సమావేశం నేపథ్యంలో హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో

తరువాయి 2లో

# హైదరాబాద్‌లో ఆర్ఎన్ విగ్రహం

- ఎల్‌బి నగర్‌లో నిర్మిస్తున్న ఆసుపత్రికి రావినారాయణరెడ్డి పేరు పెట్టాలి
- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి
- ఉద్యమంలో అసువులు బాసిన అమరుల పేరుతో మ్యూజియం ఏర్పాటు చేయాలి
- ప్రభుత్వానికి పలువురు ప్రముఖులు విజ్ఞప్తి
- ఘనంగా రావి జయంతి వేడుకలు
- మానవత్వం మూర్తీభవించిన గాంధేయవాది రావి : కె.జానారెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా నిరంకుశ నిజాంను గజ గజ వణికించి, రాచరిక పాలనకు చరమ గీతం పాడిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు రావి నారాయణరెడ్డి అని పలువురు కొనియాడారు. హైదరాబాద్ నగరంలో ఆ మహా నాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, ఎల్.బి నగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఆసుపత్రికి రావి నారాయణరెడ్డి పేరు పెట్టి, సముచిత గౌరవాన్ని కల్పించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చి, ఈ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల పేరుతో మ్యూజియంను ఏర్పాటు చేసి వారి చిత్ర పటాలను అందులో పొందుపర్చాలని కోరారు. తెలంగాణ అమరవీరుల సార్మక ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట రథసారథి, స్వాతంత్ర్య సమర యోధులు, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి 118వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.జానారెడ్డి, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జాతీయకార్యదర్శి డాక్టర్‌కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, ట్రస్ట్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ట్రస్టు సభ్యులు సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, రావి ప్రతిభ, ట్రస్ట్ కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావులు పాల్గొన్నారు. ముందుగా అతిథులు రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి కె. జానారెడ్డి మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి కమ్యూనిస్టు నాయకుడే కాదని,మానవత్వం మూర్తీభవించిన గొప్ప గాంధేయవాది కూడా అని అన్నారు. రావి నారాయణ రెడ్డి దున్నేవాడేకే భూమి అని నినాదం ఇవ్వడమే కాదని,తనకు ఉన్న 500ల ఎకరాల భూమి పేదలకు పంచడం ద్వారా భూదాన ఉద్యమానికే స్ఫూర్తి ప్రదాతగా ఆయన నిలిచారన్నారు. మలుచుకుని రావి నారాయణ రెడ్డి అశయాలను పార్టీ శ్రేణులు ప్రస్తుత

తరువాయి 2లో

# కోట్లకు పడగలెత్తిన మట్టి మారాజులు

కనుమరుగవుతున్న మట్టి గుట్టలు

నిబంధనలు బేఖాతర్, అనుమతులు అడిగేదే లేదు

ప్రజాపక్షం/ఖమ్మం

మట్టి బంగారం అవుతుంది అంటే ఎలా సాధ్యం అనుకోవద్దు. ఇప్పుడు అతిపెద్ద లాభసాటి వ్యాపారంగా మారింది మట్టి తరలింపు. అక్రమ మట్టి తోలకాలతో అక్రమార్కులు కోట్లు పోగేసుకుంటున్నారు. పట్టణాలు, పల్లెలు, ఏజెన్సీ ప్రాంతాలు అనే తేడా లేకుండా అక్రమంగా మట్టి తోలకాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు ప్రకృతి రమణీయతకు పేరుగాంచిన గుట్టలు ఇప్పుడు కనుమరుగయ్యాయి. నిబంధనలు, అనుమతులు మనం చెప్పుకోవటానికి తప్ప అక్రమార్కులకు ఇవేవి పట్టవు. గుట్ట మాదే, మట్టి మాదే అంటున్న అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం

తరువాయి 12లో



# ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దు

- నిర్మాణ పనులను అడ్డగించిన రైతులు
- కంటైనర్, రెండు కార్లను ధ్వంసం చేసిన బాధితులు
- భూములు కాపాడుకునేందుకు దేనికైనా సిద్ధమేనని హెచ్చరిక

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి

జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో విషపూరిత ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చేపట్టొద్దని గత రెండేళ్లుగా నిరసన తెలుపుతున్నారు. రైతుల వ్యతిరేకతను గమనించిన ఇథనాల్ కంపెనీ యాజమాన్యం కొన్నాళ్లు సైలెంట్‌గా ఉండి తాజాగా కంపెనీ నిర్మాణ స్థలంలోకి జెసిబి, మెటీరియల్ తరలించడంతో పసిగట్టిన రైతులు మంగళవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. పోలీసులు యాజమాన్యంతో మాట్లాడి రైతుల డిమాండు

తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## అఫ్గాన్ సరిహద్దులో 14 మంది ఉగ్రవాదుల కాల్చివేత



**పెషావర్:** అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో చేపట్టిన కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా జరిగిన ఎదురుకాల్పుల్లో 14 మంది ఉగ్రవాదులు మృతి చెందారు. పాక్ ఆర్మీ విడుదల చేసిన ప్రకటనను అనుసరించి గత రెండు రోజుల్లో ఈ ప్రత్యేక కూంబింగ్ ఆపరేషన్‌ను చేపట్టారు. ఉగ్రవాదుల సంచారంపై నిఘా సంస్థల నుంచి సమాచారం అందడంతో ఆర్మీ రంగంలోకి దిగింది. పశ్చిమ వజిరిస్తాన్ జిల్లా దట్టా ఖేల్‌లో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడడంతో సైన్యం ఎదురుకాల్పులు జరిపారు.

## చర్చల ద్వారా పాక్–అఫ్గాన్
# సంబంధాలు మెరుగు

### చైనా ఆశాభావం



**బీజింగ్ :** పాకిస్తాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు చర్చల ద్వారా మెరుగుపడతాయని చైనా ఆశాభావం వ్యక్తం చేసింది. దౌత్యవేత్తల స్థాయిలో జరుగుతున్న చర్చలు ఫలప్రదమవుతాయన్న నమ్మకం తమకు ఉందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, గత నెల ఈ రెండు దేశాల అభివృద్ధికి పరస్పర సహకారం అత్యవసరమని అన్నారు. విదేశాంగ శాఖ మంత్రుల స్థాయిలో చర్చలను చైనా ప్రోత్సహించింది. ఈ నేపథ్యంలోనే గత నెల పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, తాలిబన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకితో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ సమావేశమయ్యారు. దౌత్యవేత్తల స్థాయిలో చర్చలు జరిపి, సమస్యలు పరిష్కారించుకోవాలని సూచించారు. ఆ తరాఇ్వత పాక్, అఫ్గాన్ మధ్య కింది స్థాయిలో దశల వారీగా చర్చలు జరుగుతున్నాయి. అఫ్గాన్ గడ్డపైనుంచి తెహ్రీక్ ఎ తాలిబన్ పాకిస్తాన్ (టిటిపి) తమ దేశంలో ఉగ్రదాడులకు పాల్పడుతున్నదని పాకిస్తాన్ ఆరోపణ. తాలిబన్ ఈ ఆరోపణలను ఖండిస్తున్నది. ఈ నేపథ్యంలో జరుగుతున్న చర్చలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# ట్రంప్ 'బిగ్ బిల్' దారుణం

### మరోసారి విమర్శలు గుప్పించిన మస్క్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మరోసారి విమర్శలు గుప్పించారు. ట్రంప్ ప్రభుత్వం రూపొందించిన పన్ను మినహాయింపు బిల్లు 'బిగ్ బ్యూటిఫుల్ బిల్ యాక్ట్' దారుణంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే 2.5 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న ద్రవ్య లోటు, ట్రంప్ సర్కారు తీసుకురానున్న బిల్లు కారణంగా మరింత పెరుగుతుందని ఆయన 'ఎక్స్'లో చేసిన పోస్టులో విరుచుకుపడ్డారు. ఇలాంటి నిర్ణయాల వల్ల అమెరికన్లపై భరించలేని భారం పడుతుందని అన్నారు. ప్రభుత్వ ఖర్చులు తగ్గించాలనే 'డోజ్' ఆశయాలకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. దీని వల్ల ఖర్చులు పెరుగుతాయని, ఆ ప్రభావం ప్రజలపైన పడుతుందని మస్క్ హెచ్చరించారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తున్న మస్క్, తన నిరసనను వ్యక్తం చేయడానికే పదవిని నుంచి వైదొలగినట్టు మీడియా వార్తా కథనాలు వచ్చాయి. కాగా, అదే విషయాన్ని మస్క్ మరోసారి ఎక్స్ వేదికగా ప్రస్తావించారు. ఈ బిల్లును అత్యంత దారుణమైనదిగా అభివర్ణించారు. ఇలావుంటే, మస్క్ చేసిన వ్యాఖ్యలపై ట్రంప్ ప్రభుత్వం స్పందించింది. మస్క్ అభిప్రాయం అమెరికా అధ్యక్షుడికి తెలుసునని వైట్ హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలినా లివిట్ వ్యాఖ్యానించారు. రాబోయే గొప్ప బిల్లును మస్క్ అభ్యంతరాలు అడ్డుకోలేవని తేల్చిచెప్పారు. ప్రభుత్వ ఖర్చులు తగ్గించడానికి, అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిర్ణయించిన ట్రంప్, అందుకు వీలుగా 'డోజ్' శాఖను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దాని బాధ్యతలు మస్క్ అప్పగించారు. వ్యాపారవేత్తగా తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్న మస్క్, వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించాలని, కొన్ని శాఖలను పూర్తిగా మూసివేయాలని సూచనలు చేశారు. వ్యయాన్ని కట్టడి చేయడం అనే పేరుతో, దాదాపు అన్ని శాఖల్లోనూ మస్క్ జోక్యం చేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత వివిధ కారణాలను పేర్కొంటూ 'డోజ్' నుంచి మస్క్ వైదొలిగారు. అప్పటి నుంచి ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు.

**జులై 4లోగా ఆమోదించండి: సెనెటర్లను కోరిన ట్రంప్**

'ది వన్, బిగ్, బ్యూటిఫుల్ బిల్'ను చారిత్రాత్మకమైనదిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అభివర్ణించారు. పన్నుల నుంచి సరిహద్దు భద్రత వరకూ, వలస విధానం నుంచి సామాజిక సంక్షేమం వరకూ వివిధ రంగాల్లో మార్పులను తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన ఈ బిల్లును జులై 4లోగా ఆమోదించాలని సెనెటర్లను కోరారు. కీలక నేతలను ఆయన ఒకరి తర్వాత మరొకరిగా వైట్ హౌస్‌లో కలుస్తున్నారు. సెనెట్ మెజారిటీ లీడర్ జాన్ థాన్‌తో భేటీ ఆయిన ట్రంప్ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. అమెరికా మీడియాను అనుసరించి, సుమారు 1000 పేజీలతో కూడిన ఈ విస్తృతమైన బిల్లుపై సెనెటర్ల అభిప్రాయం తెలుసుకోవాలని ట్రంప్ అనుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ బిల్లును ఆమోదింపచేసుకోవాలన్నది ఆయన పట్టుదల.

# ఉగ్రవాదంపై పోరుకు చర్చకు పాక్ సిద్ధం

### పిపిపి చైర్మన్ బిలావల్





**న్యూయార్క్:** ఉగ్రవాదంపై పోరుకు భారత్‌తో చర్చించడానికి పాకిస్తాన్ సిద్ధంగా ఉందని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) చైర్మన్, విదేశాంగ శాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో అన్నారు. ఇరు దేశాల నిఘా వ్యవస్థలు కలిసికట్టుగా పని చేస్తే, ఉగ్రవాదాన్ని తగ్గించే అవకాశాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. పహల్గాం ఘన తర్వాత, ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలకు పాక్ సహకరిస్తున్నదని, ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరుతూ భారత ఎంపిలు వివిధ బృందాలుగా, వేరువేరు దేశాల్లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. అదే తరహాలో భారత్ అన్ని రకాలుగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందన్నది ఆరోపిస్తూ, పాకిస్తాన్ ప్రభుత్వం కూడా ఎంపిల బృందాన్ని పంపింది. బిలావల్ నేతృత్వంలోని బృందం అమెరికా వెళ్లింది. అక్కడ ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో బిలావల్ మీడియాతో మాట్లాడుతూ, ఉగ్రవాదంపై చర్చకు పాకిస్తాన్ ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని అన్నారు. భారత నిఘా సంస్థ 'రా', పాకిస్తాన్ నిఘా సంస్థ 'ఐఎస్ఐ' చర్చలు జరిపి, ఉగ్రవాద నిర్మూలనకు సంయుక్తంగా పని చేయాలని సూచించారు. ఒక ప్రశ్నపై స్పందిస్తూ, రెండు దేశాల మధ్య వివాదాల పరిష్కారం అనుకున్నంత సులభం కాదని అంటూనే, శాంతి స్థాపన జరగాలంటే చర్చలు అవసరమని పేర్కొన్నారు. భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణపై ఒప్పందం కుదరడానికి అంతర్జాతీయ సమాజం జోక్యమే కారణమని బిలావల్ అన్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, విదేశంగ కార్యదర్శి మార్కో రూబియో నేతృత్వంలోని బృందం కీకల భూమిక పోషించినట్టు చెప్పారు. ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో ట్రంప్ ప్రకటించుకోగా, అలాంటిదేమీ లేదని, ఎవరూ మధ్యవర్తిత్వం వహించలేదని భారత్ వాదిస్తున్న విషయం తెలిసిందే. అయితే, అమెరికా మధ్యవర్తిత్వాన్ని బిలావల్ ధ్రువీకరించారు. అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాల మధ్య ఘర్షణలు, యుద్ధ వాతావరణం మంచిది కాదని వ్యాఖ్యానించారు. ప్రతి ఉగ్రదాడిని పాకిస్తాన్‌తో ముడిపెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. అదే విధంగా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేయడాన్ని ప్రస్తావిస్తూ, ఇది నీటిని యుద్ధానికి ఆయుధంగా మార్చుకునే ప్రయత్నమేనని విమర్శించారు. అంతర్జాతీయ సమాజం స్పందించాలని కోరారు.

# ముజిబుర్ 'జాతిపిత' టైటిల్ రద్దు!



**ఢాకా:** తూర్పు పాకిస్తాన్‌గా ఉన్న ప్రాంతం బంగ్లాదేశ్ పేరుతో కొత్త దేశంగా ఏర్పడడంలో కీలక పాత్ర పోషించిన షేక్ ముజిబుర్ రహమాన్‌కు ఉన్న 'జాతిపితి' టైటిల్ ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం తొలగించింది. మీడియా వార్తలను అనుసరించి, మహమ్మద్ యూనుస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం బుధవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పదవీచ్యుతురాలై, ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనా తండ్రి ముజిబుర్‌ను 'బంగ్లాదేశ్ జాతిపిత'గా పేర్కొంటారు. కాగా, ఆ టైటిల్‌ను తొలగించిన ప్రభుత్వం, 'స్వాతంత్ర సమరయోధుడు' అనే పదానికి ఉన్న వివరణను సైతం సవరించింది. ఈ నిర్ణయాలకు అనుగుణంగా, అవసరమైన రాజ్యాంగ సవరణలు కూడా చేసింది. ఇప్పటికే బంగ్లాదేశ్ కరెన్సీపై ముజిబుర్ ఫొటోలను తొలగించింది. ఇప్పుడు జాతిపిత టైటిల్‌ను కూడా చెరిపేసింది. స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలకు ఇస్తున్న ప్రత్యేక రాయితీలు, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం చివరికి షేక్ హసీనా పదవిని కోల్పోవాల్సిన పరిస్థితికి నెట్టడంతో, రాజకీయ గందరగోళానికి తెరదించుతూ యూనుస్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన విషయం విదితమే.

# సిఎం సిద్ధరామయ్య దిగ్భ్రాంతి

(మొదటి పేజీ తరువాయి)

చనిపోయారు. 33 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఊహించని రీతిలో అభిమానులు తరలి రావడంతో ఈ దురదృష్టకరమైన ఘటన జరిగింది. దాదాపు 3 లక్షల మంది జనం రావడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లిస్తాం. గాయపడినవాళ్లకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తాం' అని సిద్ధరామయ్య తెలిపారు. అంతేకాదు తొక్కిసలాటపై న్యాయ విచారణకు ఆయన ఆదేశించారు.

**అవును.. తప్పు మాదే**

అంతకుముందు ఈ ఘటనపై డిప్యూటీ సిఎం డికె శివకుమార్ మాట్లాడారు. 11 మంది అభిమానుల మృతికి కారణమైన ఈ విచారకరమైన సంఘటనకు తమదే బాధ్యత అని చెప్పారు. 'అవును.. తప్పు మాదే. తొక్కిసలాట జరిగినందుకు మమ్మల్ని క్షమించండి. ఊహించని రీతిలో అభిమానులు రావడంతో పోలీసులు వారిని అదుపు చేయలేకపోయారు' అంటూ మీడియాకు వెల్లడించారు.

# ప్రభుత్వ బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

సబ్ కమిటీ సభ్యులు మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు తదితరులు ఉద్యోగ సంఘాల జెఎసి ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఉద్యోగ సంఘాల సమస్యలపై ఏర్పాటు చేసిన అధికారుల త్రి సభ్య కమిటీ, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి, ఒక నివేదికను రూపొందించి క్యాబినెట్‌కు నివేదిస్తామని, ఉద్యోగుల సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటామని భట్టి విక్రమార్క వివరించారు. ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలన్న తపనలో ప్రజాప్రభుత్వం ఉన్నదని, వనరులను సమకూర్చుకొని ప్రజలపై అదనంగా ఒక్క రూపాయి భారం పడకుండా ముందుకు పోతున్నామని, ఉద్యోగుల సంక్షేమానికి ఆర్థికపరమైన కసరత్తు చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు మంచి చేయాలన్న ఆలోచనతోనే తాము పలు మార్లు సమావేశాలను నిర్వహించామని వివరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ ప్రభుత్వ బాధ్యత అని, సానుకూలంగా స్పందించి, వారి సమస్యలను పరిష్కరించాలని సిఎం రేవంత్ రెడ్డి మంత్రుల సబ్ కమిటీ,అధికారుల కమిటీని నియమించారని, ఉద్యోగుల సమస్యలపై అందరితో చర్చించి ,సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రుల కమిటీకి సిఎం సూచించారని భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన త్రీమెన్ కమిటీ ఉద్యోగ సంఘాలతో పలు మార్లు సమావేశమై విజ్ఞప్తులను స్వీకరించిందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బకాయిలు పేరుకుపోవడంతో అన్ని ఒకేసారి చెల్లించలేకపోయామని, ఇక ఎక్కువ కాలం పెండింగ్‌లో పెట్టకుండా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారాన్ని చూపాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని ఉద్యోగ సంఘాలకు వివరించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ప్రజా ప్రభుత్వం భావిస్తుందన్నారు. ప్రజలకు చేయాల్సిన పనులు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలు,ప్రభుత్వ ఆదాయం, వ్యయం వీటన్నింటితో పాటు ఉద్యోగ వ్యవస్థకు ఇవ్వాల్సిన అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తుందని చెప్పారు. ఒక వైపు ప్రజలకు, మరో వైపు ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా కలిసి కూర్చుని చర్చించుకుని ముందుకు పోవాలన్న ఆలోచనతోనే క్యాబినెట్ సమావేశానికి ముందు ఉద్యోగ సంఘాలతో తాము సమావేశమయ్యామని భట్టి తెలిపారు.

**గత పదేళ్ల పాలనతోనే ఆర్థిక ఇబ్బందులు**

గత పది సంవత్సరాల పాలనతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని, అయినప్పటికీ ఉద్యోగులకు సాధ్యమైనంత మేరకు మేలు చేయాలని,వారి సమస్యలను పరిష్కరించాలన్న ఆలోచనలో భాగంగానే తమ ప్రభుత్వం రాగానే మొదటి తేదీన జీతాలు చెల్లిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, కొత్త పథకాలను పెద్ద సంఖ్యలో తీసుకొచ్చామని, విజయ వంతంగా అమలు చేస్తున్నామని భట్టి వివరించారు.ప్రభుత్వ ఆదాయానికి, ఖర్చులకు చేయాల్సిన పనులను బేరీజు వేసుకునే ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సిఎం రేవంత్ రెడ్డి బలంగా ఉన్నారని భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాలకు భరోసా ఇచ్చారు. ఉద్యోగుల కుటుంబాల్లో పెళ్లిళ్లు, ఆసుపత్రుల ఖర్చులకు సంబంధించిన సమస్యలపై క్యాబినెట్‌లో పలుమార్లు చర్చించుకున్నామని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న అంశంపై ఎవరికీ భిన్నాభిప్రాయం లేదని భట్టి స్పష్టం చేశారు. ఈ సమావేశం లో త్రి సభ్య కమిటీ సభ్యులు నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, కృష్ణభాస్కర్, సందీప్ కుమార్ సుల్తానియా, మహేష్ దత్ ఎక్కా తదితరులు పాల్గొన్నారు.

# దశల్లో కులగణన

(మొదటి పేజీ తరువాయి)

వెలువడింది. మన దేశంలో చివరిసారిగా 2011 లో జనగణన జరిగింది. 2010లో రూపొందించి న ఇళ్ల జాబితా ప్రకారం 2011 తొలినాళ్లలో జనగణనను నిర్వహించారు. 2011లో జరిగిన జనగణన ప్రకారం మన దేశ జనాభా 121 కోట్లకుపైనే. జనాభా 17.7 శాతం మేర పెరిగిందని అప్పట్లో గుర్తించారు. 2021లోనూ జనగణన నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. 2020 ఏప్రిల్ నుంచి స మాచార సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని భా వించారు. అయితే కరోనా మహమ్మారి వ్యాప్తి, లాక్‌డౌన్ల నేపథ్యంలో ఆ ప్రక్రియను వాయిదా వేశారు.

**లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన**

2027లో జనగణన ప్రక్రియ పూర్తయ్యాక ఆ సమాచారం ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేసే అవకాశం ఉంది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను కొత్త జనసంఖ్యకు అనుగుణంగా అప్‌డేట్ చేస్తారు. దీంతో వివిధ రాష్ట్రాల్లోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యలోనూ మార్పు రానుంది. రాజ్యాంగం ప్రకారం ప్రతీ జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. కానీ 1976 నుంచి ఈ ప్రక్రియను ఆపేశారు. దీనికి కారణం అప్పట్లో భారత ప్రభుత్వం జనాభా నియంత్రణను ప్రోత్సహించాలని భావించింది. అధిక జనన రేటు కలిగిన రాష్ట్రాలు ఎక్కువగా ఉత్తరాదిలో ఉన్నాయి. జనాభాను నియంత్రణలో ఉంచిన దక్షిణాది రాష్ట్రాల కంటే ఉత్తరాది రాష్ట్రాలు ఎక్కువ లోక్‌సభ, అసెంబ్లీ సీట్లను పొందకుండా నిరోధించాలని నాటి కేంద్ర సర్కారు కోరుకుంది.

# విషాదం

(మొదటి పేజీ తరువాయి)

మొదలయ్యాయి. తొక్కిసలాట దుర్ఘటనలో తొలుత తీవ్రంగా గాయపడ్డ ముగ్గురిని బౌరింగ్ హాస్పిటల్‌కు తరలించగా హాస్పిటల్‌కు చేరుకున్న వెంటనే వారు మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మరో నలుగురిని విట్టల్ మల్లయ్య రోడ్‌లోని వైదేహీ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మరణించినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్ ఆసుపత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించారు.తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడ్డ మరికొంతమందికి ఇతర అభిమానులు సిపిఆర్ నిర్వహించారు. స్టేడియం చుట్టూ ట్రాఫిక్ స్తంభించిపోవడంతో బాధితులను చికిత్స కోసం హాస్పిటళ్లకు తరలించేందుకు పోలీసులు అష్టకష్టాలు పడ్డారు. కొంతమందిని పోలీసులు వారి వాహనాలు, అంబులెన్స్‌లలో సమీపంలోని ప్రైవేట్ హాస్పిటల్స్‌కు హుటాహుటిన తరలించారు. బౌరింగ్ హాస్పిటల్ వర్గాలు మాట్లాడుతూ డజన్ల సంఖ్యలో క్షతగాత్రులను చికిత్సకోసం హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. వారిని లెక్కపెట్టలేని రీతిలో గాయపడ్డవారు చికిత్స కోసం రావడం మొదలైంది. పలువురిని స్టేడియం సమీపంలోని వైదేహీ హాస్పిటల్‌కు కూడా తీసుకెళ్లారు.

మంగళవారం రాత్రి ఆర్‌సిబి బృందం ఐపిఎల్ ట్రోఫీని తీసుకుంటున్న సమయంలో కొందరు గుర్తు తెలియనివ్యక్తులు ఒక యువకుడిపై దాడి చేశారు. దుండగులు బాధితుడి గొంతు నులిమారు. అయితే బాధితుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.ఈ సంఘటన పీన్యాలో జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు కొందరు ఒక వ్యక్తి వీడియోపై దాడిచేశారు. ఆర్‌సిబి విజయోత్సవాలు జరుగుతున్న జలహళ్లిలోని ఒక బార్‌వద్దకు వెళ్తున్న సమయంలో ఈ దాడి జరిగింది. దుండగులు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండానే దాడిచేశారని బాధితుడు చెప్పాడు. కాగా ఈ విషాద ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఆర్‌సిబి విజేతలకు సత్కారం కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. ఈ సంఘటన కారణంగా పోలీసులు, సంబంధిత అధికారులు చిన్నస్వామి స్టేడియం వైపు వెళ్లే మెట్రో, ఇతర వాహనాలను నిలిపివేశారు.

# మంత్రివర్గ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

తదితర అంశాలపై మంత్రివర్గ సమావేశం చర్చించనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇటీవల వాయిదా పడిన రాజీవ్ యువ వికాసం రుణాల మం జూరు పత్రాల పంపిణీపై మంత్రివర్గం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని నిరుద్యోగ యువత ఎదురు చూస్తున్నారు. మరోవైపు ఉద్యోగులు, రైతులు కూడా తమ పట్ల సానుకూల నిర్ణయాలు ఉంటాయని ఆశలు పెట్టుకున్నారు.


# 'ఆర్‌ఎన్' విగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులకు అనుగుణంగా మలుచుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రావి నారాయణరెడ్డి రజకార్లకు వ్యతిరేకంగా, పేద ప్రజల పక్కన నిలబడి సాయుధ పోరాటం ఆధ్యుడిగా ఉద్యమం సాగించిన ఆయన సహాసాన్ని కేవలం నల్లగొండ జిల్లా మాత్రమే కాదని,దేశం మొత్తం మరిచిపోదని అన్నారు. యువతకు అవకాశం కల్పించాలని తద్వారానే పార్టీ మరింత బలోపేతం అవుతుందని భావించి 60 ఏళ్లకే ప్రత్యేక్ష రాజకీయలను నుంచి నిష్క్రమించారని, కొంత ఆలస్యమైనా ఆయన సూర్తితోనే తాను కూడా ప్రత్యేక్ష రాజకీయాలను నుంచి తప్పుకున్నానని జానారెడ్డి తెలిపారు.




కె.నారాయణ మాట్లాడుతూ నాడు తెలంగాణ రైతాంగ పోరాటంతో కమ్యూనిస్టులు నిజాం రాజు పీచం అణిచి, తరమి వేస్తున్న చివరి సమయానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పోలీసు యాక్షన్ పేరుతో హైదరాబాద్ సంస్థానాన్ని స్వాధీనం చేసుకున్నదని, హైదరాబాద్ విలీన విజయం కమ్యూనిస్టులదేనని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలు తల కిందుల తపస్సు చేసినా కమ్యూనిజాన్ని ఆపలేరని అన్నారు. మావోయిస్టులను భౌతికంగా నిర్మూలించగలరోమో గాని ఆ సిద్దంతాన్ని ఆపడం వారి తరం కాదన్నారు. ఎంతో ముందు చూపు ఉన్న రావి నారాయణరెడ్డి 90 ఏళ్ల కిత్రమే దళితులకు పాఠశాలలు ఏర్పాటు చేసి,వారిని ఊరి బయట నుంచి ఊరి లోపలికి తీసుకొస్తే, నేటి బిజెపి ప్రభుత్వం వారిని తిరిగి ఊరి బయటకు పంపిస్తూ , నయా సనాతన ధర్మం అంటున్నారని మండిపడ్డారు.



కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలన్ని తిరిగి ఏకం కావాలని మరోసారి కోరారు. నాటి కమ్యూనిస్టుల నాయకులు అందించిన వారసత్వాన్ని అందిపుచ్చుకుని, వారి అడుగు జాడల్లో నడుస్తుండడంతోనే కమ్యూనిస్టు పార్టీ 100ఏళుగ్లా సజీవంగా ఉందన్నారు. అయితే కమ్యూనిస్టులు చీలి పోవడంతో సిపిఐగా అనుకున్న లక్ష్యాన్ని సాధించకలేకపోతున్నామన్నారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తి ప్రభావంతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చాల తెలివైనవాడని, ఆయన కమ్యూనిస్టులను గౌరవించరని, కానీ కెసిఆర్‌కు అవసరం వచ్చినప్పుడు మాత్రం కమ్యూనిజాన్ని హైజాక్ చేస్తారని చెప్పారు. కమ్యూనిస్టులను అణిచివేయడంలో అన్ని పార్టీలు ఎవరీ పాత్రను వారు పోషించారన్నారు. గొప్ప మానవతా వాది, విశ్లేషకుడైన రావి నారాయణరెడ్డి అప్పుడు జరుగుతున్న పరిణామాలను గమనంలోకి తీసుకుని సాయుధ పోరాటం విరమణకు పిలునిచ్చారన్నారు. ఈ గొప్ప నాయకుడి విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల మ్యూజియంను ఏర్పాటు చేయాలని కూనంనేని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ ఏక కాలంలో సామాజిక, ఆర్థిక సమానత్వం, రాజకీయస్వేచ్ఛ కోసం సాగించిన సాయుధ పోరాటం వల్ల నిజాం గద్దే దిగినప్పటికీ,ఆ తర్వాత మాత్రం జరిగిన పరిణామాలు ఆశించినట్టుగా ముందుకు సాగలేదని చెప్పారు. సాయుధ పోరాట విమరణ తర్వాత రావినారాయణ రెడ్డి ప్రభుత్వంతో చర్చలు జరిపి, సామాజిక, ఆర్థిక మార్పులకు పూనుకోవాలని ఆయన చేసిన ప్రతిపాదన ముందుకు సాగితే ,ఈ రోజు పరిస్థితులు ఏలా ఉండేవనేది ఊహాకు అందని విషయమని చెప్పారు. ఒకవేళా చర్చల ద్వారా హైదరాబాద్ విలీనం జరిగి ఉంటే,పరిస్థితులు ఇంకో విధంగానైన ఉండేదని, కానీ అటు ఇటు కాకుండా ఒక వక్రగతిలోనే హైదరాబాద్ విలీనం జరిగిందని, తద్వారా జరిగిన పరిమాణాలు ఆ తర్వాత సమాజంపై కూడా చాల ప్రభావం చూపిందన్నారు. తెలంగాణలో ఏ ఉద్యమం జరిగిన ఏక కాలంలో సామాజిక, ఆర్థిక , రాజకీయ సమానత్వాన్ని కోరుకున్నాయని,అవే ప్రజాస్వామ్యానికి పరిపుష్టత చేకూర్చగలుతాయన్నారు. ఆలాంటి ఉద్యమాలను నడిపి నాయకులు చరిత్ర అందరికి తెలియాల్సిన అవసరముందని , ఇందకు వారి చరిత్రతో కూడిన చిన్న చిన్న పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సీనిమా హిరో, హిరోయిన్ల బయోపిక్ వస్తున్నాయని, రావి నారాయణరెడ్డి లాంటి మహాయోధుల బయో ఫిక్‌లు రావాల్సిన అవసరముందని, తద్వారా యువతకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు.



బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట రథ సారధి రావి నారాయణ రెడ్డి సూర్పితోనే ఆయన పేరు మీద ఉన్న ఇదే ఆడిటోరియం నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమానికి అంకురార్పణ జరిగిందని, రాష్ట్ర ఏర్పాటు ఆ లక్ష్యాన్ని సాధించామని చెప్పారు. సమాజం ముందుకు వెళ్లే సందర్భంలో అనేక మార్పులు సహజమని, పరిస్థితులకు అనుకూలంగా శాస్త్రీయ దృకత్పదంతో ముందుకు సాగాలని సూచించారు. మతోన్మాద శక్తులు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో 140 కోట్ల మంది జనాభా ఉంటే అందులో 75 కోట్లమంది 25 ఏళ్ల లోపు యువతే ఉన్నారని, వారంతా ఏమి తెలియని వయస్సువారు అని అన్నారు. అలాంటి వారికి మార్గదర్శకం చూపడమే రావి నారాయణరెడ్డి లాంటి మహానాయకుల నిజమైన నివాళి అవుతుందని సూచించారు. నిజాం కాలంలో ఆంధ్ర, తెలంగాణ అని ప్రజల మధ్య బేధాలు లేవని, కాని ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాతే ఈ ప్రాంత సమాగ్రాభివృద్ధికి నోచుకోకపోవడం వల్లే వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. నాడు నిజం ప్రజలను పీడించి ఆ సోమ్ముతో నిర్మించిన భవనాలను చూసి సిఎం అయిన తర్వాత కెసిఆర్ నిజాంను కీర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. రావి నారాయణరెడ్డి 60 ఏళ్ల తర్వాత అలిగి కూర్చోలేదని, రాజకీయంగా కొత్త తరం రావాలని ప్రకటించి దానిని ఆచరించారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో సాయుధ పోరాటం అసాధ్యమని, ఆత్మ విమర్శ లేని కమ్యూనిస్టు ఉద్యమం లేదని, దీనిని మావోయిస్టులు గ్రహించాలని సూచించారు. నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణ సమయంలో జరిగిన నరమేధమే ఇప్పుడు కొనసాగుతోందన్నారు. కమ్యూనిస్టు పార్టీలు, కమ్యూనిస్టు శ్రేయోభిలాషులు, దేశ ప్రజల ప్రయోజనాన్ని కాంక్షించే వారందరూ దీనిపై ఆలోచించాలని కోరారు.



ట్రస్ట్ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ఎవరూ అంగీకరించి నా, అంగీకరించక పోయినా హైదరాబాద్ సంస్థానం విమోచన ఉద్యమంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన యోధనా యోధు లు రావి నారాయణరెడ్డి, మగ్దూం మోయినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డిల పిలుపుతోనే తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తి రగిలించి, నైజంను గద్దె దించిందని అన్నారు.

## సురవరం సుధాకర్ రెడ్డి సందేశం



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట రథసారధి, స్వాతంత్ర్య సమర యోధులు రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం తన సందేశాన్ని పంపించారు. ఆ సందేశాన్ని సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి సభలో చదివి వినించారు. నిజాం నిరంకుశ కృర పాలనను అంతమోదించేందుకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట రథ సారధి రావి నారాయణరెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డిలు ఇచ్చిన పిలుపు దవణంలా వ్యాపించి, తెలంగాణ నలుమూలాల అంటుకుందని వివరించారు. ఆనాటి చరిత్ర పోరాటం నేటి యువతరానికి ఉత్తేజం కలిగించాలన్నారు. వెట్టి చాకిరి రద్దయిందన్నారు. భూ కేంద్రీకరణ బద్దలైందని,కానీ పేదలకు భూమి దక్కలేదని,ఈ లక్ష్యం అసంపూర్తిగా ఉన్నదని, దీనిని సాధించేందుకు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేద్దామని సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు.

# జనరల్
STATE & REGIONAL NEWS



### నేడు జరిగే కేబినెట్ సమావేశంలో..
## ఆర్‌టిసి కార్మిక సమస్యలపై చర్చించాలి
రవాణ శాఖ మంత్రికి టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేడు జరిగే కేబినెట్ సమావేశంలో ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై చర్చించి, పరిష్కరించేందుకు కృషి చేయాలని రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కోచైర్మన్ కె.హనుమంతు ముదిరాజ్, వైస్‌చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి కోరారు. ఇందులో ప్రధానంగా చట్ట వ్యతిరేకంగా నియమించిన వెల్ఫేర్ కమిటీలను రద్దు చేయాలని, యూనియన్లపై ఆంక్షలను ఎత్తివేయాలన్నారు. కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆర్‌టిసికి ఇవ్వాలన్నారు. అన్ని కేటగిరీలలోని ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మహాలక్ష్మి పథకంలో ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న జాబ్‌కన్సూలేట్ గైడ్‌లైన్స్ సర్క్యూలర్ 1/2019ను తెలంగాణ ఆర్‌టిసిలో కూడా అమలు చేయాలన్నారు.


తెలంగాణ ప్రభుత్వము,
రెవెన్యూ (భూ సేకరణ)శాఖ
ఫారం-6, (ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016 లోని చాప్టర్ III ఎ లోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం. 33/2025/ . తేది: 30.05.2025
జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి
ఫైల్ నెం. G/2503/2025. తేది: 28.05.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA), యాదాద్రి భువనగిరి
ఫైల్ నెం. A/35/2025, తేది: 27.05.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కాంచనపల్లి గ్రామములో విస్తీర్ణం **ఎ.9-04 ½ గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 108 I&CAD (LA.R&R/A2) Department, Dt:31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాది కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం- 2013 లోని చాప్టర్-11 (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్ - III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి ప్రాజెక్టు పునరావాసం మరియు పునరుపాది కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్ గా) నియమించనైనది.

కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం కాంచనపల్లి గ్రామములో విస్తీర్ణం **ఎ.9-04 ½ గుంటల** భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా : యాదాద్రి భువనగిరి మండలం : వలిగొండ గ్రామం : కాంచనపల్లి

| సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం) | చెట్లు / [illegible] |
|---|---|---|---|---|
| 177 ఖుష్కీ / పట్టా 0.19.5 | వట్టిపల్లి బుచ్చమ్మ భర్త యాదయ్య | వట్టిపల్లి బుచ్చమ్మ భర్త యాదయ్య | 0-19.5 | - |
| 176 ఖుష్కీ /చౌతా ఇనామ్ 0.13 | పాల్వంచ దుర్గయ్య తండ్రిగున్నయ్య | పాల్వంచ దుర్గయ్య తండ్రిగున్నయ్య | 0.0650 | - |
| | పాల్వంచ సత్తయ్య తండ్రి గున్నయ్య | పాల్వంచ సత్తయ్య తండ్రి గున్నయ్య | 0.0650 | - |
| 176 ఖుష్కీ /పట్టా 0.06 | పాల్వంచ ఆంజనేయులు తండ్రి గున్నయ్య | పాల్వంచ ఆంజనేయులు తండ్రి గున్నయ్య | 0.06 | - |
| 176 ఖుష్కీ /చౌతా ఇనామ్ 0.06 | పాల్వంచ కిషన్ తండ్రి గున్నయ్య | పాల్వంచ కిషన్ తండ్రి గున్నయ్య | 0.06 | - |
| 170 ఖుష్కీ / పట్టా 0.12.5 | వట్టిపల్లి యాదయ్య తండ్రి నర్సయ్య | వట్టిపల్లి యాదయ్య తండ్రి నర్సయ్య | 0-12.5 | - |
| 169 ఖుష్కీ / పట్టా 0.25.5 | కొలిచెలిమి మీనయ్య తండ్రి రోశయ్య | తొలిచెలిమి మీనయ్య తండ్రి రోశయ్య | 0.0650 | - |
| | కొలిచెలిమి మల్లేశం తండ్రి అబ్బయ్య | కొలిచెలిమి మల్లయ్య తండ్రి చిన అబ్బయ్య | 0.10 | - |
| | కొలిచెలిమి జంగయ్య తండ్రి లింగయ్య | కొలిచెలిమి జంగయ్య తండ్రి లింగయ్య | 0.0450 | - |
| | కొలిచెలిమి మల్లమ్మ భర్త యాదగిరి | కొలిచెలిమి యాదయ్య తండ్రి నర్సయ్య | 0.0450 | - |
| 171 ఖుష్కీ / పట్టా 0.03.5 | జక్క శ్రీకాంత్ రెడ్డి తండ్రి జక్క రఘుపతి రెడ్డి | జక్క శ్రీకాంత్ రెడ్డి తండ్రి జక్క రఘుపతి రెడ్డి | 0.02 | - |
| | జక్క చెన్న క్రిష్ణా రెడ్డి తండ్రి శ్రీనివాస్ రెడ్డి | జక్క చెన్న క్రిష్ణా రెడ్డి తండ్రి శ్రీనివాస్ రెడ్డి | 0.01 ½ | - |
| 168 ఖుష్కీ / పట్టా 0.22 | జక్క మహేందర్ రెడ్డి తండ్రి యాదవ రెడ్డి | జక్క మహేందర్ రెడ్డి తండ్రియాదవ రెడ్డి | 0-22 | - |
| | జక్క సుధాకర్ రెడ్డి తండ్రి యాదవ రెడ్డి | జక్క సుధాకర్ రెడ్డి తండ్రి యాదవ రెడ్డి | | |
| 211 ఖుష్కీ / పట్టా 0.10 | నిమ్మరెడ్డి మాధవ రెడ్డి తండ్రి సత్తి రెడ్డి | నిమ్మరెడ్డి మాధవ రెడ్డి తండ్రి సత్తి రెడ్డి | 0.05 | - |
| | | బాటా | 0-00.5 | - |
| | పైళ్ళ భాస్కర్ రెడ్డి తండ్రి జనార్దన్ రెడ్డి | పైళ్ళ భాస్కర్ రెడ్డి తండ్రి సత్తి రెడ్డి | 0.0450 | - |
| 209 ఖుష్కీ / పట్టా 0.17 | మామిడి రంగా రెడ్డి తండ్రి ముత్యం రెడ్డి | మామిడి రంగా రెడ్డి తండ్రి ముత్యం రెడ్డి | 0.17 | - |
| 208 ఖుష్కీ / పట్టా 0.05.5 | మోర అక్షయ తండ్రి లక్ష్మీ కాంత రెడ్డి | మోర అక్షయ తండ్రి లక్ష్మీ కాంత రెడ్డి | 0-05.5 | - |
| | మన్నెం కృష్ణ రెడ్డి తండ్రి రామ్ రెడ్డి బల్గురి ధనలక్ష్మి భర్త ధర్మ రెడ్డి మొర వర్షిణి తండ్రి లక్ష్మి కాంత్ రెడ్డి | మొర భారతమ్మ భర్త మంగా రెడ్డి మోర హర్షవర్ధన్ రెడ్డి తండ్రి వెంకట రెడ్డి | | |
| 199 ఖుష్కీ / పట్టా 0.14 | మోర హర్ష వర్ధన్ రెడ్డి తండ్రి వెంకట్ రెడ్డి | మోర అక్షయ తండ్రి లక్ష్మీ కాంత రెడ్డి | 0.14 | - |
| | మోర భారతమ్మ భర్త మంగా రెడ్డి | మోర బారతమ్మ భర్త మంగా రెడ్డి | | |
| 206 ఖుష్కీ / పట్టా 0.07 | మోర భారతమ్మ భర్త మంగా రెడ్డి | మోర లక్ష్మీ కాంత రెడ్డి తండ్రి మంగా రెడ్డి | 0-03 | - |
| | మోర భారతమ్మ భర్త మంగా రెడ్డి | మోర వెంకట రెడ్డి తండ్రి మంగా రెడ్డి | | |
| | మోర భారతమ్మ భర్త మంగా రెడ్డి | మన్నెం రామ్ రెడ్డి తండ్రి వీరా రెడ్డి | 0-04 | - |
| 216 ఖుష్కీ / పట్టా 0.17 | మన్నెం లచ్చిరెడ్డి తండ్రి వీరా రెడ్డి | మన్నెం లచ్చిరెడ్డి తండ్రి వీరా రెడ్డి | 0.07 | - |
| | | రోడ్ | 0-01 | - |
| | మన్నెం లచ్చిరెడ్డి తండ్రి వీరా రెడ్డి | మన్నెం పుష్ప భర్త రవీందర్ రెడ్డి | 0.03 | - |
| | పడమటి లావణ్య భర్త శ్రీనవాస్ రెడ్డి | పడమటి లావణ్య భర్త శ్రీనవాస్ రెడ్డి | 0.06 | - |
| 215 ఖుష్కీ / పట్టా 0.22.5 | పడమటి శ్రీనవాస్ రెడ్డి తండ్రి దాన్ రెడ్డి | పడమటి శ్రీనవాస్ రెడ్డి తండ్రి దాన్ రెడ్డి | 0-05 | - |
| | బొమ్మిడి సుమంత్ రెడ్డి తండ్రి లక్ష్మీ కాంత రెడ్డి | మోర వర్షిణి తండ్రి లక్ష్మీ కాంత రెడ్డి | 0-17.5 | - |
| | బొమ్మిడి సుమంత్ రెడ్డి తండ్రి లక్ష్మీ కాంతరెడ్డి | మోర అక్షయ తండ్రి లక్ష్మీ కాంత రెడ్డి | | |
| 319 ఖుష్కీ / పెట్టా 0.38.5 | పెద్దింటి మధుసూదన్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి | కొమిరెల్లి సంజన భర్త మాధవ రెడ్డి | 0.0750 | - |
| | పెద్దింటి దామోదర్ రెడ్డి తండ్రి చిన్న రాజ మల్లారెడ్డి | పెద్దింటి దామోదర్ రెడ్డి తండ్రి చిన్న రాజమల్లారెడ్డి | 0.11 | - |
| | పెద్దింటి కావ్య తండ్రి దామోదర్ రెడ్డి | పెద్దింటి జానమ్మ భర్త సత్తిరెడ్డి | 0.07 | - |
| | పెద్దింటి కావ్య తండ్రి దామోదర్ రెడ్డి | కొమిరెల్లి ఉమ భర్త బాలకృష్ణా రెడ్డి | 0.06 | - |
| | సోలిపురం లావణ్య భర్త శేకర్ రెడ్డి | సోలిపురం కిష్టమ్మ భర్త అంతి రెడ్డి | 0.0350 | - |
| | పెద్దింటి మధుసూదన్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి | పెద్దిటి అంజిరెడ్డి తండ్రి పెద్ద మల్లారెడ్డి | 0.0350 | - |
| 331 ఖుష్కీ / పట్టా 0.17 | చిట్యాల ఎల్లమ్మ భర్త నరసయ్య | చిట్యాల ఎల్లమ్మ భర్త నరసయ్య | 0.17 | - |
| | చిట్యాల జంగయ్య తండ్రి పొచయ్య | చిట్యాల జంగయ్య తండ్రి పొచయ్య | | |
| 332 ఖుష్కీ / పెట్టా 0.19 | జక్క మహేందర్ రెడ్డి తండ్రి పద్మా రెడ్డి | జక్క మహేందర్ రెడ్డి తండ్రి పద్మా రెడ్డి | 0.16 | - |
| | | బాట | 0.0050 | - |
| | ఎడ్మ అనంత రెడ్డి తండ్రి వీరా రెడ్డి | ఎడ్మ నరసింహ రెడ్డి తండ్రి వీరా రెడ్డి | 0.0250 | - |
| 333 ఖుష్కీ / పెట్టా 0.17.5 | ఎడ్మ నరసింహ రెడ్డి తండ్రి వీరా రెడ్డి | ఎడమ నరసింహ రెడ్డి తండ్రి వీరారెడ్డి | 0.09 | - |
| | వాకిటి లీనా భర్త జితేందర్ రెడ్డి | వాకిటి లీనా భర్త జితేందర్ రెడ్డి | 0.0850 | - |
| 334 ఖుష్కీ / పట్టా 0.17 | ఎడ్మ నరసింహ రెడ్డి తండ్రి వీరా రెడ్డి | ఎడ్మ నరసింహ రెడ్డి తండ్రి వీరారెడ్డి | 0.05 | - |
| | వాకిటి లీనా భర్త జితేందర్ రెడ్డి | వాకిటి లీనా భర్త జితేందర్ రెడ్డి | 0.07 | - |
| | | బాట | 0.0050 | - |
| | ఎడ్మ జంగా రెడ్డి తండ్రి వీరారెడ్డి | ఎడ్మ జగన్ మోహన్ రెడ్డి తండ్రి వీరా రెడ్డి | 0.0450 | - |
| 335 ఖుష్కీ / పట్టా 0.19 | వాకిటి లీనా భర్త జితేందర్ రెడ్డి | ఎడ్మ వెంకట్ రెడ్డి తండ్రి వీరా రెడ్డి | 0.09 | - |
| | ఎడ్మ నరసింహ రెడ్డి తండ్రి వీరా రెడ్డి | ఎడ్మ మంగమ్మ భర్త వెంకట రెడ్డి | 0.10 | - |
| 357 ఖుష్కీ / పట్టా 0.04 | | బాట | 0.0050 | - |
| | పెద్దింటి నర్సింహ్మా రెడ్డి తండ్రి రాజ వీరా రెడ్డి | పెద్దింటి సత్తి రెడ్డి తండ్రి రాజ వీరా రెడ్డి | 0.0350 | - |
| 322 ఖుష్కీ /లావుణి పట్టా 0.07 | | బాట | 0.0050 | - |
| | కొమిరెల్లి ప్రేమలత భర్త బాల్ రెడ్డి | పెద్దింటి సత్తి రెడ్డి తండ్రి రాజవీరా రెడ్డి | 0.04 | - |
| | కొమిరెల్లి రమ భర్త బాలకృష్ణ రెడ్డి | పెద్దింటి అంజి రెడ్డి తండ్రి పెద్ద మల్లా రెడ్డి | 0.0250 | - |
| 321 ఖుష్కీ పెట్టా 0.08.5 | పెద్దింటి సత్తిరెడ్డి తండ్రి రాజ వీరారెడ్డి | పెద్దింటి అంజి రెడ్డి తండ్రి పెద్ద మల్లా రెడ్డి | 0.02 | - |
| | పెద్దింటి జంగా రెడ్డి తండ్రి యాదిరెడ్డి | ఎంపాల జ్యోతి భర్త సుధాకర్ రెడ్డి | 0.0350 | - |
| | పెద్దింటి నర్సింహా రెడ్డి తండ్రి రాజవీర రెడ్డి | పెద్దింటి అంజి రెడ్డి తండ్రి పెద్ద మల్లారెడ్డి | 0.03 | - |
| 324 ఖుష్కీ / పట్టా 0.08 | పెద్దింటి నరసింహా రెడ్డి తండ్రి రాజ వీరారెడ్డి | పెద్దింటి నరసింహా రెడ్డి తండ్రి రాజ వీరారెడ్డి | 0.04 | - |
| | పెద్దింటి మధుసూదన్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి | పెద్దింటి మధుసూదన్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి | 0.04 | - |
| 207 ఖుష్కీ / పట్టా 0.08 | మన్నెం భాస్కర్ రెడ్డి తండ్రి రాంరెడ్డి | మన్నెం రాంరెడ్డి తండ్రి వీరా రెడ్డి | 0.02 | - |
| | మోర జంగా రెడ్డి తండ్రి మంగా రెడ్డి | మన్నెం పుష్ప భర్త రవీందర్ రెడ్డి | 0.02 | - |
| | మోర జంగా రెడ్డి తండ్రి మంగా రెడ్డి | పడమటి శ్రీనివాస్ రెడ్డి s/0 దాన్ రెడ్డి | 0.02 | - |
| | | రోడ్ | 0-02 | - |
| | | మొత్తం విస్తీర్ణం | 09-04.5 | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్నిపొందే హక్కు ( తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిభందనలను అనుసరించి సంబధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియుప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/ తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), ఆర్ అండ్ ఆర్, విభాగము-2 ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి
DIPR RO NO.185/LA/PP/Advt/Pub/2025-26


# ఇంటింటికీ సిపిఐ ప్రచార కార్యక్రమాలు

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కమిటీ ఏర్పాటు

సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే, కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/దుండిగల్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లోని (మహారాజ గార్డెన్)లో 2025, ఆగస్టు 1922 వరకు జరుగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా షాపూర్‌నగర్ ఎఐటియుసి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘం సమావేశానికి సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశం సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏసూరి.జోస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు నిర్వహించుకునే అవకాశం ఇచ్చిన సిపిఐ మేడ్చల్ జిల్లా సమితికి వారు అభినందనలు తెలిపారు. కుత్బుల్లాపూర్‌లో జరుగనున్న రాష్ట్ర మహాసభలకు జాతీయ నేతలు, అన్ని జిల్లాల నుండి దాదాపు 1000 మంది పార్టీ ప్రతినిధులు హాజరై, ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై, రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కులపై, చర్చలు జరిపి తీర్మానాల రూపంలో భవిష్యత్ పోరాటాలకు మహాసభ వేదిక కానుందన్నారు. అందుకే రాష్ట్ర మహాసభల విజయవంతానికి ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త ప్రజల వద్దకు కరపత్రాలను పంచి, మహాసభల విజయవంతానికి హార్దిక, ఆర్థిక సహాయ సహకారాలు తీసుకొని, ప్రజలను భాగస్వామ్యం చేయాలని వారు పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, అమాయక గిరిజనులను హతమారుస్తున్నదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణమే నిలిపివేయాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, సీజ్ ఫైర్‌ను ప్రకటించాలని సిపిఐ డిమాండ్ చేస్తోందన్నారు. కాశ్మీర్ పహల్గాంలో దేశ పౌరులపై నలుగురు ఉగ్రవాదులు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల ఘటనలో 27మందికి పైగా మరణించారని, అయితే కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఆ నలుగురు ఉగ్రవాదులను పట్టుకోకుండా [illegible] అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెబుతున్న మాటలు వింటే, మన దేశ ప్రధాని నరేంద్రమోదీ ట్రంప్‌కు దేశాన్ని తాకట్టు పెట్టారని ఆరోపించారు. భారతదేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టిన మోదీకి దేశ ప్రధానిగా కొనసాగే నైతికత లేదని వారు విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ, సిపిఐ సీనియర్ నేత పిజె.చంద్రశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు [illegible] రాష్ట్ర మహాసభల నిర్వహణ అంటే పార్టీ నూతనోత్తేజం, పార్టీ ఎదుగుదలకు తార్కాణం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు ఎండి.యూసుఫ్, సిపిఐ మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నేత పిజె.చంద్రశేఖర్, ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎం.నర్సింహ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డిజి.సాయిలుగౌడ్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఇ.ఉమామహేష్, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు యేసుర్తం, జి.దామోదర్‌రెడ్డి, జి.లక్ష్మి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.లక్ష్మణ్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.స్వామి, హరినాథ్‌రావు, ఎస్.శంకర్‌రావు, శంకర్, టి.శత్య ప్రసాద్, కృష్ణ, సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు దశరథ్, సహదేవ్, శశిధర్ రెడ్డి, సల్మాన్ బేగ్, యాదయ్య, మాధవి పాల్గొన్నారు



# ఇందిరా భవన్‌లో మంత్రులతో ముఖాముఖి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో అప్పటి సిఎం కెసిఆర్ నీళ్లలా ప్రజాధనం దుర్వినియోగం చేశారని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కాళేశ్వరం బ్యారేజీల కుంగుబాటుపై జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణకు ఎవరినైనా పిలిచే అవకాశం ఉందన్నారు. ఎవరిని పిలవాలనేది కమిషన్ ఇష్టమన్నారు. ఇందిరాభవన్‌లో బుధవారం మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం తిరిగి ప్రారంభమైంది. కార్యక్రమంలో ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. భూ పంచాయతీలు, సీనియర్ సిటిజన్ ఇష్యూస్, ఉద్యోగ అవకాశాలు, పార్టీలో పదవులు తదితర సమస్యలను మంత్రి ప్రజల నుంచి సావధానంగా వింటూ వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సాగు నీరు ఇస్తే సంతోషమేనని, కానీ నీళ్ళ మాదిరిగా తెలంగాణ ధనాన్ని దోచుకున్నారన్నారు. బిఆర్ ఎస్ పార్టీలో గొడవలు టీ కప్పులో తుఫాన్ లాంటివని, పార్టీ ఉనికి కోసం బిఆర్‌ఎస్ డ్రామాలు ఆడుతున్నారని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజకీయంగా దృష్టి మళ్ళించేందుకు బిఆర్‌ఎస్ ప్రయత్నం చేస్తున్నదన్నారు. కెటిఆర్, కవిత పంచాయతీ కాంగ్రెస్‌కు అవసరం లేదన్నారు. కవిత రాజకీయ ఉనికి కోసమే పోరాటం చేస్తున్నారని, వార్తల కోసమే లేఖలు రాశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బిఆర్ ఎస్ నేతలు పిల్లి శాపనార్థాలు పెట్టడం పరిపాటిగా మారిందన్నారు.



# మహిళల విముక్తి, సమానత్వం, సాధికారితే లక్ష్యంగా

ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ సమరశీల పోరాటాలు : ప్రేమ్ పావని

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల విముక్తి, సమానత్వం, సాధికారితే లక్ష్యంగా నిరంతరం సమరశీల పోరాటాలను నిర్వహిస్తున్న ఘనచరిత్ర భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ)దేనని సీనియర్ నాయకురాలు ప్రేమ్‌పావని అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య 71వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను బుధవారం హైదరాబాద్‌లోని మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత జాతీయ మహిళా సమాఖ్య పతాకాన్ని ప్రేమ్‌పావని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అరుణ అసఫాలి, రేణు చక్రవర్తి, అజారాబేగం, విమల ఫరుఖి, గీతాముఖర్జీ లాంటి మహిళా ఉద్యమ నేతల సారథ్యంలో ఏర్పడిన మహిళా సమఖ్య బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, సనాతన భావాలకు నిరసనగా ఉద్యమించి అనేక విజయాలు సాధించిందని గుర్తుచేశారు. బాల్యవివాహాల రద్దు సతీసహగమన రద్దు, వరకట్న నిషేధ చట్టం, విద్యా హక్కు చట్టం, సమాన పనికి సమాన వేతన చట్టం, గృహహింస నిరోధక చట్టం తీసుకురావడంలో ఎనలేని కృషి చేసిందని చెప్పారు. ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు నిరసన తెలియజేసే హక్కు ఉంటుందని,ఈ హక్కును కాలరాస్తూ కేంద్ర, రాష్ట్ర పాలకులు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ఉద్యమకారులపై పెట్టిన కేసులు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, ఫైమీద, జె.లక్ష్మి పడాల నళిని మాట్లాడుతూ మిస్ వరల్డ్ 25 అందాల పోటీల్లో పాల్గొన్న సుందరీమణులపై జరిగిన అసభ్యకర విధానంపై న్యాయ విచారణ జరిపి దోషులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజ కృష్ణమూర్తి, జి.హైమావతి, మాధవి, ప్రమీల నర్సమ్మ, మహాలక్ష్మి , విజయలక్ష్మి పాల్గొన్నారు.

# హామీల అమలులో కేంద్రం విఫలం

పునర్విభజన హామీలపై పోరాడుతాం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు

ముగిసిన సిపిఐ 4వ మహాసభలు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పునర్విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను సైతం నెరవేర్చలేదు. వాటిపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సిపిఐ జనగామ జిల్లా నాల్గవ మహాసభల సందర్భంగా నర్మెట మండల కేంద్రంలో జరిగిన ప్రతినిధుల సభను తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. వినాయక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన మహాసభల ప్రాంగణంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ జెండావిష్కరణ చేశారు. అమరవీరుల స్థూపం వద్ద సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి, పాతూరి సుగుణమ్మతో పాటు పలువురు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గుగులోతు సఖి, ఆది సాయన్న, మోతే శ్రీశైలం అధ్యక్షవర్గంగా వ్యవహరించగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో గత మూడు పర్యాయాలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. 2014 తెలంగాణ పునర్విభజన సందర్భంగా కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ప్లాంట్, గిరిజన యూనివర్సిటీ వంటి హామీలను సైతం పూర్తిగా నెరవేర్చలేదని మండిపడ్డారు. కోచ్ ఫ్యాక్టరీ మూలంగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని, ఉత్తర, దక్షిణ భారతదేశానికి కూడలిగా ఉన్న ఖాజీపేటను రైల్వే డివిజన్‌గా ప్రకటించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ నుండి ఖాజీపేట వరకు ఇండస్ట్రీయల్ కారిడార్ ప్రకటించి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు. అదేవిధంగా మినీ టెక్స్‌టైల్ పార్క్, ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్, పాడి పరిశ్రమ అభివృద్ధి వంటి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ పరిష్కరించి జనగామ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్.రాజారెడ్డి మాట్లాడుతూ ప్రజల పార్టీగా సిపిఐ ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమించిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ప్రైయివేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ప్రైయివేట్ హాస్పటల్స్ దోపిడిని అరికట్టాలన్నారు. జిల్లాలో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాల నివేదికను ప్రవేశ పెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగాఆమోదించారు. మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆదిసాయన్న, ఆకుల శ్రీనివాస్, చొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువారి రమేష్, పాతూరి రమేష్, జీడి ఎల్లయ్య, బోనగిరి కుమారస్వామి, నీలకనకయ్య, కామకూర యాకూబ్, మోటే శ్రీశైలం, గుగులోతు సఖి, ఎస్.రాజు పాల్గొన్నారు.

**ముగిసిన మహాసభలు :**
జనగామ జిల్లా మహాసభలు రెండు రోజుల పాటు నర్మెట మండల కేంద్రంలో జరగగా బుధవారం ముగిశాయి. శనివారం మహాసభల ప్రారంభం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం ప్రతినిధుల సభ ప్రారంభం కాగా గుగులోతు సఖి, ఆది సాయన్న, మోటే శ్రీశైలం అధ్యక్షవర్గంగా ప్రిసీడియం సభ్యులుగా వ్యవహరించారు. జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజారెడ్డి నివేదిక ప్రవేశపెట్టగా ప్రతినిధులు చర్చలో పాల్గొని ఏకగ్రీవంగా ఆమోదించారు. సభలో పలు తీర్మానాలు చేశారు.

### సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శిగా సిహెచ్ రాజారెడ్డి



సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్.రాజారెడ్డి ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు నర్మెట మండలంలో మహాసభలు జరగగా 25 మంది జిల్లా కమిటీ సభ్యులు, 9 మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా సిహెచ్ రాజారెడ్డి ఎన్నిక కాగా, సహాయ కార్యదర్శులుగా ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ జనగామ జిల్లా ఉద్యమాలకు కేంద్ర మన్నారు. వెనకబడిన జిల్లాగా ఉన్న జనగామను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ప్రజా సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని, భవిష్యత్తులోనూ అదే తరహాలో పోరాటాలు చేస్తామన్నారు. సిపిఐ నిర్వహించే పోరాటాలకు జిల్లా ప్రజలు సహకరించాలని కోరారు.

# రాజకీయ దురుద్దేశంతోనే కెసిఆర్‌కు నోటీసులు

ధర్నాచౌక్ వద్ద మహా ధర్నాలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయ దురుద్దేశంతోనే కెసిఆర్‌కు కాళేశ్వరం కమిషన్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు జారీ చేయించిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఎస్ఎల్ బిసి టన్నల్ కూలిపోతే ఎన్‌డిఎస్ఎ ఏంచేస్తున్నదని, కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని, ఈ విషయంలో కాంగ్రెస్, బిజెపి కుమ్మక్కయ్యాయని మండిపడ్డారు. కెసిఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు, ధర్నాచౌక్ వద్ద బుధవారం మహా ధర్న జరిగింది. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ కాళేశ్వరం లేకపోతే 35 శాతం తెలంగాణ భూభాగం ఎడారిగా మారే ప్రమాదం ఉన్నదని, అందుకే తక్షణమే మేడిగడ్డ బ్యారేజీకి మరమత్తులు చేపట్టి, పొలాలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే 40 టిఎంసిలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు వస్తాయని వివరించారు. ఈ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఎపి ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సిఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడంలేదని ప్రశ్నించారు. తెలంగాణ నీళ్లను ఎపికి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయలేదని, గోదావరి పెన్నా అనుసంధానం పేరుతో నీళ్లు తరలింపును తక్షణమే అడ్డుకోవాలని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని ఆమె డిమాండ్ చేశారు. చంద్రబాబు ఎన్‌డిఎలో ఉండడంతోనే జలదోపిడి విషయంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిజెపి నాయకులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, కేంద్ర మంత్రులు ప్రశ్నించడం లేదన్నారు. ఈ విషయంలో ఈటల రాజేందర్ కూడా మాట్లడకపోవడం శోచనీయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ తీసుకోవాలన్నారు. తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షులు దాస్యం విజయభాస్కర్, జాగృతి నాయకులు సంపత్ గౌడ్, మరిపెల్లిమాధవి, రాము యాదవ్, యుపిఎఫ్ కన్వీనర్ బొల్లా శివశంకర్, నాయకులు ఆలకుంట హరి,ఆర్ వి మహేందర్, కోల శ్రీనివాస్, నరహరి, విజయేంద్ర సాగర్, ఎ.దత్తాత్రేయ పాల్గొన్నారు.

**మహాధర్నాకు బిఆర్‌ఎస్ దూరం : ఒంటరైన కవిత..!**
కెసిఆర్‌కు 'కాళేశ్వరం కమిషన్ నోటీసులు' జారీ చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ జాగృతి చేపట్టిన ధర్నాకు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ హాజరుకాకుండా దూరంగా ఉన్నారు. కెసిఆర్‌కు నోటీసులు జారీ చేస్తే తెలంగాణ సమాజానికి నోటీసులు ఇచ్చినట్టేనని, నోటీసుల జారీకి నిరసనగా నిరసన కార్యక్రమాలను నిర్వహించలేదని కవిత అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించినప్పటికీ బిఆర్‌ఎస్ తరపున ఏ ఒక్కరూ రాలేదు. తెలంగాణ జాగృతి రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తామని ప్రకటించిన తర్వాత కవిత చేపట్టిన మొదటి నిరసన ధర్నాకు 'జన సమీకరణ' చేపట్టడంలో జాగృతి కొంత వరకు సఫలీకృతం అయిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్
NIT No. 06/EE/GHMC/DIV-21/2025-26 టెండర్ ప్రకటన ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా) తేది: 04.06.2025
నం. 06/EE/GFIMC/DIV-21/2025-26 (ఐటమ్ నం. 01 నుండి 06 వరకు) తేదీ: 04.06.2025 ప్రకారం టెండర్లను 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆహ్వానించడమైనది. (06) పనులకు అంచనా వ్యయం: రూ.15.32 లక్షలు. తేది: 05.06.2025న ఉదయం 11.00 గంటల నుండి 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో బిడ్ల అమ్మకం తెరిచి ఉంటుంది. బిడ్ల సమర్పణకు చివరి తేదీ: 06.06.2025 ఉదయం 11.00 గంటలకు. బిడ్ల అమ్మకం సమర్పణ సమయానికి ఒక గంట ముందు ముగుస్తుంది. మరిన్ని వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, ఎస్ఎల్‌పి జోన్ :: జిహెచ్ఎంసి
DIPR R.O. No. : 3138-PP/CL/ADVT/1/2025-26, Date: 04-06-2025

**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్**
కొటేషన్ల ఆహ్వాన ప్రకటన
Roc No : కొటేషన్ నోటీసు నం.03/GWMC/National Flag/2025, తేది: 03.06.2025
**పని పేరు:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని భద్రకాళి కట్ట వద్ద జాతీయ జెండా నిర్వహణకు రేట్ల కోసం ప్రముఖ కాంట్రాక్టర్లు / ఏజెన్సీ నుండి సీల్డ్ కొటేషన్లను ఆహ్వానించడమైనది.
**పని యొక్క వివరణలు:** www.gwmc.gov.inలో అప్‌లోడ్ చేయబడిన పత్రంలో వివరించిన విధంగా.
**అర్హత:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని భద్రకాళి కట్ట వద్ద జాతీయ జెండా నిర్వహణకు రేట్ల కోసం ప్రముఖ ఏజెన్సీ / కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి.
**తేదీలు:** సీల్డ్ కొటేషన్లు పత్రం ప్రకారం నిర్దేశించిన ఫార్మాట్‌లో 12.06.2025న సాయంత్రం 4.30 గంటలకు లేదా అంతకు ముందు పోస్ట్ / హ్యాండ్ ద్వారా సంతకం చేయబడినవి చేరాలి.
**గమనిక:** తేదీ:04.06.2025 నుండి ఈ పత్రం జిడబ్ల్యుఎంసి వెబ్‌సైట్ అనగా www.gwmc.gov.inలో అందుబాటులో ఉండును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిడబ్ల్యుఎంసి.
DIPR R.O. No. : 3096-PP/CL/ADVT/1/2025-26, Date: 04-06-2025

తెలంగాణ ప్రభుత్వం
**DPH & FW / SHTO కార్యాలయం, హైదరాబాద్.**
RC నం. 152/SHTO/HYD/2024 తేది: 28.5.2025
ప్రభుత్వ వాహనాల అమ్మకానికి ఇ-వేలం టెండర్ ప్రకటన
DPH & FW/ SHTO నియంత్రణలో ఉన్న స్క్రాప్ వాహనాల కోసం RVSF కేంద్రాలు మరియు ఇతరుల నుండి కొటేషన్లు ఆహ్వానించడమైనది. 'ఉన్న చోట ఉన్నది ఉన్నట్లుగానే' 'ఏది ఉందో అలాగే' మరియు రికోర్స్ ప్రాతిపదిక లేదు. www.auction.telangana.gov.in వెబ్‌సైట్‌లో మరియు క్రింద ఇవ్వబడిన వివరాల ప్రకారం వీటిని ఆన్‌లైన్‌లో వేలం వేయబడుతోంది. ఇ-వేలం కోసం మొత్తం స్క్రాప్ వాహనాల సంఖ్య క్రింద ఇవ్వబడింది.
**1. తేలికపాటి మధ్యస్థ మోటారు వాహనాలు - 76**
**ఇ-వేలం షెడ్యూల్ క్రింద ఇవ్వబడిన విధముగా:**
**1.** నోటిఫికేషన్ తేదీ: 04.06 2025, **2.** సైట్లో తనిఖీ తేదీలు : 04.06.2025 వరకు 17.06.2025, **3.** KYC పత్రాలు మరియు ఇఎండి డిపాజిట్ రుజువుతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: 20.06 2025, **4.** ఇ-వేలం తేదీ : 23.06.2025, **5.** బ్యాలెన్స్ డిపాజిట్ చివరి తేదీ: 28.06.2025, **6.** లాట్ల డెలివరీ: 30.06 2025 నుండి 10-07-2025 వరకు.

| క్ర. సం. | సైట్ యొక్క స్థానం & లాట్ నం | స్క్రాప్ వాహనాల సంఖ్య | వాహనాల తరగతి | మొత్తం లాట్లు | ప్రతి లాట్‌కి వాహనాలు |
|---|---|---|---|---|---|
| 1 | రాష్ట్ర ఆరోగ్య రవాణా సంస్థ హైదరాబాద్ (15) లాట్ | 75 | స్వరాజ్ మాజ్దా / ఐచర్ / టాటా సుమో, స్పెసియో / మారుతి / ఫోర్స్ / మహీంద్రా / బెడ్ఫోర్డ్ | 16 | 5 |
| 2 | లాట్ -16 ఇన్నోవా | 1 | | | |

ఏదైనా సమాచారం కోసం దయచేసి శ్రీ.బి.తిరుపయ్య SHTO, మొబైల్ నంబర్: 9848409847 మరియు సురేష్, ఐటీ మేనేజర్, మొబైల్ నంబర్: 9908556100 ను సంప్రదించండి.
సం/- డాక్టర్ బి. రవీందర్ నాయక్, MBBS, DCH
డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్, హైదరాబాద్
DIPR R.O. No. : 3136-PP/CL/ADVT/1/2025-26, Date: 04-06-2025

ప్రజాపక్షం
గురువారం, 05 జూన్

# అభివృద్ధి నిర్వచనం ఏమిటి?

మన దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతున్నదని, ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతున్నదని కేంద్ర ప్రభుత్వం పదేపదే చెప్పుకోవడం కేవలం ఆత్మస్తుతి మాత్రమే. అభివృద్ధికి సరైన నిర్వచనం లేని ప్రకటనల్లో అర్థం ఏముంది? ఒకప్పుడు వజ్ర వైఢూర్యాలు... బంగారం, వెండి నిల్వల ఆధారంగా ఒక దేశ అభివృద్ధిని, ఘనతను లెక్కించేవారు. ప్రజలతో ప్రమేయంగానీ, వాస్తవ పరిస్థితులతో సంబంధంగానీ లేని ఈ డొల్లకాన్ని సృష్టించేవారు. ఈ విధానాన్ని తప్పుపట్టిన ఆడమ్ స్మిత్, మూలధన నిల్వల మొత్తాన్ని ప్రామాణికంగా పేర్కొన్నారు. కానీ, అక్కడ కూడా ప్రజల ఉనికి లేదు. వారి కష్టసుఖాల ప్రస్తావన లేదు. ఒక రాజ్యంలో సంపద ఎంత ఉంది? అనే విషయం కంటే, ప్రజల జీవన ప్రమాణం ఏ విధంగా ఉంది అనేది కీలకం. కొద్దిమంది వ్యక్తులు, సంస్థల చేతిలో కేంద్రీకృతమైన సంపదను, ప్రజలందరికీ వర్తింప చేసి, గణాంకాలను ఘనంగా ప్రకటించడం అభివృద్ధి అనిపించుకోదు. ప్రజలకంటే దేశం ఉన్నతమైనదన్న అభిప్రాయాన్ని నరనరాల్లోకి ఇంకించ చేసిన రాజాధిపతులు, పాలకులు శతాబ్దాలుగా తప్పుడు లెక్కల గంతలు కడుతునే ఉన్నారు. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)... దాని ఆధారంగా తలసరి ఆదాయాన్ని గణించి, గణాంకాల జిమ్మిక్కులతో కాలం గడిపేస్తునే ఉన్నారు. జరిగిన అభివృద్ధి... పెరిగిన సంపదల వికేంద్రీకరణ కనిపించదు. దేశ ప్రజల నిజ పరిస్థితులపై పట్టింపు ఉండదు. కార్పొరేట్ కంపెనీలకు గుత్తాధిపత్య ప్రయోజనాలు కట్టబెట్టడాన్ని 'జాతీయ ప్రయోజనం'గా అభివర్ణించే దుర్మార్గపు పోకడలే నేడు రాజ్య విధానాలయ్యాయి. ప్రజా ప్రయోజనాలను ప్రోత్సహించాల్సిన కేంద్రం, అందుకు భిన్నంగా 'రాజ్య క్షేమం' అనే సెంటిమెంటును ముందుకునెట్టి ఆటలాడుతున్నది. ఆర్థిక పరిభాషలో 'అభివృద్ధి' పదానికి ఉన్న వాస్తవ అర్థాన్ని మరుగు పరిచి, జిడిపి స్థాయిని దేశ శ్రేయస్సు సూచికగా మోదీ సర్కారు చేస్తున్న హడావుడికి నీతి ఆయోగ్ సిఇఒ బివిఆర్ సుబ్రహ్మణ్యం ప్రకటనే నిదర్శనం. భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని, జిడిపి పరిమాణం పరంగా జపాన్‌ను అధిగమించి, ఇప్పుడు 4 ట్రిలియన్ డాలర్లను దాటిందనేది ఆ ప్రకటన సారాంశం. జపాన్ కంటే మన దేశ విస్తీర్ణం దాదాపు 9.8 రెట్లు, జనాభాలో 11.6 నుంచి 12 రెట్లు పెద్దదనే వాస్తవాన్ని సుబ్రహ్మణ్యం ప్రస్తావించలేదు. భారతదేశం త్వరలో 5 ట్రిలియన్ డాలర్ల జిడిపిని సాధిస్తుందని కొంతకాలం క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను పునరుద్ఘాటించడంలో అర్థం ఏమిటో? అభివృద్ధి అనే పదాన్ని కేవలం జిడిపికి ఆపాదించి, గణాంకాల గారడీతో పూర్తిగా తప్పుడు సమాచారాన్ని ఇవ్వడాన్ని మించిన దిగజారుడుతనం వేరే ఏముంటుంది? ఎప్పుడో కాలం చెల్లిన మాల్థస్ జనాభా సిద్ధాంతానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కొత్తగా జీవంపోయడానికి ప్రయత్నిస్తున్నది. పాత దృక్పథమే నిజమని ప్రజలను నమ్మించడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నది. దేశాన్ని శర వేగంగా తిరోగమనంలో తీసుకెళుతున్నది. జిడిపి ఆధారంగా దేశ అభివృద్ధిని, ప్రజల శ్రేయస్సును కొలవడంలో హేతుబద్ధత లేదు. ఇది ప్రజాస్వామ్య సమాజానికి అన్వయించదు. ప్రజాస్వామ్యంలో ప్రజల జీవన పరిస్థితులు ముఖ్యం. ఈ పరిస్థితులు ఎంతవరకు మెరుగుపడుతున్నాయనే విషయం ఆధారంగానే పురోగతిని కొలవాలి. అప్పుడే దేశ నిజమైన అభివృద్ధి తెలుస్తుంది. అంతేగానీ, జపాన్‌ను జిడిపిలో అధిగమించిన దేశంగా భుజకీర్తులు తగిలించుకోవడం వల్ల కేంద్రానికి రాజకీయ ప్రయోజనాలే తప్ప, ప్రజలకు ఒరిగేది శూన్యం. ప్రజలు లేకుండా దేశాన్ని ప్రస్తావించడం... జాతీయోత్పత్తిని అభివృద్ధికి గీటురాయిగా పేర్కొనడం ఆత్మవంచన. ఇలాంటి గణాంకాలు.... జిడిపి పెరుగుదల లెక్కలతో ప్రజల జీవనస్థితికి ఎలాంటి సంబంధం లేదు. నిరంకుశపాలనలోకి దేశాన్ని నెట్టడం తప్ప 'అభివృద్ధి ప్రకటన'లతో మోదీ ప్రభుత్వం చేస్తున్నది ఏమీ లేదు.

# జపాన్‌తో పోల్చుకుంటే మనమెక్కడ?


సిఆర్ సుకుమార్

ఇటీవల కాలంలో భారత్, జపాన్ దేశాలు ప్రపంచ వార్తల్లో నిలిచాయి. 4.187 ట్రిలియన్ల డాలర్ల జిడిపితో ప్రపంచంలో నాలుగవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా జపాన్‌ను అధిగమించి భారతదేశం ఒక అద్భుతమైన ఘనతను సాధించింది. జపాన్ జిడిపి4.186 ట్రిలియన్ల డాలర్లుగా ఉంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం, జపాన్ రెండు ఆకర్షణీయమైన, విరుద్ధమైన ఆర్థిక కథనాలను సూచిస్తున్నాయి. ఒకటి వేగంగా అభివృద్ధి చెందుతున్న, అధిక జనాభా కలిగిన యువ జనాభాతో అభివృద్ధి చెందుతున్న మార్కెట్ కాగా, మరొకటి జనాభా సమస్యలతో సతమతమవుతున్న పరిణతి చెందిన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ. ఈ రెండు ఆర్థిక వ్యవస్థల కథ వాటి ప్రత్యేక బలాలు, సవాళ్లు, భవిష్యత్తు మార్గాలను ఎలుగెత్తి చూపిస్తున్నాయి.

తరచుగా 'ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ'గా కీర్తించబడే భారతదేశం అద్భుతమైన ప్రయాణం సాగిస్తున్నది. జపాన్‌ను అధిగమించడం అనేది యువ జనాభా, వృద్ధి చెందుతున్న టెక్నాలజీ, తయారీ రంగాలు, భారీ మౌలిక సదుపాయాల కార్యక్రమాలతో ప్రపంచ ఆర్థిక శక్తిగా దాని ఆరోహణను సూచిస్తుంది.

అయినప్పటికీ, బెంగళూరులోని టెక్ కార్మికుల నుండి బీహార్‌లోని రైతుల వరకు లక్షలాది మంది భారతీయులను ఈ వార్త ఒక లోతైన ప్రశ్న నుంచి దాచేస్తుంది: ఈ వృద్ధి రోజువారీ జీవితంలోకి ఎలా మారుతుంది? ఉన్నత జీవన ప్రమాణాలు, సమాన సంపద పంపిణీ, సమర్థవంతమైన సమాజానికి ప్రసిద్ధి చెందిన జపాన్‌తో ఇది ఎలా పోల్చబడుతుంది?

ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఆర్థిక ఆరోహణ జాతికి గర్వకారణం. అయినప్పటికీ, ఈ వార్త వెనుక ఒక ఇబ్బందికరమైన వాస్తవం ఉంది: ఇటీవలి నివేదికల ప్రకారం, ఒక శాతం భారతీయులు దేశ సంపదలో దాదాపు 40 శాతం నియంత్రిస్తున్నారు. ఈ విపరీతమైన సంపద కేంద్రీకరణ ధనవంతులు, పేదల మధ్య అంతరం ఆందోళనకరంగా పెరుగుతుండటాన్ని నొక్కి చెబుతుంది. ఇది సామాజిక సామరస్యం, స్థిరమైన వృద్ధికి ముప్పు కలిగిస్తుంది.

ఒక ఆర్థిక వ్యవస్థ పరిమాణం దాని స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) ద్వారా కొలవబడుతుంది. ఇది సంవత్సరానికి ఉత్పత్తి అయ్యే వస్తువులు, సేవల మొత్తం విలువ. 2025లో భారతదేశం జిడిపి 4.187 ట్రిలియన్ల డాలర్లు. ఇది మనను యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, చైనా, జర్మనీల తరువాత నిలుపుతుంది. ఇది 1.45 బిలియన్ల జనాభా ద్వారా ప్రేరేపితమయింది. అయితే, తలసరి జిడిపి ఒక తీవ్రమైన విభజనను వెల్లడిస్తుంది. **భారతదేశం తలసరి ఆదాయం సుమారు 2,900 డాలర్లు, జపాన్ తలసరి ఆదాయం 39,000 డాలర్లు,** అంటే మనకంటే 13 రెట్లు ఎక్కువ. జపాన్ జనాభా 125 మిలియన్లు కావడంతో, దాని సంపద మరింత సమానంగా పంపిణీ చేయబడి, మెరుగైన జీవన ప్రమాణాలను కల్పిస్తుంది. దీని అర్థం జాతీయ సంపద సగటు భారతీయుడికి ఇంకా వ్యక్తిగత సంపదగా మారడం లేదు. జపాన్ చిన్న ఆర్థిక వ్యవస్థ అయినప్పటికీ ఉన్నత జీవన ప్రమాణాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, సంపద సమాన పంపిణీలో అగ్రస్థానంలో ఉంది.

జపాన్ గిని గుణకం (అసమానతకు కొలమానం) ప్రపంచంలోనే అత్యల్పంగా ఉంది, అయితే భారతదేశం గిని గుణకం అధికంగా ఉంది. ఇది అధిక వ్యత్యాసాన్ని ప్రతిబింబిస్తుంది. దాని నమూనా సమానమైన వృద్ధి స్థిరత్వాన్ని పెంచుతుందని చూపిస్తుంది. ఇది భారతదేశం అనుసరించగల నమూనా.



భారతదేశం ఆర్థిక వృద్ధి జీవితాలను పునర్నిర్మిస్తోంది. కానీ, ప్రయోజనాలు అసమానంగా ఉన్నాయి. సవాళ్లు కొనసాగుతున్నాయి. దాని ఆర్థిక వృద్ధి అవకాశాలను తీసువస్తుంది, కానీ ఇది ప్రతి ఒక్కరికీ దానంతట అదే తక్షణ మెరుగుదలకు మారదు. మొత్తం ఆర్థిక పరిమాణంలో, భారతదేశం జపాన్‌ను అధిగమించింది. కానీ రోజువారీ జీవిత కొలమానాలలో, పైన పేర్కొన్న వివిధ కారణాల వల్ల జపాన్ చాలా ముందుంది.

ఏప్రిల్ 2025లో భారతదేశం నిరుద్యోగ రేటు 5.1 శాతం, మెచ్చదగిన జపాన్ నిరుద్యోగం 2.5 శాతం కంటే ఎక్కువ. పట్టణ యువత అధికంగా 17.2 శాతం నిరుద్యోగ రేటును ఎదుర్కొంటోంది. నైపుణ్యాల అసమర్థత–, భారతదేశంలో నిరుద్యోగులలో 65.7 శాతం మంది విద్యావంతులు అయినప్పటికీ హైటెక్ స్థానాలకు శిక్షణ లేకపోవడం ఒక ఆటంకంగా ఉంటోంది. ఆదాయ అసమానత, ప్రాంతీయ వ్యత్యాసాలు కొనసాగుతున్నాయి, గ్రామీణ ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు, సేవలు అందుబాటులో లేకపోవడంతో వెనుకబడి ఉన్నాయి. శ్రామికశక్తిలో ఎక్కువ భాగంగా ఉండే అసంఘటిత రంగం సామాజిక భద్రత, స్థిరత్వాన్ని కోల్పోయింది. భారతదేశం 250 మిలియన్ల బలమైన మధ్యతరగతి స్మార్ట్‌ఫోన్‌ల నుండి 5జి స్ట్రీమింగ్ వరకు వినియోగదారుల వృద్ధిని ప్రోత్సహిస్తోంది. గ్రామ దుకాణాలలో యుపిఐ వంటి డిజిటల్ చెల్లింపులు గ్రామీణ ప్రాంతాలను కూడా మారుస్తున్నాయి. దీనికి విరుద్ధంగా, జపాన్ 39,000 డాలర్ల తలసరి ఆదాయం చాలా మంది పౌరులు ఆధునిక గృహాలు, నమ్మకమైన ప్రజా రవాణా, బయట డిన్నర్ చేయడం లేదా బుల్లెట్ రైలు ప్రయాణం వంటి వినోదాలను అనుభవిస్తున్నారని నిర్ధారిస్తుంది. భారతదేశ మధ్యతరగతి విస్తరిస్తున్నప్పటికీ, **తలసరి ఆదాయంలో దాని 140వ ప్రపంచ ర్యాంక్** పేదలకు త్వరగా ప్రయోజనాలు లభించవని నొక్కి చెబుతుంది.

**భారతదేశం యూనివర్సల్ హెల్త్ కవరేజ్ ఇండెక్స్ (సార్వత్రిక ఆరోగ్య విస్తరణ సూచి) మెరుగుపడింది, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు లక్షలాది మందికి ఉచిత సంరక్షణను అందిస్తున్నాయి. అయినప్పటికీ, 5 సంవత్సరాలలోపు పిల్లలలో 35.5 శాతం మంది పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ఆరోగ్య సంరక్షణ అస్థిరంగా ఉంది. ఆర్థిక వృద్ధి ఆసుపత్రులను విస్తరిస్తోంది, కానీ అధిక జేబు ఖర్చులు కుటుంబాలపై భారం మోపుతున్నాయి. జపాన్ సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ అధునాతన సౌకర్యాలతో దాదాపు మొత్తం కవరేజీని అందిస్తుంది. భారతదేశం తక్కువ తలసరి ఆదాయం అటువంటి సౌలభ్యాన్ని పరిమితం చేస్తుంది.**

భారతదేశం జనాభాలో ఒక శాతం మంది చేతిలో దాదాపు 40 శాతం సంపద కేంద్రీకరణ ఆర్థిక అస్థిరత, సామాజిక ఉద్రిక్తతలు, రాజకీయ ప్రభావాలు, యువత నిరాశతో సహా అనేక దీర్ఘకాలిక పరిణామాలను కలిగి ఉంది.

తీవ్రమైన అసమానత వృద్ధిని అడ్డుకుంటుంది. 2022లో ఆహారం కోసం అవస్థ పడిన 43 శాతం మంది అత్యంత పేదల్లో కొనుగోలు శక్తి తక్కువగా ఉంది. ఇది వినియోగదారుల ఆధారిత ఆర్థిక విస్తరణను మందగిస్తుంది. తలసరి ఆదాయంలో (2,900 డాలర్లు) భారతదేశ 140వ ప్రపంచ ర్యాంక్ ఈ విరుద్ధ పంపిణీని ప్రతిబింబిస్తుంది.

పెరుగుతున్న అసమానత నిరసనకు ఆజ్యం పోస్తుంది. పట్టణ గ్రామీణ విభజనలు, ఉద్యోగ కొరతపై నిరసనలలో దీన్ని చూస్తున్నాం. పట్టణ మధ్యతరగతి స్మార్ట్‌ఫోన్లు, 5జిని ఆస్వాదిస్తుండగా, గ్రామీణ కుటుంబాలు పోషకాహార లోపం (ఐదేళ్ల లోపు పిల్లలలో 35.5 శాతం), సరిపోని ఆరోగ్య సంరక్షణను ఎదుర్కొంటున్నాయి.

ధనవంతులైన ఒక శాతం మంది విపరీతమైన ప్రభావాన్ని చూపుతారు. ఇది వారి ప్రయోజనాలను శాశ్వతం చేసే విధానాల రూపకల్పనకు దారి తీస్తుంది. ఇవి ప్రజాస్వామ్య న్యాయం, ప్రజా విశ్వాసాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉంది. పట్టణ యువత నిరుద్యోగం 17.2 శాతంతో, విద్యావంతులైన యువ భారతీయులు సంపద వృద్ధి నుండి తాము మినహాయించబడినట్లు భావిస్తారు. ఇది నిరాశ, అశాంతికి దారితీస్తుంది.

భారతదేశం తన సంపద అంతరాన్ని పరిష్కరించడానికి, దానికి సాహసోపేతమైన, సమ్మిళిత విధానాలు అవసరం క్రమానుగత పెంపుదలతో కూడిన పన్నులు, నైపుణ్య అభివృద్ధి, విద్య, గ్రామీణ పెట్టుబడులు, సామాజిక భద్రత రక్షణలతో కూడిన విధానాలు అవసరం.

సంపద, వారసత్వ పన్నులను బలోపేతం చేయడం వనరులను పునఃపంపిణీ చేయగలదు. పన్నుల వ్యవస్థలో లోపాలను సరిదిద్దటం, పన్నుల చెల్లింపును మెరుగుపరచడం ధనవంతులు తమ వంతు చెల్లించేటట్లు చేస్తుంది. నాణ్యమైన విద్య, వృత్తి శిక్షణలను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో ఉండేలా విస్తరించడం నైపుణ్యాల్లో వ్యత్యాసం పూడ్చగలదు. వ్యవసాయం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణను (ఆయుష్మాన్ భారత్‌ను విస్తరించడం వంటివి) ప్రోత్సహించడం ద్వారా అత్యంత పేదలను పైకి తీసుకురావచ్చు. పట్టణ–గ్రామీణ విభజనను తగ్గించవచ్చు. ఆహార సబ్సిడీలు, నిరుద్యోగ ప్రయోజనాలు వంటి సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేయడం ద్వారా లేనివారికి మద్దతు ఇవ్వవచ్చు. తద్వారా పేదరికం పట్టును తగ్గించవచ్చు.

భారతదేశం ఆర్థిక మైలురాయి గర్వించదగిన క్షణం. కానీ, నిజమైన విజయం రోజువారీ జీవితాన్ని మెరుగుపరచడంలో ఉంది. సవాలు ఏమిటంటే, ఆర్థిక వృద్ధి కేవలం ఉన్నత వర్గాల పడవలనే కాదు, అందరి నౌకలను ఒడ్డుకు చేర్చాలి. జపాన్ సమన్యాయ వ్యవస్థలను ఆదర్శంగా తీసుకోవడం, భారతదేశం తన యువ జనాభాను ప్రయోజనకరంగా ఉపయోగించుకోవటానికి ఉపకరిస్తుంది. అది ఈ అసమానత కథను సౌభాగ్య పంపిణీ కథగా మార్చగలదు. జపాన్ జీవన నాణ్యతతో పోటీ పడటానికి భారతదేశం సమన్యాయంతో కూడిన వృద్ధి, నైపుణ్య అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

ఆర్థిక పోటీ ఉండాలి.. అది కేవలం భారీగా పెరగడానికి కాదు, మెరుగుగా ఎదగడానికి.

*(రచయిత ఎకనామిక్ టైమ్స్ మాజీ సీనియర్ ఎడిటర్. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో న్యాయవాది)*

# వృద్ధిపై సుంకాల యుద్ధం, 'ఎఐ' విఘాతం ప్రభావం

2025 ప్రారంభం నుంచీ ప్రపంచ ఆర్థిక దృక్పథం క్షీణించింది. ఆర్థిక జాతీయవాదం పెరుగుదల, సుంకాల్లో అస్థిరత దీర్ఘకాలిక నిర్ణయాలు తీసుకోవటంలో అనిశ్చితికి హేతువైనట్లు బుధవారం జెనీవాలో విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) నివేదిక పేర్కొన్నది. ప్రస్తుత ప్రపంచ ఆర్థిక పరిణామాలు తాత్కాలిక విఘా తం కాదని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన నిర్మాణాత్మక (స్ట్రక్చరల్) మలుపు అని సర్వే చేసిన మెజారిటీ ఆర్థిక వ్యవస్థల (79 శాతం) ఆర్థిక వేత్తలు వెల్లడించినట్లు చీఫ్ ఎకనామిస్ట్స్ తాజా ఔట్‌లుక్ తెలియజేస్తున్నది. ''ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి పరివర్తనాత్మక టెక్నాలజీల వృద్ధి సామర్థ్యం దృష్ట్యా పెరుగుతున్న అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలను ఎదుర్కొనేందుకు విధాన రూపకర్తలు, వ్యాపార నాయకులు ఇతోధిక సమన్వయం, వ్యూహాత్మక నేర్పరితనం, పెట్టుబడులతో ప్రతిస్పందించాలి'' అన్నారు వరల్డ్ ఎకనామిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జహిది. నేటి ఆర్థిక ఆటుపోట్లను అధిగమించటానికీ, దీర్ఘకాలం నిభాయింపుశక్తిని, వృద్ధిని సాధించటానికి ఈ చర్యలు అవసరమన్నారు.

ప్రపంచ అస్థిరత అసాధారణ స్థాయిలో ఉన్నట్లు చీఫ్ ఎకనామిక్స్‌లు (ముఖ్య ఆర్థిక వేత్తలు) చూస్తున్నారు. వచ్చే సంవత్సరంలో పరిస్థితులు మెరుగవుతాయని 56 శాతం భావిస్తున్నప్పటికీ, ఆందోళనలు విడిచిపెట్టటం లేదు. ముఖ్య ఆర్థికవేత్తల్లో దాదాపు అందరూ (97శాతం) అత్యధిక అనిశ్చితికి వాణిజ్య విధానం ముఖ్య కారకంగా పేర్కొంటున్నారు. దాని తర్వాత మానిటరీ విధానం (49 శాతం), ద్రవ్యవిధానం (35శాతం). ఈ అనిశ్చితి కీలకమైన ఆర్థిక సూచీలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆ సూచీల్లో వాణిజ్య పరిమాణాలు(70శాతం), జిడిపి వృద్ధి (68శాతం), విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (62 శాతం).

అనిశ్చితిపట్ల వ్యాపారవేత్తల ప్రతిస్పందన వ్యూహాత్మక నిర్ణయాలను జాప్యం చేయటంగా ఉంటుంది. అది మాంద్యం చిక్కులను పెంచుతుందని చీఫ్ ఎకనామిస్ట్‌ల్లో 87శాతం ఊహిస్తున్నారు. రుణం సమస్య కూడా ఆందోళనకరంగా కొనసాగుతుందని అభివృద్ధి చెందిన, వర్ధమాన ఆర్థిక వ్యవస్థల్లోని 74శాతం ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు. ప్రభుత్వాలు రక్షణ వ్యయం కోసం రుణాలపై ఆధారపడతాయని, ప్రభుత్వ సర్వీసులు, మౌలిక వసతుల కోసం కూడా రుణాలకై ఒత్తిడి పెరుగుతుందని అత్యధిక ఆర్థిక వేత్తలు (86 శాతం) ఊహిస్తున్నారు.

అమెరికాలో 2025లో వృద్ధిరేటు బహుబలహీనంగా ఉంటుందని, ద్రవ్యోల్బణం హెచ్చుగా ఉంటుందని, బలహీనపడుతుందని ఏప్రిల్ ప్రారంభంలో, అనిశ్చితి తారాస్థాయిలో ఉండగా ముఖ్య ఆర్థిక వేత్తల్లో అత్యధికులు (77శాతం) ఊహిస్తున్నారు. కాగా అనేక సంవత్సరాల్లో తొలిసారి యూరప్ గూర్చి కొంత ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా జర్మనీలో ద్రవ్యపెట్టుబడి విస్తరణ ఈ ఆశాభావానికి ఆధారం. చైనా విషయంలో దృక్పథం మౌనంగా ఉంది. చైనా ఈ సంవత్సరం జిడిపి వృద్ధి లక్ష్యం 5 శాతాన్ని చేరుకోగలదా అన్న విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. దక్షిణాసియా విషయంలో ఆశాభావం హెచ్చుగా ఉంది. ఈ సంవత్సరం వృద్ధి బలంగా, ఇంకా శక్తిమంతంగా ఉంటుందని 33 శాతం ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు.

ఆర్థిక పరివర్తన తదుపరి తరంగాన్ని కృత్రిమ మేధ (ఎఐ) నడిపిస్తుందని ఆ రిపోర్టు పేర్కొన్నది. అది వృద్ధి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. అయితే దానితోపాటు తీవ్రమైన ఇబ్బందులూ వస్తాయి. ఎఐ వల్ల వచ్చేదశాబ్దంలో వృద్ధి 0 నుంచి 5 శాతం వరకు ఉంటుందని 46శాతం మంది ఆర్థిక వేత్తలు, 5 నుంచి 10 శాతం వరకు ఉండవచ్చని 35 శాతం మంది భావిస్తున్నారు. దాని ప్రభావం ప్రధానంగా ఆటోమేషన్ (68 శాతం), అన్వేషణలు వేగవంతం (62 శాతం), కార్మిక సామర్థ్యం వృద్ధి (49 శాతం) రంగాల్లో కనిపిస్తుంది. ఈ శక్తి సామర్థ్యాలున్నప్పటికీ వచ్చే దశాబ్దంలో ఉద్యోగ నష్టం ఉంటుందని 47 శాతం, ఉద్యోగాలు లభిస్తాయని కేవలం 19శాతం అంచనా వేస్తున్నారు. అన్నిటికీ మించి, తప్పుడు సమాచారం వ్యాప్తి చేయటానికీ, సమాజ అస్థిరీకరణకు ఎఐ దుర్వినియోగం చేయబడుతుందని, ఇది ఆర్థిక వ్యవస్థకు అతి పెద్ద ఇబ్బంది అని 53 శాతం ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. మార్కెట్ అధికారం కేంద్రీకరణ పెరుగుదల (47శాతం), ప్రస్తుత వ్యాపార నమూనాలకు విఘాత మొనర్చటం (44శాతం) ఇతర ప్రధాన ఇబ్బందులని అభిప్రాయపడ్డారు.

ఎఐ సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవటానికి ప్రభుత్వాలు, వ్యాపారులూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్య ఆర్థిక వేత్తలు నొక్కి చెప్పారు. ప్రభుత్వాలకు ప్రధాన ప్రాధాన్యతల్లో ఎఐ మౌలిక వసతుల్లో పెట్టుబడి పెట్టటం (89శాతం), కీలకమైన రంగాలకు దాని అనువర్తింపును ప్రోత్సహించటం (86 శాతం), ఎఐ ప్రావీణ్యం చలనానికి దోహదం చేయటం (80 శాతం), నైపు ణ్యం నవీకరణ, పునర్నియామకం (75శాతం) ఉంటాయి. వ్యాపారాలకు సంబంధించి ముఖ్యమైన ప్రాసెస్‌లను ఎఐతో మిళితం చేయటం (95 శాతం), ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి శిక్షణ (91 శాతం), ఎఐ ప్రధానంగా పరివర్తనలోకి నడిపించేందుకు నాయకత్వానికి శిక్షణ ఇవ్వటం (83శాతం అంచనా) ప్రధాన కర్తవ్యాలుగా ఉంటాయి.

**– సాత్యకీ చక్రవర్తి**

# 80 ఏళ్ల స్వాతంత్ర్యమా.. క్షేమమా?


వై.కరుణాకర్‌రెడ్డి,
ఎస్‌టియుటిఎస్ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్
9866103202

'తెలుగువీర లేవరా దీక్షబూని సాగరా, దేశ మాత స్వేచ్ఛ కోరి తిరుగుబాటు చేయరా' అన్న... మన్యం వీరయోధుడు అల్లూరి మాటలు, 'చెరసాలలు ఉరి కొయ్యలు ఉద్యమాలను ఆపలేవు' అని నూనూగు మీసాల భగత్ సింగ్ ఉప్పుపై పన్ను విధిస్తారా అంటూ బ్రిటీషువారిపై ఉరిమిన గాంధీజీ ఈ దేశానికి స్వాతంత్ర్యం త్వరగా రావాలనే ఆకాంక్షతో సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని ఉద్యమించిన సుభాష్‌చంద్రబోస్, పేదలకు భూమి పంచాలని, భూదానోద్యమాన్ని తీసుకొచ్చిన వినోభాభావే ఇలా ఒక్కరా, ఇద్దరా భారతదేశ స్వాతంత్ర్య సాధన కోసం సుమారు 100 సంవత్సరాలపాటు బ్రిటీషువారిపై పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్య సమర వీరులకు, అమరులకు వందనం, పాదాభివందనం, ఉద్యమ అభినందనం. దాదాపు 80ఏళ్ల స్వాతంత్ర్యంలో భారతావనిలో మనం అభివృద్ధి చేసుకొన్న కొన్నిరంగాలను పరిశీలిద్దాం.

**విద్యారంగం :** దేశ స్వాతంత్ర్యానికి ముందు మన అక్షరాస్యత 20శాతం మాత్రమే. ఇప్పుడు 29 రాష్ట్రాలలో ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కోతీరు సగటుగా 60శాతం మించి అక్షరాస్యత లేదు. మన దేశ జనాభా ప్రపంచ దేశాలలోనే రెండవ స్థానానికి అతివేగంగా చేరుకుంది. కానీ అదేవేగం విద్యలో చూపలేకపోయాము. ఇప్పటికీ గిరిజనులు, ఆదివాసీలు, దళితులు, మైనార్టీలు విద్యకు దూరంగానే ఉన్నారు. వారిని విద్యావంతులుగా మార్చే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేయడం లేదనే చెప్పాలి. ఎందుకంటే భారతదేశంలో విద్య పేద, మధ్యతరగతి వారికి అందని ద్రాక్షగానే ఉంది. ప్రభుత్వ విద్యారంగం చాలా వరకు కనుమరుగై అది ప్రైవేటు కార్పొరేటు వారి చేతుల్లోకి చేరిపోయింది. ఇప్పుడు పేద, మధ్యతరగతి వారి పిల్లల తల్లిదండ్రులు చదువును కొనడానికి తమ సంపాదనలో 30శాతం కేటాయిస్తున్నారు. ఇక దేశంలో అక్షరాస్యత శాతం ఎలా పెరుగుతుంది. అందుకే దేశంలో అందరికీ ''సమానమైన ఉచిత విద్యను'' ప్రభుత్వాలు కల్పించాలి. అలా కల్పించినప్పుడే మనం సాధించుకున్న స్వాతంత్ర్యానికి సార్థకత.

**వైద్యం :** భారతదేశంలో మనిషి సగటు ఆయుష గతంలో 60సంవత్సరాలు, కాని సాంకేతికత పెరిగిన తరువాత అది 70సంవత్సరాలు అయింది. కానీ ఇంకనూ మారుమూల గ్రామాలు, తండాలు, ఆదివాసి బిడ్డలు ప్రభుత్వ వైద్యానికి దూరంగానే ఉన్నారు. వారికి ఏ చిన్న జబ్బు వచ్చినా సుమారు 10 నుండి 20కి.మీ దూరం నడిచి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. భారతదేశంలో ఇప్పుడు విద్యతోపాటు వైద్యం కూడా, ప్రైవేటు కార్పొరేట్లు చేతుల్లోకి చేరుతోంది. ప్రజలు తమ సంపాదనలో 30శాతం వైద్యానికి కేటాయిస్తున్నారు. అందుకే ఈ పేద దేశంలో విద్య–వైద్యం పూర్తి గా ఉచితంగా ప్రజలకు అందించే ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**వ్యవసాయరంగం :** భారతదేశం పూర్తిగా వ్యవసాయ ఆధారిత దేశం, నూటికి 70శాతం ప్రజలు గ్రామాలలో ఉండి వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు. కానీ ప్రస్తుత పరిస్థితులలో వ్యవసాయం చేసే ప్రజలు, రైతులు అతివృష్టి, అనావృష్టికి గురవుతున్నారు. వర్షాలు కురిసి మంచి పంటలు పండించినా అవి మార్కెట్‌లో అమ్ముకోవాలంటే వారు దళారి వ్యవస్థ చేతుల్లో ఛిద్రమౌతున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులు చేసి, వ్యవసాయం చేయలేక, కొన్ని రాష్ట్రాలలో పరిశ్రమలకు సెజ్‌ల పేరుతో వ్యవసాయ భూములను రైతుల నుండి తీసుకోవడం వలన, ఇవాళ ''గ్రామ స్వరాజ్యం'' కాస్తా పట్టణాలకు వలస వచ్చి రైతులు ఎటిఎంల వద్ద, షాపింగ్ మాల్స్ వద్ద, సెక్యూరిటీ సిబ్బందిగా జీవనం కొనసాగిస్తున్నారు. అందుకే ఒకప్పుడు గ్రామీణ జనాభా అధికం, కానీ నేడు వలసలతో పట్టణ జనాభా గరిష్ట స్థాయికి చేరింది.

**పరిశ్రమలు – ఉపాధి :** ఒకప్పుడు యువతకు ఉపాధి చూపడానికి హైదరాబాద్, మద్రాసు, బెంగుళూరు, బొంబాయి, పూణే, అహ్మదాబాద్, కాన్పూర్, కలకత్తా వంటి మహానగరాలలో అనేక పరిశ్రమలు ప్రభుత్వమే నెలకొల్పి యువతకు ఉపాధి చూపించారు. కానీ నేడు అవి ఆర్థిక ఇబ్బందుల పేరుతో మూసివేయడం, చివరకు పారిశ్రామికరంగాన్ని దేశంలో కేవలం 10మంది బడా పారిశ్రామికవేత్తల చేతుల్లో పెట్టి ప్రభుత్వాలు వారికి ప్రభుత్వ నిధులు కేటాయించి, సబ్సిడీలు ఇచ్చి, బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చి సహజ వనరులు వారికి ధారాదత్తం చేసి ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేటీకరించి, మేధావులను, యువతను కార్పొరేటు శక్తులకు ఊడిగం చేసేవిధంగా ప్రభుత్వాలు వారిని ఉసిగొల్పుతున్నారు. అందుకే యువత ఇవాళ విదేశాలకు ఎగుమతి అవుతుంది. సహజ వనరులు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి. ప్రభుత్వాలే పరిశ్రమలు ఏర్పాటు చేయాలి, యువతకు ఉపాధి చూపినపుడే స్వాతంత్ర్యంపై ఆశలు చిగురిస్తాయి. పరిశ్రమలు అంటే కేవలం ''సాఫ్ట్‌వేర్'' అనే సంస్కృతిని మనదేశం విడనాడాలి.

**ఎన్నికలు :** మన దేశం అతిపెద్ద ప్రజాస్వామిక దేశం. ప్రజలచేత, ప్రజల కొరకు ఎన్నికల ద్వారా ప్రభుత్వాలు ఏర్పాటు అవుతున్నాయి. ప్రజలకు సిద్ధించిన స్వేచ్ఛాగాలులు, కనీస అవసరాలు, అందరికీ సమానంగా ఉండే విధంగా చూడవలసిన బాధ్యత ప్రజలచేత ప్రభుత్వాలదే! కానీ ఈనాటి ఎన్నికల వ్యవస్థను చూస్తుంటే, దేశంలో అతి ఖరీదైనది ఏదైనా ఉంది అంటే అవి ఎన్నికలే! గ్రామ వార్డు మెంబర్‌కు 5లక్షలు, సర్పంచికి 20లక్షలు, మండలాధ్యక్షునికి 50లక్షలు, శాసనసభ్యునికి 20 కోట్లు, పార్లమెంటు సభ్యునికి 100కోట్లు ఇలా ఏ స్థాయిలో గెలవాలంటే ఆ స్థాయిలో డబ్బు ఖర్చుపెట్టి, ఓటర్లను మద్యం, డబ్బుతో ఎరవేసి, చివరికి కుల సంఘాలను, మతాలను అడ్డుపెట్టుకొని గెలుస్తున్న ప్రస్తుత ఎన్నికల విధానం అపహాస్యంగా తయారైంది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లకు, ఇప్పటికీ నింగికి–నేలకు ఉన్నంత భేదం గలదు. డబ్బులు పంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఆ తరువాత వారు పెట్టిన ఖర్చును అవినీతిగా దోచుకుంటూ ఉంటే ఇక భారతదేశ ప్రజలకు ''నీతివంతమైన పాలన'' ఎలా అందుతుంది. ప్రజల అవసరాలను ఎలా తీరుస్తారు. పేద, ధనికుల మధ్య అంతరం చాలా పెరిగిపోయింది. అందుకే దేశ ప్రజలారా ఇకనైనా మేలుకోండి, సమాజాన్ని మేల్కొలపండి. ప్రజల మధ్య అంతర యుద్ధం మొదలయ్యే అవకాశం ఈ దేశానికి రానివ్వకండి.

# మంచి ఆరోగ్యానికి మంచి పర్యావరణం

పర్యావరణం కేవలం 'ప్రకృతి' కాదు ఇది భూమిపై ఉన్న అన్ని జీవులకు, కార్యకలాపాలకు పునాది. దానిని రక్షించడం అంటే మన స్వంత భవిష్యత్తును కాపాడుకోవడం. ఆరోగ్యకరమైన వాతావరణం కాలుష్యం, విషపదార్థాలు, వ్యాధులకు గురికావడాన్ని తగ్గిస్తుంది. పేలవమైన పర్యావరణ పరిస్థితులు శ్వాసకోశ వ్యాధులు, నీటి ద్వారా వచ్చే వ్యాధులు మరియు ఆహార అభద్రతకు కారణమవుతాయి.

ప్రతి సంవత్సరం జూన్ 5న జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవం, పర్యావరణ సమస్యలపై అవగాహన పెంచడానికి మరియు చర్యలు తీసుకొని ఆరోగ్యకరమైన గ్రహం (భూమి) కోసం ప్రయత్నమే ఈ రోజు ప్రాముఖ్యత. ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1973 నుండి ప్రారంభించింది. పర్యావరణ పనితీరు సూచికను యేల్ విశ్వవిద్యాలయం, కొలంబియా విశ్వవిద్యాలయం ప్రపంచ ఆర్థిక వేదిక సహకారంతో అభివృద్ధి చేశాయి. పర్యావరణ పనితీరు సూచిక అనేది దేశాల పర్యావరణ ఆరోగ్యం మరియు స్థిరత్వాన్ని అంచనా వేసే ద్వైవార్షిక ర్యాంకింగ్ వ్యవస్థ. పర్యావరణ పనితీరు సూచిక 2024లో 180 దేశాలలో భారతదేశం 176వ స్థానంలో ఉంది. ఇది 2022లో 180వ స్థానం నుండి స్వల్ప మెరుగుదలను సూచిస్తుంది. పర్యావరణ పనితీరు సూచిక 2024లో గాలి నాణ్యతలో (తీవ్రమైన వాయు కాలుష్య సమస్య) మన దేశం 177వ స్థానంలోను, వాతావరణ మార్పులో 133వ స్థానంలో, జీవవైవిధ్యం మరియు ఆవాసాలు (పర్యావరణ వ్యవస్థ రక్షణలో) 178వ స్థానంలో, వ్యర్థాల నిర్వహణలో 86వ స్థానంలో, జల వనరులలో (నీటి నిర్వహణలో సమస్య) 104వ స్థానంలో వున్నాము. పునరుత్పాదక శక్తిలో, వ్యర్థాల నిర్వహణ పద్ధతుల్లో మెరుగుదల కొంత వరకు ఆశాజనకంగా ఉంది అయినప్పటికీ దీనిని ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా చూస్తే అత్యల్పంగా ఉంది.

ప్రపంచంలోనే అధిక జనాభా కలిగి ఉండడం ఒకవిధంగా భారమే అయినా మానవ వనరుల విషయంలో గొప్పదే, మన దేశంలో ప్రజా రవాణాను మరింతగా అభివృద్ధి చేసినట్లయితే గాలికాలుష్యాన్ని తగ్గించవచ్చు, విదేశీ మారకద్రవ్యాన్ని పెంచుకోవచ్చు, దేశంలో బ్యాంకుల నెలవారీ చెల్లింపుల విధానంవల్ల ప్రజలలో వినియోగ, కొనుగోలు శక్తి పెరిగి కార్లు, ద్విచక్రవాహనాల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం దేశంలో ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం పెరగడంవలన విద్యుత్ వినియోగం పెరగడం వలన సాంప్రదాయ ఇంధనమైన బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిపైన ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. అందువలన గాలికాలుష్యం పెరిగి, గాలినాణ్యత తగ్గుతోంది. ఎయిర్ కండిషన్స్ వలన దేశంలో భూమి వేడి (గ్లోబల్ వార్మింగ్) పెరిగిపోతోంది.


భారతదేశం అత్యంత అధ్వాన్నమైన గాలి నాణ్యత కలిగిన దేశాలలో ఒకటి. దేశంలోని నీటి వనరులలో దాదాపు అరవై శాతం (60%) కలుషితమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా 4 మరణాలలో 1 పర్యావరణ కారణాల వల్ల సంభవిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది భారతదేశం కూడా ఇదే ధోరణిని అనుసరిస్తుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వ్యాధుల భారానికి పర్యావరణ ప్రమాదాలే ప్రధాన కారణాలు.

అటవీ, రెవెన్యూ, అభివృద్ధి అధికారులు సమన్వయంతో పనిచేయడం వలన మరింత అభివృద్ధి సాధించవచ్చు. ప్రత్యేకంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మరింత సమర్థవంతంగా అటవీ, ప్రభుత్వ భూములలో ఎక్కువ సంఖ్యలో కార్యోన్ముఖంగా, దూరదృష్టితో నిర్వహించగలిగితే అటు అటవీ, ప్రభుత్వ భూములను ఆక్రమణ దారులనుంచి కాపాడుకోవచ్చు మరి యు పర్యావరణాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చు. ఫ్లెక్సీ బ్యానెర్లను, పునర్వినియోగించడానికి వీలులేని ప్లాస్టిక్ వాడకాన్ని మరియు ఉత్పత్తిని పూర్తిగా ఆపివేయాలి, ఉత్పత్తి చేసిన వారిపైచట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకోవాలి. ప్రజలలో ప్రభావవంతంగా ప్లాస్టిక్ వాడకం, పర్యావసనాలను తెలియజేయాలి. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, రాష్ట్ర రవాణా సంస్థల పరిధిలో, పార్కులో, ప్రదేశాల్లో కూర్చోవడానికి గ్రానైట్ (రాతి పలకలు) వాడకాన్ని నిషేధించాలి వాటికి బదులు ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడుకోవచ్చు.

జీవవైవిధ్య పరిరక్షణ, నీటి వనరుల నిర్వహణలో కూడా దేశం సవాళ్లను ఎదుర్కొంటుంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రయత్నాలు ఉన్నప్పటికీ, ఈ పర్యావరణ సమస్యలు కొనసాగుతున్నాయి.

ప్రభుత్వాలకి అటవీ భూములను ప్రయివేటు కార్పొరేట్లకు దోచిపెట్టడంపై ఉన్న శ్రద్ధ వాటిని కాపాడడంపై, అభివృద్ధిపై లేదు. ఇందుకు కావలసింది ప్రజలలో పర్యావరణంపై అవగాహన, భవిష్యత్ తరాలకు మనం అందించే మహోత్తరమైన ఆస్తి అని తెలియజేయకలగాలి అప్పుడే మనం మన పర్యావరణాన్ని కాపాడుకోగలం.. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించగలం. పుట్టినరోజు, పెళ్లిరోజు ఇలా మంచి రోజులలో ప్రతి ఒక్కరు ఒక మొక్కను పెంచినట్లయితే మన వంతు బాధ్యతగా ఈ భూమికి తోడ్పాటు అందించినవరమౌతాము. భవిష్యత్ తరాల కోసం గ్రహాన్ని రక్షించాల్సిన నైతిక బాధ్యత మనకు ఉంది.

**– డా.ఎ.భాగ్యరాజ్,**
**8019224208**



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## కేంద్ర నిధి నుంచి పేద ఖైదీలకు సాయం

**న్యూఢిల్లీ :** ఆర్థిక పరిమితుల కారణంగా జరిమానా చెల్లించకపోవడంతో బెయిల్ పొందలేకపోతున్న లేదా జైలు నుండి విడుదల కాలేకపోతున్న పేద ఖైదీలకు కేంద్ర నిధి నుండి ఆర్థిక సహాయం అందించాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరింది. అర్హత గల ఖైదీలకు ప్రయోజనాలను అందించడానికి తగిన మొత్తాన్ని తీసుకోగలగడానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎ) అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అందుబాటులో ఉన్న నిధులను పొందాలని ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నిధులను కేంద్ర నోడల్ ఏజెన్సీ (సిఎన్ఎ) ద్వారా అందిస్తారు. ఈ పథకానికి జాతీయ నేర రికార్డుల బ్యూరోను సిఎన్ఎగా నియమించారు. ఆర్థిక పరిమితుల కారణంగా జరిమానా చెల్లించకపోవడంతో బెయిల్ పొందలేకపోతున్న లేదా జైలు నుండి విడుదల కాలేకపోతున్న పేద ఖైదీలకు ఉపశమనం కల్పించడానికి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మే, 2023లో 'పేద ఖైదీలకు మద్దతు పథకం'ను ప్రవేశపెట్టింది' అని ఒక ప్రకటనలో తెలిపింది.

# ఎంపిలో ఘోర ప్రమాదం

### సిమెంట్ ట్రక్కు అదుపుతప్పి వ్యాన్‌పై బోల్తా
### 9 మంది మృతి, మరో ఇద్దరికి గాయాలు



**ఝబువా :** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమా దం సంభవించింది. బుధవారం తెల్లవారుజామున ఝబువా జిల్లాలో సిమెంట్‌తో వెళ్తున్న ట్రైలర్ ట్రక్కు బోల్తా పడి వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మైనర్లు సహా తొ మ్మిది మంది మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. బాధితుల బంధువులకు ఆర్థిక సహాయం ప్రకటించారు. మేఘ్‌నగర్ తహసీల్ ప్రాంతంలో తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో బాధితులు వివాహ కార్యక్రమం నుండి వ్యాన్‌లో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. సంజెలి రైల్వే క్రాసింగ్ సమీపంలో తాత్కాలిక రహదారి ద్వారా నిర్మాణంలో ఉన్న రైలు ఓవర్‌బ్రిడ్జిని దాటుతుండగా ట్రయిలర్ వ్యాన్ మీద బోల్తా పడిందని ఝబువా పోలీసు సూపరింటెండెంట్ పద్మవిలోచన్ శుక్లా పిటిఐకి తెలిపారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారని ఆయన అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఝబువాలో జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం తీవ్ర వేదనకు గురైందని, తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి సంతాపం తెలియజేస్తున్నానని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను అని ప్రధానమంత్రి కార్యాలయం ఎక్స్‌లో ప్రధానమంత్రిని ఉటంకిస్తూ పేర్కొంది. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుండి ప్రతి మృతుడి బంధువులకు రూ. 2 లక్షల ఎక్స్ గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50,000 ఇవ్వనున్నట్లు పేర్కొంది. రెండు కుటుంబాలకు చెందిన బాధితులు భావ్‌పురాలో జరిగిన వివాహం నుండి వారి స్వస్థలమైన శివ్‌గఢ్ మహుదా గ్రామానికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని ఎస్పీ శుక్లా తెలిపారు. మరణించిన వారిని ముఖేష్ ఖాపేడ్ (40), సాల్లి ఖాపేడ్ (35), వినోద్ ఖాపేడ్ (16), పాయల్ ఖాపేడ్ (12), మధి బమానియా (38), విజయ్ బమానియా (14), కాంతా బమానియా (14), రాగిణి (9) మరియు అక్లి పర్మార్ (35) గా గుర్తించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం పంపామని, గాయపడిన వారిని చికిత్స కోసం తాండ్లా ఆసుపత్రికి తరలించామన్నారు. ప్రమాదం తర్వాత ట్రక్ డ్రైవర్ అక్కడి నుండి పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుగుతోందని అధికారి తెలిపారు. కాగా, ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తూ, మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 సహాయం ప్రకటించినట్లు ఒక అధికారి తెలిపారు.

### పాక్‌కు ఎడిబి 800 మిలియన్ డాలర్ల సాయం..
# భారత్ తీవ్ర అభ్యంతరం




**న్యూఢిల్లీ :** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ వంటి దేశాలకు సాయం చేస్తే ముప్పు కొని తెచ్చుకున్నట్టేనని భారత్ చేసిన అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ దాయాది దేశానికి ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎడిపి) భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. 800 మిలియన్ డాలర్ల ఆర్థిక ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి సలహాదారు ఖుర్రం షా జాద్ సామాజిక మాధ్యమంలో ధ్రువీకరించా రు. పాలసీ ఆధారిత లోన్ (పిబిఎల్) కింది 30 0 మిలియన్ డాలర్లు, ప్రోగ్రాం ఆధారిత గ్యా రెంటీ (పిజిబి) కింద 500 మిలియన్ డాలర్ల ఆ ర్థిక సాయాన్ని ఎడిబి మంజూరు చేసినట్టు ఆయ న తెలిపారు. పాక్‌కు ఆర్థిక ప్యాకేజీ విషయాన్ని ఫిలిప్పీన్‌లోని ఎడిబి సైతం ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. 'ఇంప్రూవ్డ్ రిసోర్స్ మొబిలైజేషన్ అండ్ యుటిలైజేషన్ రిఫార్మ్ ప్రోగ్రాం' లోని సబ్ ప్రోగ్రాం 2 కింద ఈ ఆర్థిక సాయం అందిస్తున్నట్టు చెప్పింది. పాకిస్థాన్ స్థూల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవడంలో గణనీయ ప్ర గతి సాధించిందని పాక్ ఎడిబి కంట్రీ డైరెక్టర్ ఎ మ్మా ఫ్యాన్ తెలిపారు. విధానపరమైన, వ్యవస్థాపరమైన సంస్కరణలతో పబ్లిక్ ఫైనాన్స్ పటిష్టత, స్థిరమైన వృద్ధి సాధించేందుకు పాక్ కట్టుబడి ఉందని, దానికి ఈ ఆర్థిక ప్యాకేజీ బలం చేకూరుస్తుందని చెప్పారు. ఇందువల్ల పన్నుల విధా నం మెరుగుపరచుకునేందుకు వీలుకలుగుతుందని, ఇన్వెస్టిమెంట్ ఫెసిలిటేషన్, ప్రైవేటు రంగ అభివృద్ధిని ప్రమోట్ చేయడ ం వల్ల ఆర్థికలోటు, ప్రభుత్వ రుణాల భారం తగ్గుతుందని అన్నారు.

**భారత్ తీవ్ర అభ్యంతరం**

కాగా, పాకిస్థాన్‌కు ఎడిబి భారీ ఆర్థిక సాయంపై ఇండియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మిలటరీ అవసరాల పేరుతో అభివృద్ధి నిధులను పాక్ దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. పాకిస్థాన్ జిడిపి లో పన్నుల వసూళ్ల గత కొంతకాలంగా తగ్గిపోయాయని తెలిపింది. పన్నుల వసూళ్ల 2018 లో 13 శాతం ఉం డగా, 2023 ఆర్థిక సంవత్సరానికి 9.2 శాతానికి పడిపోయాయని, ఇదే కా లానికి రక్షణ వ్యయాన్ని పాకిస్థాన్ పెంచుకుంటోందని భారత్ వివరించింది.

### జస్టిస్ యశ్వంత్‌వర్మపై 'అభిశంసన' ప్రవేశపెట్టడంలో...
# అన్ని రాజకీయపార్టీలతో చర్చిస్తాం

### కేంద్ర మంత్రి కిరెణ్ రెజిజు స్పష్టీకరణన్యాయవ్యవస్థలో అవినీతిని 'రాజకీయ దృష్టికోణం'లో మాత్రమే చూడలేమని వెల్లడి



**న్యూఢిల్లీ :** జస్టిస్ యశ్వంత్‌వర్మకు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే విషయంలో అన్ని రాజకీయపార్టీలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని, న్యాయవ్యవస్థలో అవినీతిని కేవలం రాజకీయదృష్టికోణంలో మాత్రమే చూడకుండా అన్ని విధాలా అధ్యయనం చేస్తామని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రెజిజు చెప్పారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు నియమించిన కమిటీ సూచించిన అవినీతి ఆరోపణల కేసులో చిక్కుకున్నజస్టిస్ యశ్వంత్‌వర్మను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ఈ కసరత్తును చేపట్టాలన్న ఉద్దేశంతో ఉన్నదని రెజిజు తెలియజేశారు. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మకు వ్యతిరేకంగా జులై 21న ప్రారంభంకానున్న వర్షాకాలపు పార్లమెంట్ సమావేశాలలో తీర్మానాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం ఇప్పటికే అనిన్ని రాజకీయ పార్టీలతో చర్చలు ప్రారంభించిందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జస్టిస్ వర్మను తొలగించే విషయంలో ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో సమష్టిగా తీర్మా నాన్ని ప్రవేశపెట్టాలని ఆకాంక్షిస్తోందన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రెజిజు మాట్లాడుతూ తాను చిన్న రాజకీయ పార్టీలతో కూడా సంప్రదించనున్నానని, జస్టిస్ యశ్వంత్‌వర్మకు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే విషయంలో ఇప్పటికే తాను పెద్ద రాజకీయ పార్టీలను సంప్రదించడం జరిగిందన్నారు.'ప్రభుత్వం ఈ అవినీతికి సంబంధించిన విషయాన్ని కేవలం ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన అజెండాగా మాత్రమే భావించడం లేదని, న్యాయవ్యవస్థ అవినీతికి లేదా మరే ఇతర అంశానికి సంబంధించి వ్యతిరేకంగా నిర్వహించే పోరాటం అనేది అన్ని రాజకీయ పార్టీల విధానంగా ఉండాల్సిన అవసరం ఉన్నది' అని ఆయన చెప్పారు. ప్రభుత్వం న్యాయవ్యవస్థలోఅవినీతి అంశాన్ని కేవలం రాజకీయ దృష్టికోణంలో మాత్రమే చూడదల్చుకోలేదని, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరించిన తర్వాతే పార్లమెంట్‌లో జస్టిస్ యశ్వంత్‌వర్మ అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెడతామని మంత్రి స్పష్టం చేశారు. అనేక పార్టీలు ఈ విషయాన్ని అంతర్గతంగా చర్చించిన తర్వాత కూడా వెనక్కి తీసుకునే అవకాశం ఉందన్నారు.ఈ తీర్మానంలోక్‌సభలో వస్తుందా? లేదా, రాజ్యసభలో వస్తుందా? అని అడిగిన విలేకరుల ప్రశ్నకు మంత్రి కిరెణ్ రెజిజు సమాధానమిస్తూ నిర్ణయం సభ ఆధారంగా తీసుకోబడుతుందన్నారు. 1968 జడ్జీల (విచారణ) చట్టం ప్రకారం ఒక న్యాయమూర్తిని తొలగించేందుకు అనుమతి ఇచ్చిన తర్వాత స్పీకర్ లేదా త చైర్మన్ సందర్భాన్ని బట్టి తొలగింపు కోరిన కారణాలను పరిశోధించడానికి ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి, 25హైకోర్టులలో ఏదైనా ఒక హైకోర్టు ప్రధానన్యాయమూర్తి, ఒక ప్రముఖ న్యాయనిపుణుడు ఉంటారు. అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేసిన హౌస్ కమిటీ ఇప్పటికే తన నివేదికను సమర్పించింద, ప్రస్తుత కేసు కొంచెం భిన్నంగా ఉందని రెజిజు చెప్పారు. కాబట్టి ఈ విషయంలో ఏమి చేయాలో మేం నిర్ణయం తీసుకుంటాం అని రెజిజు వివరించారు.జులై 21నుంచి ప్రారంభమై ఆగష్టు 12వరకు జరిగే వర్షాకాల సమావేశాల్లో తొలగింపు ప్రక్రియ రెండు సభల్లో ఆమోదం పొందుతుందన్న ఆశాభావాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రెజిజు వ్యక్తంచేశారు. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్ట్ న్యాయమూర్తిగా ఉన్నప్పుడు దేశరాజధాని ఢిల్లీలో మార్చిలో ఆయన నివాసంలో మంటలు చెలరేగిన సందర్భంలో అనేక కాలిపోయిన నగదు బస్తాలు బయటపడి చర్చనీయాంశమైన విషయం విదితమే.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ భూసేకరణ) శాఖ
ఫారం-VII
(డిక్లరేషన్ / రూఢి ప్రకటన)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూలు 25 (1) ను అనుసరించి)

కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నం.G1/877/2020 తేది: 28/05/2025
రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ ఫైల్ నం. D/434/2020 తేది: 19/05/2025
గెజిట్ నెంబరు. 64/2025 తేది: 28/05/2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరిచిన సిద్దిపేట జిల్లా కోహెడ మండలము బస్వాపూర్ గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎకరములు 16.27 గుంటలు** ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో శ్రీ రంగనాయక సాగర్ కుడి కాలువ యొక్క LD-6 కాలువ నిర్మాణ నిమిత్తము కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరం అయి ఉన్నదని భావించినందున సేకరించుటకు నిర్ణయించినారు.

కావున సిద్దిపేట జిల్లా కోహెడ మండలము బస్వాపూర్ గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎకరములు 16.27 గుంటలు** గల భూమి ప్రయోజన నిమిత్తం అనగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో శ్రీ రంగనాయక సాగర్ కుడి కాలువ యొక్క LD-6 కాలువ నిర్మాణ నిమిత్తము కొరకు భూసేకరణ ప్రామాణిక కొలతలు గల భూమికి దిగువ వివరించిన విధముగా రూఢి ప్రకటన(డిక్లరేషన్) చేయబడుచున్నాము.

షెడ్యూల్

గ్రామము : బస్వాపూర్ మండలము : కోహెడ జిల్లా : సిద్దిపేట్

| సర్వే నెం. | భూమి స్వభావం | విస్తీర్ణం | పట్టాదారు పేరు & అనుభవదారు పేరు | నిర్మాణాలు (చెట్లు, బోర్లు, బావులు, కట్టడములు మరియు ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| LD6 DISTRIBUTORY CANAL | | | | |
| 1164 | మెట్ట / పట్టా | 1.05 | కేడిక విజయ W/O బాల్ రెడ్డి కేడిక ప్రభాకర్ రెడ్డి S/o కిష్టారెడ్డి (0.15) ధూశెట్టి ఆగస్ రెడ్డి s/o వెంకటరెడ్డి (0.24) చాడ లక్ష్మారెడ్డి S/O మల్లారెడ్డి (0.01) తమడబోయిన నర్సయ్య S/O చిన్న మల్లయ్య (0.05) | మోతుగ-2 వేప-1 |
| 1153 | మెట్ట / పట్టా | 0.21 | అమరగాని రాజేందర్ S/o ఓదయ్య కాల్వ బొందయ్య S/O నర్సయ్య కాల్వ రాజయ్య S/o కొమురయ్య (0.19) నక్ష రోడ్ (0.02) | |
| 1157 | మెట్ట / పట్టా | 1.36 | అమరగాని రాజేందర్ s/o ఓదయ్య కాలువ బొందయ్య S/O నర్సయ్య కాలువ రాజయ్య S/O కొమురయ్య కాలువ హన్మంత్ S/O నర్సయ్య తమడబోయిన ఐల్లయ్య S/o దమ్మయ్య బాసబోయిన కొమురయ్య S/O నర్సయ్య (0.19) చిట్టి మల్లవ్వ W/O నారాయణరెడ్డి (0.14) కేడిక విజయ W/O బాలరెడ్డి (0.01) కేడిక ప్రభాకర్ రెడ్డి కిష్టారెడ్డి (0.10) కెడిక బుచ్చవ్వ W/O కిష్టారెడ్డి (0.10) ఎడబోయిన రాజిరెడ్డి S/O నారాయణరెడ్డి (0.10) చాడ లక్ష్మారెడ్డి S/O మల్లారెడ్డి (0.10) కేడిక ప్రభాకర్ రెడ్డి S/O కిష్టారెడ్డి (0.02) | వేప-8 తుమ్మ-10 |
| 1142 | మెట్ట / పట్టా | 1.31 | కాలువ సరోజన W/O రాజయ్య (0.07) అమరగాని రాజేందర్ S/O ఒదయ్య (0.10) బాసబోయిన కొమురయ్య S/o మల్లయ్య (0.13) కాలువ లచ్చవ్వ W/o బొందయ్య కాలువ మల్లవ్వ W/O హన్మయ్య (0.09) కాలువ సరోజన W/O రాజయ్య (0.01) తమడబోయిన రాజయ్య, s/o దమ్మయ్య తమడబోయిన ఐక్కయ్య, S/O దమ్మయ్య తమడబోయిన నర్సయ్య S/o దమ్మయ్య (0.12) గద్దెల సత్తయ్య S/o ఉప్పలయ్య (0.04) తమడబోయిన కొమురవ్వ w/o గట్టయ్య (0.08) కాల్వ అఖిలాష్ S/O రాజయ్య (0.07) | వేప-15 తుమ్మ-10 మోతుక-20 |
| 1139 | మెట్ట / పట్టా | 0.05 | కాలువ సరోజన w/o రాజయ్య (0.01) గద్దెల సత్తయ్య S/o ఉప్పలయ్య (0.04) | వేప-2 |
| 1151 | ప్రభుత్వ / సీలింగ్ పట్టా | 4.39 | గుమ్మల వెంకటయ్య S/O నర్సయ్య (0.06) తమడబోయిన ఎల్లయ్య S/o గట్టయ్య తమడబోయిన రాజయ్య S/o గట్టయ్య రేణుక W/o రాజయ్య (1.05) గద్దల సిద్దయ్య S/o శివరాజయ్య (0.32) గద్దల పెద్దమైసయ్య S/o వెంకటయ్య (0.28) గద్దల యాదయ్య S/O కిష్టయ్య (0.27) వేముల శశిధర్ రెడ్డి S/o రాంరెడ్డి (0.22) బాసబోయిన కొమురయ్య S/o నర్సయ్య అమరగోని అయిలయ్య S/o నర్సయ్య కాలువ నర్సయ్య S/o బబొందయ్య తమడబోయిన రాజయ్య S/o దామయ్య తమడబోయిన ఐక్కయ్య S/o దామయ్య అమరగోని రాజేందర్ S/o ఓదయ్య తమడబోయిన గట్టయ్య S/o వీరమల్లు తమడబోయిన వీరమల్లు S/o వీరమల్లు (0.05) బానోతు కౌసల్య W/o లింగయ్య (0.06) బాబోతు సుగుణ W/o రాజు (0.06) రోడ్(0.06) బానోతు మాన్ నాయక్ S/o దసరా నాయక్ (0.0550) బనోతు స్వామి నాయక్ S/o పొంద్యా నాయక్ (0.0525) బానోతు బిక్యా నాయక్ S/o సంధ్య నాయక్ (0.0525) | కనీలు-9 హామోయిల్-70 మామిడి-18 వేప-04 తుమ్మ-3 |
| 1146 | లావోని / పట్టా | 1.16 | తమడబోయిన ఎల్లయ్య S/o గట్టయ్య తమడబోయిన రాజయ్య S/o గట్టయ్య తమడబోయిన రేణుక W/O రాజయ్య (0.38) గద్దెల సిద్దయ్య S/o సువా రాజయ్య (0.18) | మోతుక-10 వేప-8 |
| 1107 | మెట్ట / పట్టా | 1.00 | వేముల శశిధర్ రెడ్డి S/o రాంరెడ్డి (1.00) | పామోయిల్-52 వేప-1 |
| 1181 | మెట్ట / పట్టా | 0.16 | ధూశెట్టి ఆగమ్ రెడ్డి S/o వెంకట్ రెడ్డి ధూశెట్టి రాజు S/o ఆగమ్ రెడ్డి (0.16) | |
| 1172 | మెట్ట / పట్టా | 1.29 | ధాడి పోచయ్య S/o మల్లయ్య ధాడి నర్సయ్య S/o మల్లయ్య ధాడి కనకయ్య స/ఓ మల్లయ్య ధాడి ఓదయ్య S/o మల్లయ్య (0.08) మౌటం మనవ్వ W/O కనకయ్య (0.29) దూశెట్టి ఆగం రెడ్డి S/o వెంకట్ రెడ్డి (0.32) | వేప-04 మోతుగ-5 నర్రెంగ-10 |
| 1165 | మెట్ట / పట్టా | 0.36 | తమడబోయిన గట్టయ్య S/o చిన్న మల్లయ్య(0.26) ధాడి పోచయ్య స/ఓ మల్లయ్య ధాడి నర్సయ్య S/o మల్లయ్య ధాడి కనకయ్య S/o మల్లయ్య ధాడి ఓదయ్య S/o మల్లయ్య మౌటం మనవ్వ W/o కనకయ్య (0.10) | వేప-05 మోతుగ-4 నర్రెంగ-12 |
| | Total | 15.34 | | |
| LD6-LM6 CANAL | | | | |
| 1107 | మెట్ట / పట్టా | 0.08 | వేముల శశిధర్ రెడ్డి S/o రాంరెడ్డి (0.08) | పామోయిల్-12 వేప-3 పైపులైన్లు-2 |
| 1151 | ప్రభుత్వ / సీలింగ్ పట్టా | 0.25 | వేముల శశిధర్ రెడ్డి S/o రాంరెడ్డి (0.25) | పామోయిల్-30 మోతుగ-5 |
| | Total | 0.33 | | |
| | Total | 16.27 | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ సంబంధించి గతములో జారీచేసిన ప్రాథమిక నోటిఫికేషన్ పై సెక్షన్ (15) క్రింద నిర్దిష్ట గడువులో ఎలాంటి అభ్యంతరాలను రానందున, ఇట్టి రూఢి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయబడుచున్నది. ఈ భూసేకరణ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం లో శ్రీ రంగనాయక సాగర్ కుడి కాలువ యొక్క LD-6 కాలువ నిర్మాణ నిమిత్తము కొరకు మాత్రమే అయినందున గ్రామములో ఎవరు కూడా నిర్వాసితులు కానందున పునరావాస ప్రశ్న ఉత్పన్నము కాదు.

ప్రాజెక్ట్ కొరకు భూమి సేకరించబడుచున్నందున నిర్మాణ దశలో ఉన్న సదరు భూమి లేదా సదరు భూమి యొక్క ఏదేనిభాగం, ఇతర భాగాలలో ఉండే గనులు, ఖనిజాలను త్రవ్వ సమయములో బొగ్గు, ఇనుము రాయి, నాపరాయి లేదా ఇతర ఖనిజాల గనులుస నుండి వచ్చే ఖనిజాలు అవసరం లేదు.

ఇట్టి భూమి యొక్క ప్లానును భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ గారి కార్యాలయములో ఏదేని పని దినమున పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్.
సం/- అదనపు కలెక్టర్, సిద్దిపేట.
సం/- జిల్లా కలెక్టర్, సిద్దిపేట.

DIPR RO NO. 192/LA/PP/Advt/Pub/2025-26


### న్యాయ వ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన కేసులు...
# ప్రజల్లో విశ్వాసాన్ని క్షీణింపజేస్తాయి

### భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్
### 'న్యాయచట్టబద్ధత-ప్రజావిశ్వాసం కాపాడుకోవడం' అంశంపై
### యుకె సుప్రీంకోర్టు రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగం

**న్యూఢిల్లీ :** న్యాయవ్యవస్థలో అవినీతి, దుష్ప్రవర్తన సంఘటనలు ప్రజల విశ్వాసంపై ప్రభావం చూపుతాయని, అంతేకాకుండా మొత్తం సమగ్ర వ్యవస్థపై విశ్వాసం క్షీణింపజేస్తుందని భారత ప్రధా న న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్. గవాయ్ అన్నారు.యునైటెడ్ కింగ్‌డమ్ లోని సుప్రీంకోర్టులో 'న్యాయ చట్టబద్ధత ప్రజా విశ్వాసాన్ని రక్షించుకోవడం'అనే అంశం పై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిజెఐ బిఆర్.గవాయ్ ప్రసంగించారు. పదవీ విరమణ తర్వాత న్యాయమూర్తులు తీసుకునే ఉద్యోగాల గురించి కూడా బిఆర్.గవాయ్ ఈ సందర్భంగా మాట్లాడారు. ఒక న్యాయమూర్తి పదవీవిరమణ చేపట్టిన వెంటనే ప్రభుత్వంలో మరొక నియామకాన్ని చేపడితే, లేదా ఎన్నికలలో పోటీచేయడానికి బెంచ్‌కు రాజీనామా చేస్తే, అది ముఖ్యమైన నైతిక ఆందోళనలను లేవనెత్తుతుందని, ప్రజల పరిశీలనలను ఆహ్వానిస్తుందని తెలియజేశారు. అవినీతి అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్ మాట్లాడుతూ ఈ సంఘటనలు వెలుగులోకి ఎప్పుడైతే వస్తాయో అప్పుడు సుప్రీంకోర్టు స్పందిస్తుందన్నారు. దుష్ప్రవర్తనకు తక్షణమే తగిన చర్యలను తీసుకుంటుందని చెప్పారు. 'ప్రతీ వ్యవస్థ ఎంత బలంగా ఉన్నా వృత్తిపరమైన దుష్ప్రవర్తన సమస్యలకు లోనవుతుంది. విచారకరంగా, న్యాయవ్యవస్థలో కూడా అవినీతి, దుష్ప్రవర్తనకు సంబంధించిన సందర్భాలు వెలుగుచూస్తాయి. ఇటువంటి సంఘటనలు అనివార్యంగా ప్రజావిశ్వాసంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయి. మొత్తం వ్యవస్థకు సంబంధించిన సమగ్రతపై విశ్వాసాన్ని సన్నగిల్లేలా చేస్తాయి. అయి తే ఇలాంటి సమస్యలు తలెత్తినప్పుడల్లా సుప్రీంకోర్టు నమ్మకాన్ని పునర్నిర్మించే మార్గాలను అనుసరిస్తుంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి నిర్ణయాత్మక, పారదర్శక చర్యలను తీసుకుంటుంది' అని సిజెఐ చెప్పారు. అలహాబాద్ హైకో ర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ తన అధికారిక నివాసం నుంచి పెద్ద మొ త్తంలో నగదును కనుగొన్న అనంతరం అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్. గవాయ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బిఆర్. గవాయ్ మా ట్లాడుతూ ' ప్రతీ ప్రజాస్వామ్యంలో న్యా యవ్యవస్థ తప్పనిసరిగా న్యాయం అం దించడమే కాకుండా సత్యాన్ని అధికారంలో ఉంచే అర్హత కలిగిన సంస్థగా చూ డాలి. 'న్యాయవ్యవస్థ చట్టబద్ధత', 'ప్రజావిశ్వాసం' అనే పదాలు ఒకదానితో ఒక టి అనుసంధానించబడి ఉన్నాయి' అని చెప్పారు.

### కాంగ్రెస్ పునరుజ్జీవానికి
# హర్యానా నేతలతో రాహుల్ భేటీ




**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ సంస్థాగత పునరుజ్జీవ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ బుధవారం హర్యానాలో కాంగ్రెస్ సీనియర్ నేతలు, ఎఐసిసి, పిసిసి అబ్జర్వర్లతో భేటీ అయ్యారు. హర్యానాలో దశాబ్ద కాలంగా కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉంది. అదే విధంగా 11 సంవత్సరాలుగా రాష్ట్రంలో జిల్లా స్థాయి కమిటీలు లేవు. ఈ ప్రక్రియను ప్రారంభించడానికే రాహుల్ గాంధీ హర్యానాలో పర్యటిస్తున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమానాశ్రయానికి చేరుకున్న అరగంట తర్వాత మధ్యాహ్నం హర్యానా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (హెచ్‌పిసిసి) ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. రెండున్నర గంటల పాటు జరిపిన పర్యటనలో రాహుల్ గాంధీ పార్టీ సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత ఎఐసిసి, పిసిసి పరిశీలకులతో మరో సమావేశం జరిగింది. మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, పార్టీ రాష్ట్ర యూనిట్ చీఫ్ ఉదయ్ భాన్, బీరేందర్ సింగ్, జనరల్ సెక్రటరీ కుమారి సెల్జా, సీనియర్ నాయకులు రణదీప్ సింగ్ సుర్జేవాలా, అజయ్ సింగ్ యాదవ్, ఎంపి దీపేందర్ సింగ్ హుడా, అశోక్ తన్వర్ వంటి మాజీ హెచ్‌పిసిసి చీఫ్‌లు సీనియర్ నాయకులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పార్టీ యూనిట్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన సూచనలు, హర్యానాలో డిసిసి, కాంగ్రెస్‌ను ఎలా బలోపేతం చేయవచ్చో సూచించారని పార్టీ నాయకులు తెలిపారు. ఆ తరువాత పార్టీ హర్యానా యూనిట్ సంస్థాగత కేడర్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించనున్నందున రాహుల్ గాంధీ ఎఐసిసి, పిసిసి పరిశీలకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశం తర్వాత సీనియర్ నాయకుడు, మాజీ కేంద్ర మంత్రి బీరేందర్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా హర్యానాలో కాంగ్రెస్‌కు సంస్థాగత నిర్మాణం లేదని చెప్పారు. హర్యానాలో సంస్థాగత నిర్మాణం పూర్తయినప్పుడు పార్టీ మరింత బలోపేతమవుతుందన్నారు. హర్యానాలో కాంగ్రెస్ గతంలో అంతర్గత కలహాలను చూసిందని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, 'అందరూ ఐక్యంగా ఉన్నారు' అని సింగ్ స్పష్టం చేశారు. పరిశీలకుల సమావేశంలో పాల్గొన్న అమిత్ సిహాగ్ తరువాత విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకత్వం శక్తివంతమైన సంస్థను నిర్మించడానికి ప్రయత్నిస్తోందని, పార్టీ సీనియర్ నాయకులు ఇందులో పాత్ర పోషిస్తారని అన్నారు. ఇక హర్యానాలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులను నియమించడానికి పార్టీ పరిశీలకులను నియమించింది. 'సంఘతన్ సృజన్ అభియాన్' (సంస్థ పునరుజ్జీవన ప్రచారం)లో భాగంగా మంగళవారం రాహుల్ గాంధీ భోపాల్‌ను సందర్శించారు.

# మరో యూట్యూబర్ అరెస్టు



**రూపనగర్ :** పహల్గాంలో ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌తో సంబంధం ఉన్న గూఢచర్య నెట్‌వర్క్‌పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా పాక్‌కు గూఢచర్యం చేస్తున్న ఆరోపణలతో మరో యూట్యూబర్‌ను పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రూపనగర్ జిల్లాలోని మహలాన్ గ్రామానికి చెందిన జస్బీర్ సింగ్ జాన్ మహల్ అనే పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తున్నాడు. ఇతడి ఛానెల్‌కు 1.1 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. నిందితుడికి పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారి, ఐఎస్ఐకి పనిచేస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న షకీర్ అలియాస్ జుట్ రాంధావాతో సంబంధాలు కొనసాగిస్తున్నాడు. పాక్ రాయబార కార్యాలయ అధికారి ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో కూడా టచ్‌లో ఉన్నాడు. ఇటీవల గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో ఇతడికి దగ్గరి సంబంధాలు ఉన్నట్లు తేలింది. డానిష్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలో జరిగిన జాతీయ దినోత్సవానికి కూడా సింగ్ హాజరయినట్లు గుర్తించారు. 2020, 21, 24లలో శత్రుదేశంలో ఇతడు పర్యటించాడు. నిందితుడికి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించగా.. దాయాది దేశానికి చెందిన అనేకమంది నంబర్లు బయటపడ్డాయి. జ్యోతి అరెస్టు నేపథ్యంలో వాటిని తొలగించేందుకు ప్రయత్నించాడనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కేసు నమోదు చేసుకొని పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నాం. కాగా.. పాక్‌కు గూఢచర్యం కేసులో పంజాబ్‌లో ఇప్పటివరకు ఏడుగురు అరెస్టు అయ్యారు. పాకిస్థాన్ నిఘా సంస్థలకు భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా ఇటీవల అరెస్టయిన సంగతి తెలిసిందే. 2023లో పాక్‌కు వెళ్లిన సమయంలో ఆమెకు డానిష్‌తో పరిచయమైంది. అనంతరం ఆమె ఆ దేశ గూఢచర్య సంస్థ ప్రతినిధులతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో జ్యోతి మల్హోత్రాకు ఉగ్రవాదులతో సంబంధం ఉన్నట్లు, ఉగ్ర కార్యకలాపాల్లో పాలుపంచుకున్నట్లు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు లేవని పోలీసులు పేర్కొన్నారు. అయితే, ఆమె పూర్తి స్పృహతోనే పాకిస్థానీ ఇంటెలిజెన్స్ అధికారులతో సంప్రదింపులు కొనసాగించిందని అన్నారు.

### ఆక్సిజన్, ఐసోలేషన్ బెడ్లు, వెంటిలేటర్లు
# అందుబాటులో ఉంచండి

### రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు జారీ



**న్యూఢిల్లీ :** దేశంలో రోజు రోజుకు కొవిడ్ విజృంభిస్తోంది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆక్సిజన్, ఐసోలేషన్ బెడ్లు, వెంటిలేటర్లు, అవసరమైన మందుల లభ్యతను నిర్ధారించుకోవాలని అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసినట్లు అధికారిక వర్గాలు బుధవారం తెలిపాయి. ఈనెల 2,3న డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిజిహెచ్ఎస్) డాక్టర్ సునీతా శర్మ అధ్యక్షతన వరుసగా సాంకేతిక సమీక్ష సమావేశాలు జరిగాయి. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ (ఇఎంఆర్) సెల్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సిడిసి), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్), ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడిఎస్‌పి), ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రుల ప్రతినిధులతో ప్రస్తుత కొవిడ్ పరిస్థితి, సంసిద్ధత చర్యలను అంచనా వేయడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఐడిఎస్‌పి పరిధిలో రాష్ట్ర, జిల్లా నిఘా విభాగాలు ఇన్‌ఫ్లూయెంజా లైక్ ఇల్నెస్ (ఐఎల్ఐ), తీవ్రమైన అక్యూట్ రెస్పిరేటరీ ఇల్నెస్ (ఎస్ఎఆర్ఐ)లను నిశితంగా పరిశీలిస్తున్నట్లు వర్గాలు తెలిపాయి. అడ్మిట్ అయిన అన్ని ఎస్ఎఆర్ఐ కేసులకు, మార్గదర్శకాల ప్రకారం 5 శాతం ఐఎల్ఐ కేసులకు పరీక్షలు సిఫార్సు చేయబడ్డాయి. పాజిటివ్ ఎస్ఎఆర్ఐ నమూనాలను ఐసిఎంఆర్ విఆర్‌డిఎల్ నెట్‌వర్క్ ద్వారా హోల్ జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం పంపబడతాయని వర్గాలు పేర్కొన్నాయి. ఈనెల 4 నాటికి, భారతదేశంలో 4,302 యాక్టివ్ కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల్లో 864 కేసులు పెరిగాయి. చాలా కేసులు తేలికపాటివివని, గృహ సంరక్షణలో నిర్వహించబడుతున్నాయని అధికారిక వర్గాలు తెలిపాయి. జనవరి 1 నుండి, 44 మరణాలు సంభవించాయి. కాగా, ఆక్సిజన్, ఐసోలేషన్ పడకలు, వెంటిలేటర్లు, అవసరమైన మందుల లభ్యతను నిర్ధారించాలని రాష్ట్రాలకు సూచించినట్లు వర్గాలు పేర్కొన్నాయి. ప్రజలు చేతి పరిశుభ్రత, దగ్గు మర్యాదలు పాటించాలని, అనారోగ్యంగా ఉన్నప్పుడు రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండాలని, తీవ్రమైన శ్వాసకోశ అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు లక్షణాలు తీవ్రమైతే స్వీయ పర్యవేక్షణ, వైద్య సంరక్షణ పొందాలని అధికారిక వర్గాలు సూచించాయి. తప్పుడు సమాచారం, పుకార్లను నివారించడానికి ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్, పిఐబి విడుదలలు వంటి విశ్వసనీయ సమాచారాన్ని అనుసరించాలని వారు అన్నారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తూనే ఉందిదని, సకాలంలో జోక్యం చేసుకోవడం, సమర్థవంతమైన కమ్యూనికేషన్ ద్వారా ప్రజారోగ్య భద్రతను నిర్ధారించడానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అరాచకమైన సనాతన ధర్మాన్ని సమర్ధించే వారిని శిక్షించాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అరాచకమైన కృరమైన సనాతన ధర్మాన్ని సమర్థించే పవన్ కళ్యాణ్ తో సహా ప్రతి ఒక్కరిని శిక్షించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ మూడు పెండ్లిళ్లకు సంబంధించి గతంలో నేనెపుడు మాట్లాడలేదని, సనాతనధర్మాన్ని పవన్ కళ్యాణ్ నెత్తికెక్కుచుకున్నాకే మాట్లాడాల్సి వస్తోందన్నారు. సనాతన ధర్మంలో విడాకులే లేనప్పుడు పవన్ కళ్యాణ్ విడాకులు ఎలా ఇచ్చారనిఆయన పునరుద్ఘాటించారు. సనాతధర్మాన్ని గురుంచి వాచస్పతి గరికపాటి నర్సింహారావు ఏమిచెబుతారో వినాలన్నారు. సనాతన ధర్మంలో ఒకసారి పెళ్లైతే ఆ తర్వాత భర్త ఎంత వేధించినా, అతనితోనే కాపురం చేయాలని, చివరికి భర్త చనిపోతే అదే చితిమంటలో భార్యను కూడా తగలబెడతారనేది సారాంశమని నారాయణ అన్నారు. సెక్యులరిజాన్ని నాశనం చేసే ఈ సనాతన ధర్మాన్ని పాటించేవారిని శిక్షించాలని, విమర్శించే వారిని కాదని నారాయణ తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వము,
రెవెన్యూ (భూ సేకరణ)శాఖ
ఫారం-6, (ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016 లోని చాప్టర్ III ఎ లోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం. 38/2025/ . తేది: .06.2025
జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి
ఫైల్ నెం. G/2604/2025. తేది: .06.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (LA), యాదాద్రి భువనగిరి
ఫైల్ నెం. A/30/2025, తేది: 04.06.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా, మోత్కూరు మండలం, పొటిమట్ల గ్రామములో విస్తీర్ణం **ఎ.17.24 గుంటల** భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 108 I&CAD (LA.R&R/A2) Department, Dt:31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాధి కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం- 2013 లోని చాప్టర్-11 (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్ - III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి ప్రాజెక్టు పునరావాసం మరియు పునరుపాధి కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్ గా) నియమించనైనది.

కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, మోత్కూరు మండలం, దాచారం గ్రామములో విస్తీర్ణం **ఎ.17.24 గుంటల** భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా : యాదాద్రి భువనగిరి మండలం : మోత్కూరు గ్రామం : పొటిమట్ల

| సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం) | [illegible] |
|---|---|---|---|---|
| 143 ఖుష్కీ / పట్టా 1.01 ¾ | రచ్చ వెంకట్ రెడ్డి తండ్రి రాం రెడ్డి<br>రచ్చ కృష్ణా రెడ్డి తండ్రి రాం రెడ్డి | రచ్చ వెంకట్ రెడ్డి తండ్రి రాం రెడ్డి<br>రచ్చ కృష్ణా రెడ్డి తండ్రి రాం రెడ్డి | 1.01 ¾ | - |
| 144 ఖుష్కీ /పట్టా 1.31 ¾ | రావి శ్రీహిత భర్త రాజేందర్ రెడ్డి<br>రచ్చ కృష్ణా రెడ్డి తండ్రి రాం రెడ్డి<br>రచ్చ వెంకట్ రెడ్డి తండ్రి రాం రెడ్డి<br>పబ్బతి వెంకట్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి<br>సాయికిరణ్ రెడ్డి మద్దూరి తండ్రి నాగభూషణం<br>పబ్బతి రాజ్ రెడ్డి మల్లా రెడ్డి<br>పబ్బతి విజయ రెడ్డి భర్త మల్లా రెడ్డి<br>రచ్చ సాగర్ రెడ్డి తండ్రి సంజీవ రెడ్డి | రావి శ్రీహిత భర్త రాజేందర్ రెడ్డి<br>రచ్చ కృష్ణా రెడ్డి తండ్రి రాం రెడ్డి<br>రచ్చ వెంకట్ రెడ్డి తండ్రి రాం రెడ్డి<br>పబ్బతి వెంకట్ రెడ్డి తండ్రి మల్లా రెడ్డి<br>సాయికిరణ్ రెడ్డి మద్దూరి తండ్రి నాగభూషణం<br>పబ్బతి రాజ్ రెడ్డి మల్లా రెడ్డి<br>పబ్బతి విజయ రెడ్డి భర్త మల్లా రెడ్డి<br>రచ్చ సాగర్ రెడ్డి తండ్రి సంజీవ రెడ్డి | 1.31 ¾ | - |
| 145 ఖుష్కీ /పట్టా 0.37 ¼ | రచ్చ సాగర్ రెడ్డి తండ్రి సంజీవ రెడ్డి<br>సాయికిరణ్ రెడ్డి మద్దూరి తండ్రి నాగభూషణం<br>రావి రాజేందర్ రెడ్డి తండ్రి దేవి రెడ్డి<br>పబ్బతి రాజ్ రెడ్డి మల్లా రెడ్డి<br>పబ్బతి విజయ రెడ్డి భర్త మల్లా రెడ్డి | రచ్చ సాగర్ రెడ్డి తండ్రి సంజీవ రెడ్డి<br>సాయికిరణ్ రెడ్డి మద్దూరి తండ్రి నాగభూషణం<br>రావి రాజేందర్ రెడ్డి తండ్రి దేవి రెడ్డి<br>పబ్బతి రాజ్ రెడ్డి మల్లా రెడ్డి<br>పబ్బతి విజయ రెడ్డి భర్త మల్లా రెడ్డి | 0.37 ¼ | - |
| 141 ఖుష్కీ /పట్టా 1.39 | ఆర్.సంజన భర్త లక్ష్మీ నర్సింహా రెడ్డి<br>రాచకొండ రాములమ్మ భర్త సుధాకర్<br>చల్ల మానస భర్త సాయి కుమార్<br>చల్ల కొమురయ్య తండ్రి సింహాద్రి<br>రాచకొండ యాదయ్య తండ్రి చిన్న రామయ్య<br>రాచకొండ రమేశ్ తండ్రి యాదయ్య<br>రాచకొండ కనకయ్య తండ్రి రాం నర్సయ్య<br>రాచకొండ మంగమ్మ భర్త కనకయ్య<br>రాచకొండ సుధాకర్ తండ్రి రాజాలు<br>చల్ల రామమల్లేష్ తండ్రి సింహాద్రి<br>చల్ల ముత్తమ్మ భర్త మల్లయ్య<br>చల్ల సోమయ్య తండ్రి మల్లయ్య<br>చల్ల అశివేలు భర్త రామమల్లేష్<br>రాచకొండ నర్సయ్య తండ్రి చిన్న రామయ్య<br>రాచకొండ బలవంతు తండ్రి చిన్న రామయ్య<br>రాచకొండ వెంకటయ్య తండ్రి బొందయ్య<br>రాచకొండ సత్యనారాయణ తండ్రి బొందయ్య<br>కొండ రామయ్య తండ్రి వెంకటయ్య | ఆర్.సంజన తండ్రి లక్ష్మీ నర్సింహా రెడ్డి<br>రాచకొండ రాములమ్మ భర్త సుధాకర్<br>చల్ల మానస భర్త సాయి కుమార్<br>చల్ల కొమురయ్య తండ్రి సింహాద్రి<br>రాచకొండ యాదయ్య తండ్రి చిన్న రామయ్య<br>రాచకొండ రమేశ్ తండ్రి యాదయ్య<br>రాచకొండ కనకయ్య తండ్రి రాం నర్సయ్య<br>రాచకొండ మంగమ్మ భర్త కనకయ్య<br>రాచకొండ సుధాకర్ తండ్రి రాజాలు<br>చల్ల రామమల్లేష్ తండ్రి సింహాద్రి<br>చల్ల ముత్తమ్మ భర్త మల్లయ్య<br>చల్ల సోమయ్య తండ్రి మల్లయ్య<br>చల్ల అశివేలు భర్త రామమల్లేష్<br>రాచకొండ నర్సయ్య తండ్రి చిన్న రామయ్య<br>రాచకొండ బలవంతు తండ్రి చిన్న రామయ్య<br>రాచకొండ వెంకటయ్య తండ్రి బొందయ్య<br>రాచకొండ సత్యనారాయణ తండ్రి బొందయ్య<br>ఇండ్ల స్థలాలు / ప్లాట్లు | 1.39 | - |
| 139 ఖుష్కీ / పట్టా 1.05 ¼ | చల్ల సామి తండ్రి మల్లయ్య<br>చల్ల రామచంద్రయ్య తండ్రి లింగయ్య<br>చల్ల కిష్టయ్య తండ్రి లింగయ్య<br>చల్ల మల్లయ్య తండ్రి రామయ్య<br>చల్ల రామమల్లేష్ తండ్రి సింహాద్రి<br>చల్ల కొమురయ్య తండ్రి సింహాద్రి<br>శీల అంజమ్మ భర్త సోమయ్య<br>రాచకొండ నర్సయ్య తండ్రి పెద్ద రామయ్య<br>రాచకొండ వెంకటయ్య తండ్రి పెదరామయ్య<br>చల్ల సింహాద్రి తండ్రి మల్లయ్య<br>చల్ల సోమయ్య తండ్రి మల్లయ్య<br>రాచకొండ యాదయ్య తండ్రి చిన్న రామయ్య<br>బండారి రమణమ్మ భర్త అంతయ్య<br>రాచకొండ బలవంతు తండ్రి చిన్న రామయ్య | చల్ల సామి తండ్రి మల్లయ్య<br>చల్ల రామచంద్రయ్య తండ్రి లింగయ్య<br>చల్ల కిష్టయ్య తండ్రి లింగయ్య<br>చల్ల మల్లయ్య తండ్రి రామయ్య<br>చల్ల రామమల్లేష్ తండ్రి సింహాద్రి<br>చల్ల కొమురయ్య తండ్రి సింహాద్రి<br>శీల అంజమ్మ భర్త సోమయ్య<br>రాచకొండ నర్సయ్య తండ్రి పెద్ద రామయ్య<br>రాచకొండ వెంకటయ్య తండ్రి పెదరామయ్య<br>చల్ల సింహాద్రి తండ్రి మల్లయ్య<br>చల్ల సోమయ్య తండ్రి మల్లయ్య<br>రాచకొండ యాదయ్య తండ్రి చిన్న రామయ్య<br>బండారి రమణమ్మ భర్త అంతయ్య<br>రాచకొండ బలవంతు తండ్రి చిన్న రామయ్య | 1.05 ¼ | - |
| 96 ఖుష్కీ / పట్టా 1.33 | అన్నవరం రాములు తండ్రి నర్సయ్య<br>అన్నావరం నారాయణ తండ్రి మల్లయ్య<br>అన్నావరం నర్సమ్మ భర్త నారాయణ<br>పేరవాల నమిత భర్త సాయి రెడ్డి<br>అన్నవరం మల్లేశం తండ్రి వెంకటేశం<br>అన్నవరం పద్మ భర్త రాములు<br>అన్నావరం వెంకటయ్య తండ్రి మల్లయ్య<br>అన్నవరం బొజ్జమ్మ భర్త వెంకటయ్య | అన్నవరం రాములు తండ్రి నర్సయ్య<br>అన్నావరం నారాయణ తండ్రి మల్లయ్య<br>అన్నావరం నర్సమ్మ భర్త నారాయణ<br>పేరవాల నమిత భర్త సాయి రెడ్డి<br>అన్నవరం మల్లేశం తండ్రి వెంకటేశం<br>అన్నవరం పద్మ భర్త రాములు<br>అన్నావరం వెంకటయ్య తండ్రి మల్లయ్య<br>అన్నవరం బొజ్జమ్మ భర్త వెంకటయ్య | 1.33 | - |
| 0.09 ¼ | ఆర్&బి రోడ్డు | ఆర్&బి రోడ్డు | 0.09 ¼ | - |
| 95 ఖుష్కీ / పట్టా 1.34 ¼ | నాగపురి కృష్ణ తండ్రి రామనర్సయ్య<br>ఉప్పమ్మ భర్త రాములు<br>బండారు ఉప్పలయ్య తండ్రి రామయ్య<br>నాగపూరి ఉప్పమ్మ భర్త నర్సయ్య<br>నాగపూరి యాదయ్య తండ్రి చంద్రయ్య<br>యానాల రాం రెడ్డి తండ్రి నర్సిరెడ్డి<br>మహమ్మద్ అబ్దుల్ హమీద్ తండ్రి సత్తార్<br>ఐతరాజు యాదయ్య తండ్రి అంతయ్య<br>[illegible] భర్త పురుషోత్తం<br>సిలివేరు వెంకట రమణ తండ్రి అంజయ్య<br>ఎలగందుల శేఖర్ తండ్రి బిక్షమయ్య<br>నాగపూరి యాదయ్య తండ్రి నాగయ్య<br>[illegible]<br>రచ్చ అమృత రెడ్డి భర్త నారాయణ రెడ్డి<br>మరుపాక మంగమ్మ భర్త సాయిలు<br>నాగపూరి యాదమ్మ భర్త రామనర్సయ్య<br>సిందం నర్సయ్య తండ్రి గోపాల్<br>పురుగుల రవీందర్ తండ్రి మల్లయ్య<br>గొడిశాల వెంకటేశ్వర్లు తండ్రి అంజయ్య<br>నాగపూరి సత్తయ్య తండ్రి యాదయ్య<br>నాగపూరి నరేశ్ తండ్రి యాదయ్య<br>నాగపూరి జలేందర్ తండ్రి యాదయ్య | నాగపురి కృష్ణ తండ్రి రామనర్సయ్య<br>నాగపూరి ఉప్పమ్మ భర్త రాములు<br>బండారు ఉప్పలయ్య తండ్రి రామయ్య<br>నాగపూరి ఉప్పమ్మ భర్త నర్సయ్య<br>నాగపూరి యాదయ్య తండ్రి చంద్రయ్య<br>ఇండ్ల స్థలాలు / ప్లాట్లు<br>ఇండ్ల స్థలాలు / ప్లాట్లు<br>ఇండ్ల స్థలాలు / ప్లాట్లు<br>ఇండ్ల స్థలాలు / ప్లాట్లు<br>సిలివేరు వెంకట రమణ తండ్రి అంజయ్య<br>ఎలగందుల శేఖర్ తండ్రి బిక్షమయ్య<br>నాగపూరి యాదయ్య తండ్రి నాగయ్య<br>ఇండ్ల స్థలాలు / ప్లాట్లు<br>రచ్చ అమృత రెడ్డి భర్త నారాయణ రెడ్డి<br>మరుపాక మంగమ్మ భర్త సాయిలు<br>నాగపూరి యాదమ్మ భర్త రామనర్సయ్య<br>ఇండ్ల స్థలాలు / ప్లాట్లు<br>ఇండ్ల స్థలాలు ప్లాట్లు<br>ఇండ్ల స్థలాలు / ప్లాట్లు<br>నాగపూరి సత్తయ్య తండ్రి యాదయ్య<br>నాగపూరి నరేశ్ తండ్రి యాదయ్య<br>నాగపూరి జలేందర్ తండ్రి యాదయ్య | 1.34 ¼ | - |
| 93 ఖుష్కీ / పట్టా 1.07 ¼ | మరుపాక మంగమ్మ భర్త సాయిలు<br>నాగపూరి రోశయ్య తండ్రి నాగయ్య<br>సిలివేరు వెంకటరమణ తండ్రి అంజయ్య<br>ఎలగందుల శేఖర్ తండ్రి బిక్షమయ్య<br>నాగపూరి కృష్ణ తండ్రి రామనర్సయ్య<br>నాగపూరి యాదయ్య తండ్రి నాగయ్య<br>కామల నర్సయ్య తండ్రి లింగయ్య<br>రచ్చ చందు తండ్రి లక్ష్మా రెడ్డి<br>రచ్చ లక్ష్మా రెడ్డి తండ్రి రాఘవరెడ్డి<br>రచ్చ శ్రీదేవి భర్త పెద్దెం సుమన్<br>రచ్చ వెంకట్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి<br>రచ్చ విఠల్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి | మరుపాక మంగమ్మ భర్త సాయిలు<br>నాగపూరి రోశయ్య తండ్రి నాగయ్య<br>సిలివేరు వెంకటరమణ తండ్రి అంజయ్య<br>ఎలగందుల శేఖర్ తండ్రి బిక్షమయ్య<br>నాగపూరి కృష్ణ తండ్రి రామనర్సయ్య<br>S నాగపూరి యాదయ్య తండ్రి నాగయ్య<br>కామల నర్సయ్య తండ్రి లింగయ్య<br>రచ్చ చందు తండ్రి లక్ష్మా రెడ్డి<br>రచ్చ లక్ష్మా రెడ్డి తండ్రి రాఘవరెడ్డి<br>రచ్చ శ్రీదేవి భర్త పెద్దెం సుమన్<br>లే ఔట్<br>రచ్చ విఠల్ రెడ్డి తండ్రి నారాయణ రెడ్డి | 1.07 ¼ | - |
| 89 ఖుష్కీ / పట్టా 0.18 ½ | దండెబోయిన వెంకన్న తండ్రి యాదయ్య<br>రాచకొండ పెద్దమ్మ భర్త నర్సయ్య<br>దండెబోయిన వీరమ్మ భర్త గంగయ్య<br>రాచకొండ బాలరాజు తండ్రి నర్సయ్య<br>రాచకొండ మల్లయ్య తండ్రి సత్తయ్య<br>రాచకొండ యాదగిరి తండ్రి మల్లయ్య<br>రాచకొండ శ్రీశైలం తండ్రి మల్లయ్య<br>మరుపాక పవన్ కుమార తండ్రి బిక్షమయ్య<br>చల్ల రామయ్య తండ్రి నర్సయ్య<br>[illegible] | దండెబోయిన వెంకన్న తండ్రి యాదయ్య<br>రాచకొండ పెద్దమ్మ భర్త నర్సయ్య<br>దండెబోయిన వీరమ్మ భర్త గంగయ్య<br>రాచకొండ బాలరాజు తండ్రి నర్సయ్య<br>రాచకొండ మల్లయ్య తండ్రి సత్తయ్య<br>రాచకొండ యాదగిరి తండ్రి మల్లయ్య<br>రాచకొండ శ్రీశైలం తండ్రి మల్లయ్య<br>మరుపాక పవన్ కుమార తండ్రి బిక్షమయ్య<br>చల్ల రామయ్య తండ్రి నర్సయ్య<br>[illegible] | 0.18 ½ | - |
| 86 ఖుష్కీ / పట్టా 0.36 | [illegible]<br>[illegible] తండ్రి నర్సయ్య<br>రచ్చ భాస్కర్ రెడ్డి తండ్రి హన్మంత్ రెడ్డి<br>రచ్చ శ్రీనివాస్ రెడ్డి తండ్రి గోపాల్ రెడ్డి<br>దేవరపల్లి జ్యోతి భర్త పిల్లారెడ్డి<br>రచ్చ లక్ష్మారెడ్డి తండ్రి రాఘవ రెడ్డి | [illegible]<br>[illegible] తండ్రి నర్సయ్య<br>రచ్చ భాస్కర్ రెడ్డి తండ్రి హన్మంత్ రెడ్డి<br>రచ్చ శ్రీనివాస్ రెడ్డి తండ్రి గోపాల్ రెడ్డి<br>దేవరపల్లి జ్యోతి భర్త పిల్లారెడ్డి<br>రచ్చ లక్ష్మారెడ్డి తండ్రి రాఘవ రెడ్డి | 0.36 | - |
| 85 ఖుష్కీ / పట్టా 1.15 ¾ | గొలుసుల అంజమ్మ భర్త సోమయ్య<br>రచ్చ రంగారెడ్డి తండ్రి వెంకటకృష్ణా రెడ్డి<br>దైద పురుషోత్తమ రెడ్డి తండ్రి మోహన్ రెడ్డి<br>ముద్దం అరుణ భర్త ప్రభాకర్ రెడ్డి<br>గొలుసుల నర్సమ్మ భర్త ఐలయ్య<br>రచ్చ రామచంద్ర రెడ్డి తండ్రి వెంకటకృష్ణా రెడ్డి | గొలుసుల అంజమ్మ భర్త సోమయ్య<br>రచ్చ రంగారెడ్డి తండ్రి వెంకటకృష్ణా రెడ్డి<br>దైద పురుషోత్తమ రెడ్డి తండ్రి మోహన్‌రెడ్డి<br>ముద్దం అరుణ భర్త ప్రభాకర్ రెడ్డి<br>గొలుసుల నర్సమ్మ భర్త ఐలయ్య<br>రచ్చ రామచంద్ర రెడ్డి తండ్రి వెంకటకృష్ణారెడ్డి | 1.15 ¾ | - |
| 82 ఖుష్కీ / పట్టా 0.37 ½ | పన్నాల రమాదేవి భర్త సుధాకర్ రెడ్డి<br>ఎల్లు చంద్రశేఖర్ రెడ్డి తండ్రి సీతారాం రెడ్డి<br>గొల్లల ముత్యాలు భర్త కొండయ్య<br>గొల్ల్యాల శ్రావణ్ కుమార్ తండ్రి ముత్యాలు<br>గొల్లల సోమన్న తండ్రి కొండయ్య<br>గొల్ల్యాల రజనీకాంత్ తండ్రి సోమన్న<br>గొల్లల శ్రీను తండ్రి కొండయ్య<br>గొల్లల నరేశ్ చంద్ర తండ్రి శ్రీను<br>రచ్చ సుదర్శనం భర్త రంగారెడ్డి<br>ఎల్లు కృష్ణ రెడ్డి తండ్రి నారాయణ్ రెడ్డి | పన్నాల రమాదేవి భర్త సుధాకర్ రెడ్డి<br>ఎల్లు చంద్రశేఖర్ రెడ్డి తండ్రి సీతారాం రెడ్డి<br>గొల్లల ముత్యాలు భర్త కొండయ్య<br>గొల్లల శ్రావణ్ కుమార్ తండ్రి ముత్యాలు<br>గొల్లల సోమన్న తండ్రి కొండయ్య<br>గొల్ల్యాల రజనీకాంత్ తండ్రి సోమన్న<br>గొల్లల శ్రీను తండ్రి కొండయ్య<br>గొల్లల నరేశ్ చంద్ర తండ్రి శ్రీను<br>రచ్చ సుదర్శనం భర్త రంగారెడ్డి<br>ఎల్లు కృష్ణ రెడ్డి తండ్రి నారాయణ్ రెడ్డి | 0.37 ½ | - |
| 81 ఖుష్కీ /పట్టా 1.12 ¼ | పన్నాల రమాదేవి భర్త సుధాకర్ రెడ్డి<br>గొలుసుల సీలమ్మ భర్త సోమన్న<br>గొలుసుల రజనీకాంత్ తండ్రి సోమన్న<br>గొల్లల నరేశ్ చంద్ర తండ్రి శ్రీను<br>ఎల్లు చంద్రశేఖర్ రెడ్డి తండ్రి సీతారాం రెడ్డి<br>ఎల్లు కృష్ణ రెడ్డి తండ్రి నారాయణ్ రెడ్డి<br>గొల్లల కొమరాజ్ భర్త ముత్యాలు<br>గొల్ల్యాల శ్రావణ్ కుమార్ తండ్రి ముత్యాలు<br>గొల్ల్యాల ప్రమీల భర్త శ్రీను | పన్నాల రమాదేవి భర్త సుధాకర్ రెడ్డి<br>గొలుసుల సీలమ్మ భర్త సోమన్న<br>గొలుసుల రజనీకాంత్ తండ్రి సోమన్న<br>గొల్లల నరేశ్ చంద్ర తండ్రి శ్రీను<br>రోడ్డు<br>రోడ్డు<br>గొల్లల కొమరాజ్ భర్త ముత్యాలు<br>గొల్ల్యాల శ్రావణ్ కుమార్ తండ్రి ముత్యాలు<br>గొల్ల్యాల ప్రమీల భర్త శ్రీను | 1.12 ¼ | - |
| 83 ఖుష్కీ / పట్టా 0.24 ¼ | మంకాల చంద్రశేఖర్ రెడ్డి తండ్రి అంజన్ రెడ్డి<br>అందెం నర్సిరెడ్డి తండ్రి రామ్ రెడ్డి | మంకాల చంద్రశేఖర్ రెడ్డి తండ్రి అంజన్‌రెడ్డి<br>ఇండ్ల స్థలాలు / ప్లాట్లు | 0.24 ¼ | - |
| | | మొత్తము విస్తీర్ణం | 17.24 | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు ( తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియుప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/ తాకట్టు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు/అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే.), ఆర్ అండ్ ఆర్, విభాగము-2 ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO NO.204/LA/PP/Advt/Pub/2025-26


# అంగన్‌వాడి కేంద్రాల్లో 'ఎగ్‌బిర్యానీ'

### భోజనాన్ని రుచికరంగా మారుస్తాం
### మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంగన్‌వాడీ కేంద్రాల్లో వారంలో ఒకటి, రెండుసార్లు 'ఎగ్ బిర్యానీ' వడ్డించేలా మెనూను మారుస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. అంగన్‌వాడిలో చిన్నారులకు అందిస్తున్న భోజన మెనూను మరింత రుచికరంగా మారుస్తామని, అంగన్‌వాడీ కేంద్రం అంటే, చిన్నారుల్లో సృజనాత్మకత సృష్టించే వికాస కేంద్రాలుగా మారుస్తామని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పని ఒత్తిడిని తగ్గించేందుకు త్వరలోనే 14 వేల ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైన 'మేథోమదన సదస్సు 2025'కు మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ చిన్నారుల అభ్యాసం కోసం వినూత్నంగా రూపొందించిన టీచింగ్ మెటీరియల్ స్టాల్‌ను పరిశీలించి, వారిని మంత్రి అభినందించారు. మహిళా సంఘాల ద్వారా మెటీరియల్ ను రూపొందించి ప్రతి అంగన్‌వాడి కేంద్రానికి పంపిణీ చేస్తామన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల జీతాలను కూడా గ్రీన్ ఛానల్‌లో ప్రతినెలా అందించేందుకు కృషి చేస్తామన్నారు. అంగన్‌వాడి కేంద్రాలకు నాసిరకం సరుకులు సరఫరా చేసే సప్లయర్లను బ్లాక్ లిస్టులో పెడుతున్నామని స్పష్టం చేశారు. అంగన్‌వాడి లబ్ధిదారులకు అందిస్తున్న కోడిగుడ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, కోడిగుడ్డును ఉడకబెట్టి అలాగే ఇవ్వకుండా, రెండు ముక్కలు చేసి ఇస్తే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మంత్రి సీతక్క సూచించారు.



నేటి చిన్నారులే రేపటి పౌరులని, ఆ చిన్నారులపైన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉన్నదని, అందుకే అంగన్‌వాడీ లబ్ధిదారులకు మెరుగైన సేవలను అందిస్తూ దేశ సేవ చేస్తున్నారన్నారు. కల్మషం, కల్లాకపటం లేని చిన్నారులు దేవుళ్ళతో సమానం అని, మాధవసేవే మానవ సేవ అనే నానుడిని పాటించి, అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను అందించాలని మంత్రి సీతక్క సూచించారు. చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్‌వాడీలకు వచ్చే గర్భిణీలు బాలింతలు నేల మీద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని, అందుకే అంగన్‌వాడీ కేంద్రాలకు బెంచీలను సరఫరా చేస్తామని ప్రకటించారు. అంగన్‌వాడీ టీచర్లు వినియోగిస్తున్న మొబైల్ స్థానంలో, అధునాతన మొబైల్స్‌ను త్వరలో అందజేస్తామన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది 25 శాతం అడ్మిషన్లు పెరిగేలా సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. బడి గంట తరహాలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ బెల్లును తీసుకురావాలన్నారు. కేంద్రాల్లో ఉదయం గంటను మోగించడం ద్వారా చిన్నారుల్లో ఉత్సాహం క్రమశిక్షణ పెరుగుతాయని, అంగన్‌వాడి టీచర్లు హెల్పర్లు సకాలంలో వచ్చేందుకు ఉపయోగపడుతుందని సూచించారు. దశాబ్ధ కాలంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను అక్షర జ్ఞానానికి, పోషకాహారానికి, ఆరోగ్యానికి, ఆటవిడుపునకు, వికాసానికి కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు.అంగన్‌వాడీల సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. మంత్రి సీతక్క వెంట టీజీ ఫుడ్స్ చైర్మన్ ఎంఎ ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### దురుసుగా ప్రవర్తించిన ఎఎస్‌ఐపైన చర్యలు తీసుకోండి

నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో రైతుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఎఎస్‌పైన చర్యలు తీసుకోవాలి జిల్లా ఎస్‌పి జానకి షర్మిలకు ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. దీంతో తక్షణమే ఆ ఎఎస్‌ఐని సస్పెండ్ చేశారు. రైతులపై దురుసుగా వ్యవహరిస్తే సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు.

## తెలంగాణకు యూరియా సరఫరాపై కేంద్రం వివక్ష

### రెండు నెలల కోటాలో 1.14 లక్షల మెట్రిక్ టన్నుల కోత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రానికి యూరియా సరఫరాలో కేంద్రం వివక్ష చూపుతోంది. ఈ ఏడాది ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు రావడంతో వ్యవసాయ పనులు మొదలు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టింది. అయితే ఇందుకు కేంద్రం సహకారం అందించకపోవడంతో వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. ఈ వానాకాలం పంటల సాగుకు రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం కేటాయించి, నెలవారీ సరఫరా ప్రణాళిక ప్రకారం రాష్ట్రానికి సరఫరా చేస్తోంది. అయితే నెల వారిగా కోటాగా కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన యూరియాలో గత రెండు నెలలుగా కేంద్రం కోత విధించింది. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన ప్రకారం ఏప్రిల్‌లో 1.70 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.22 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయగా, 0.48లక్షల మెట్రిక్ టన్నులు కొత విధించింది. అదేవిధంగా మేనెలకు గాను 1.60లక్షల మెట్రిక్ టన్నులను కేటాయించగా,సరఫరా 0.94 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయగా 0.66 లక్షల మెట్రిక్ టన్నులు పంపించలేదు. దీంతో ఈ రెండు నెలలలో రాష్ట్రానికి మొత్తం 1.14 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కోత ఏర్పడింది. అదేవిధంగా ఈనెల (జూన్)కు సంబంధించి 1.70 లక్షల మెట్రిక్ టన్నులకు గాను ఇప్పటీ వరకు కేంద్రం 0.03 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే పంపింది. దీంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గత రెండునెలలకు సంబంధించి కోత విధించిన 1.14 లక్షల మెట్రిక్ టన్నులను జూన్ కేటాయింపులతో కలిపి సరఫరా చేయాల్సిందిగా ఇప్పటికే కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి విజ్ఞప్తి చేశారు. అయినా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులను మంత్రి అప్రమత్తం చేశారు. రెండు మూడు రోజుల్లో ఢిల్లీకి కోటా ప్రకారం యూరియాను సరఫరా చేయాలని సంబంధింత అధికారులను కలిసి విజ్ఞప్తి చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను మంత్రి తుమ్మల అదేశించారు.

## ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి ఘటన తీవ్ర దిగ్భ్రాంత్రికి గురిచేసింది

### హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో కలుషిత ఆహార ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అస్వస్థకు గురైన వారికి నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నామని మంత్రి చెప్పారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి పర్యవేక్షణలో ఉన్నతాధికారులతో విచారణ జరిపించామన్నారు. ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఫుడ్ కాంట్రాక్ట్‌ను రద్దు చేశామని తెలిపారు. ఘటన బాధ్యులైనా అధికారిపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యులతో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ఎర్రగడ్డ హాస్పిటల్ ఆర్‌ఎంఒ సస్పెన్షన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. రోగులకు కలుషితాహారం సరఫరాపై ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆస్పత్రిలో ఆహార పదార్థాలు సరఫరా చేసే కాంట్రాక్టర్ జైపాల్ రెడ్డితో పాటు, ఆర్‌ఎంఒ డాక్టర్ పద్మజను సస్పెండ్ చేసింది. ఈ ఘటనలో భూపాల్‌పల్లికి చెందిన కరణ్ అనే యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై చనిపోగా మరో 92 మంది రోగులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో 18 మందిని మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కలుషితాహారం ఘటనకు ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్ జైపాల్ రెడ్డి తీవ్ర నిర్లక్ష్యమే కారణం అని గుర్తించారు. ప్రస్తుతం ఉస్మానియాకు చెందిన వైద్యుల బృంధాన్ని ఎర్రగడ్డకు రప్పించి పర్యవేక్షిస్తున్నారు. మిగిలినవారి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా చక్కెర పరమాన్నం రోగులకు పెట్టారు. దీంతో పాటూ పండ్లు, పాలు, గుడ్లు అందించారు. తిన్న తరవాత డిసి వార్డు, కోర్టు వార్డుల్లో రోగులకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. డిసి వార్డులో ఉన్న కరణ్ జ్వరం, ఇతర సమస్యలతో తీవ్ర అనారోగ్యానికి గురై మంగళవారం చనిపోయాడు.

హైదరాబాదులోని ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో అస్వస్థతకు గురైన బాధితులను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం పరామర్శించారు. జరిగిన సంఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్ ను తొలగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

## ఆసుపత్రి ఘటన అత్యంత బాధాకరం

### హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎర్రగడ్డ ఆసుపత్రిలో ఒకేసారి 70 మంది ఫుడ్ పాయిజన్‌కు గురై, అందులో ఒకరు మృతి చెందడం అత్యంత బాధాకరమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఫుడ్ పాయిజన్లు జరగటం, ప్రాణాలు కోల్పోవడం అత్యంత సాధారణమైందని మండిపడ్డారు. మానసిక వైద్యం పొందేందుకు ఆసుపత్రి వచ్చిన పేషంట్లకు కూడా నాణ్యమైన భోజనం పెట్టలేని దిక్కుమాలిన స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా అని మండిపడ్డారు. ప్రాణం కోల్పోయిన ఆ మానసిక రోగి మృతికి ఎవరు బాధ్యులని, ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులతో పాటు, మిగతా 67 మందికి నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆయనరాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, రైతు పై చేయి చేసుకున్నపోలీసుపైన వెంటనే చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావుడిమాండ్‌చేశారు.ఈ ఘటన పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఆసుపత్రులలో నిరంతర విద్యుత్ ఉండేలా చర్యలు

### అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఉత్పత్తి జనరేటర్ ల పనితీరు వాటి సామర్థ్యం పై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జనరేటర్ సౌకర్యం లేని ఆసుపత్రులలో ఆటోమేటెడ్ జనరేటర్ లను సమకూర్చుకోవడానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రులలో విద్యుత్ నిర్వహణ కోసం తాత్కాలిక పద్ధతిలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ లను నియమించుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాల అవసరమైన అత్యవసర పరికరాలను, సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఆస్పత్రులలో నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టాలని, జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి లలో నిరంతరం విద్యుత్తు సరఫరా జరిగేలా జిల్లా వైద్య శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో మందుల కొరత లేకుండా లేకుండా అవసరమైన మందులను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా చొంగ్తు, ఎస్‌పిడిసిఎల్ ఎండి ముష్రఫ్ అలీ, ఎన్‌పిడిసిఎల్ ఎండి వరుణ్ రెడ్డి, టిజి ఎమ్మెస్ ఐడిసి ఎండి ఫణిందర్ రెడ్డి, కాళోజి నారాయణరావు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నందకుమార్ రెడ్డి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, టివివిపి కమిషనర్ డా. అజయ్ కుమార్ లు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి మృతికి సిఎం సంతాపం



**ప్రజాపక్షం/- హైదరాబాద్ :** మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి మృతిపట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎన్‌ఎస్‌యుఐ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం పని చేసిన మాగం రంగారెడ్డి ఆకస్మిక మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ లు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి వారు ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేసారు.

## విద్యుత్ ఆదా చేసి .. పర్యావరణాన్ని కాపాడండి

### సిఎండి ముషారఫ్ షరూఖీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా విద్యుత్‌ను ఆదా చేయాలని టిజి ఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. మనం ఉపయోగించే విద్యుత్‌లో ఎక్కువ భాగం బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల ద్వారా ఉత్పత్తి అవుతుంది, విద్యుత్ ఆదా చేయడం ద్వారా కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తుందన్నారు. విద్యుత్ ను ఆదా చేయడం పర్యావరణంపై ఒత్తిడిని తగ్గించడానికి ఇది మంచి అవకాశమన్నారు. సిఎఫ్‌ఎల్ బల్బులను ఎల్ఇడి బల్బులతో మార్చుకుని విద్యుత్‌ను వాడడం ద్వారా 7580 శాతం తక్కువ విద్యుత్ ఆదా అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఉపయోగంలో లేని పరికరాలను అన్ ప్లగ్ చేయాలని సూచించారు. మొబైల్ ఛార్జర్లు, టీవీలు, మైక్రోవేవ్ల వంటి పరికరాలు ప్లగ్లో ఉన్నప్పుడు ఫాంటమ్ పవర్‌ను వినియోగిస్తాయన్నారు. పవర్ స్ట్రిప్లను ఉపయోగించండి, పరికరాలను అన్‌ప్లగ్ చేయాలని సూచించారు. సీలింగ్ ఫ్యాన్లు, ఎసిలను మెరుగ్గా ఉపయోగించాలన్నారు. సీలింగ్ ఫ్యాన్లను సరైన వేగంతో సెట్ చేయాలని తెలిపారు. ఎయిర్ కండిషనర్ల కోసం, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఇఇ) సిఫారసు చేసిన 2426 ఒసి ఉష్ణోగ్రతలను సెట్ చేయాలని, ఫిల్టర్లను ప్రతి నెల శుభ్రం చేయాలన్నారు. అవసరమైతే సౌర శక్తిని ఉపయోగించాలన్నారు. గ్రిడ్ విద్యుత్ పై ఆధారపడటాన్ని తగ్గించడానికి సోలార్ వాటర్ హీటర్లు లేదా రూఫ్టాప్ సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సహజ కాంతి, వెంటిలేషన్ను గరిష్టంగా ఉపయోగించాలన్నారు. పగటిపూట కిటికీలు, కర్టెన్లను తెరవడం ద్వారా లైటింగ్ అవసరాలను తగ్గించాలని కోరారు. ఫ్యాన్ లేదా ఎసి ఉపయోగాన్ని తగ్గించడానికి క్రాస్‌వెంటిలేషన్తో ఇళ్లను రూపొందించుకోవాలన్నారు.

## అలరించిన అభ్యుదయ రచయితల కవిసమ్మేళనం

### ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అభ్యుదయ రచయితలు, కవుల సామాజిక స్పృహతో కూడిన ఉద్యమ రచనలు, కవితల చైతన్య స్ఫూర్తి హింసారహిత మార్గంలో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించేందుకు దోహదపడిందని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నిర్వహించిన కవిసమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపన్యసించారు. డాక్టర్ పల్లేరు వీరస్వామి అధ్యక్షతన నిర్వహించిన కవిసమ్మేళనం అందరినీ అలరించింది. కవిసమ్మేళనానికి విశిష్ఠ అతిథులుగా డాక్టర్ రాపోలు సుదర్శన్, 'ఇప్సో' జాతీయనాయకులు, న్యాయవాది కెవియల్ పాల్గొన్నారు. డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి ప్రసంగిస్తూ వెట్టి చాకిరీ, వివక్షకు గురై తెలంగాణ ప్రాంత ప్రజలు అనునిత్యం దోపిడీకి, రాపిడీకి, సంఘర్షణకు లోనవుతున్న తరుణంలో ఆరంభమైన తెలంగాణ మలిదశ ఉద్యమంలో అభ్యుదయ రచయితలు, కవులు అందించిన రచనలు ఉద్యమాన్ని ఉవ్వెత్తున ప్రజ్వరిల్లచేసిందన్నారు. వారి రచనలు ఉద్యమంలో శాంతిసుమాల పరిమళాలను నింపాయన్నారు. శ్రీకాంతాచారి రాష్ట్ర సాధన కోసం బలిదానం చేశారని, ఉద్యమసమయంలో తెలంగాణ గురించి ఎవరు ఎంత వ్యతిరేకంగా మాట్లాడినా ఉద్యమకారులు వారిపై దాడులు చేయలేదన్నారు. కవి సమ్మేళనం కార్యక్రమంలో కందుకూరి శ్రీరాములు, సుంకర రమేష్, బొమ్మగాని నాగభూషణం, రేడియం, బెల్లంకొండ సంపత్‌కుమార్, కొరుప్రోలు హరనాథ్, ఎ.పరమాత్మ, తంగిరాల చక్రవర్తి, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, జి.చంద్రమోహన్‌గౌడ్, సోమశిల తిరుపాల్, పెబ్బేటి మల్లికార్జున్, వేముల నారాయణ, బిట్టవరపు శ్రీమన్నారాయణ, సుతారపు వెంకటనారాయణ, నాగేశ్వర్‌రావు, పి.గంగాధర్, దైవాధీనం తదితరులు అద్భుతమైన కవితలు వినిపించి అందరి ప్రశంసలందుకున్నారు.

## అచ్చంపేటను పరిశుభ్రపర్చేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక



ప్రజాపక్షం/అచ్చంపేట : అచ్చంపేట పట్టణం పూర్తి పరిశుభ్రంగా ఉండాలని అచ్చంపేట 100రోజుల కార్యాచరణ ప్రణాళిక నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త పొడిచెత్త వేరుగా సేకరించడం, తడిచెత్తనుండి ఎరువులను తయారుచేయడం, ప్లాస్టిక్ వస్తువులను వాడకుండా చేయడం ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బట్ట సంచుల వాడకం వాటియొక్క ఉన్నత స్థితిని మెరుగుపర్చే విధంగా ఒక పథకం తయారుచేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా ఏర్పాటు చేయాలని తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తడిచెత్త, పొడిచెత్త ఎలా ఉండాలో చెత్తబుట్టల్లో చెత్త ఉంచి చూపించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ యాదయ్య, కోఆప్షన్‌మెంబర్, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

## సైన్స్‌పై ఆసక్తి పెంచే రచనలు చేయడం అభినందనీయం



ప్రజాపక్షం/బిజినేపల్లి : విద్యార్థులు సైన్స్ విద్యపై ఆసక్తిపెంచే రచనలు చేయడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖఅధికారి రమేష్‌కుమార్, సైన్స్‌రచయిత, విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ కౌటిళ్యను కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం డిఈఓ కార్యాలయంలో రచయిత కౌటిళ్య దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మరిన్ని సైన్స్ రచనలు చేసి విద్యార్థులు సైన్స్‌విద్యపట్ల మక్కువ పెంచుకొని భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు బాటలుపర్చాలని సూచించారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ ప్రతాప్ కౌటిళ్యను కాకతీయ యూనివర్సిటి ప్రొఫెసర్ డాక్టర్ అచయ్య అభినందనలు తెలిపారు.

## రైతు వద్ద రూ.లక్ష చోరీ



ప్రజాపక్షం/మక్తల్ : నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలంలో మందిపల్లి గ్రామానికి చెందిన కురువ నాగప్ప అనే ఓ రైతు వడ్లు అమ్మిన డబ్బులు యూనియన్ బ్యాంకులో డ్రా చేసుకుని వస్తుండగా నారాయణపేట చౌరస్తా ఎస్‌బిఐ హెచ్‌డిఎఫ్ బ్యాంకు ఎదురుగా ఉన్న ఎస్ఆర్ఎస్ హోటల్ దగ్గర భోజనం చేయడానికి వెళ్లిన రైతు చేతులు కడుక్కునే లోపే లక్ష రూపాయలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

## పైపులైన్ నిర్మాణంతో తాగునీటి సరఫరా




ప్రజాపక్షం/వీపనగండ్ల : మండల పరిధిలోని కల్వరాల 1వ వార్డులో మినీ ట్యాంకు పైపులైన్ నిర్మాణం లేకపోవడంతో కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతుండే వారని, పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి తాగునీటిని సరఫరా చేసినట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ తెలిపారు. మినీ ట్యాంక్‌కు గత రెండు సంవత్సరాల నుండి తాగునీరు లేక సరఫరా లేక వృథాగా ఉండటంతో సమస్యను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని కల్వరాల నర్సింహ తెలిపారు. స్పందించిన మంత్రి పైప్‌లైన్ నిర్మాణానికి సహకరించటంతో పైపుల నిర్మాణాన్ని పూర్తి చేసి మిషన్ భగీరథ ఏఈ విశ్వనాథ్‌తో కలిసి మినీ ట్యాంక్‌ను పునః ప్రారంభించి తాగునీటిని విడుదల చేయడం జరిగిందని, జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరి నర్సింహ తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించిన కల్వరాల నర్సింహకు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత ఓపి సేవలు అందించండి




ప్రజాపక్షం/కొత్తకోట : జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులకు, జర్నలిస్టు కుటంబాలకు ఉచిత ఓపి సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం వనపర్తి ప్రెస్ కమిటీసభ్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా.పిజే బాబును కొత్తకోటలోని తన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలను అందించి సహకరించాలని కోరారు. సమాజ హితం కోసం పని చేస్తున్న జర్నలిస్టులకు ఐఎంఏ తరపున సహకారం అందించి సహకరించాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో జర్నలిస్టులకు, జర్నలిస్టు కుటుంబాలకు ఉచిత ఓపి సేవలు అందించడంతో పాటు వైద్య పరీక్షలలో 50 శాతం మందుల కొనుగోలుపై 25 శాతం రాయితీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.పిజే బాబు త్వరలోనే జిల్లాలోని వైద్యులతో ఒక ప్రత్యేక సమావేశం ఏర్‌పాటు చేసుకొని ఉచిత ఓపి సేవలతో పాటు రాయితీల వంటి జర్నలిస్టుల సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ప్రెస్ కమిటీ సభ్యులు బోలేమోని రమేష్ , కొండన్న యాదవ్, లక్ష్మ ణ్, ఖలీల్, యాదిరెడ్డి, గంధం దినేష్, కుమార్, తిరుపతి, శ్రీనాథ్, మల్లికార్జున్, పురుషోత్తం, తరుణ్, గోపాలకృష్ణ,రవికుమార్,రాజు, రాజ్‌కుమార్, రాజేష్, గోపాల్ పాల్గొన్నారు.

## రేషన్ షాపు ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు మండల కేంద్రంలోని రేషన్ షాపును అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మొదటగా రేషన్ షాపు సమయానికి తెరుస్తున్నారా లేదా అని పరిశీలించారు. అనంతరం మూడు నెలలకు సరిపడా బియ్యాన్ని ఒకే సారి పంపిణీ చేస్తున్నారా లేదా అని డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులతో నేరుగా మాట్లాడి పంపిణీ అవుతున్న సన్న బియ్యం నాణ్యత ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా, లబ్దిదారులకు ఇచ్చిన బియ్యం సరైన తూకంతో ఉన్నాయో లేదో అని తనిఖీ చేయడానికి కొంత మంది అందుకున్న బియ్యం ప్యాకెట్లను స్వయంగా తూకం వేసి సరి చూశారు. సన్న బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులకు విక్రయించరాదని డీలర్లను స్పష్టం చేశారు. రేషన్ షాపు డీలర్లు అన్ని రికార్డులను తప్పనిసరిగా సక్రమంగా నిర్వహించాలని నిబంధనలను పక్కాగా పాటించాలని, లబ్దిదారులకు పూర్తి స్థాయిలో, సకాలంలో సేవలు అందించాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీ ప్రజలకు మెరుగైన సేవలందించడంలో జరుగుతుందని ఆయన తెలిపారు.

## కఠిన శిక్షలతోనే నేరాలకు అడ్డుకట్ట



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : నేరస్తులకు కఠిన శిక్షలు వేయటంతోనే మహిళ నేరాల సంఖ్య తగ్గుతుందని ఎన్ఎఫ్ఐడబ్ల్యూ భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, గీత అన్నారు. బుధవారం వనపర్తి సిపిఐ ఆఫీసు వద్ద భారత జాతీయ మహిళా సమాఖ్య 71వ ఆవిర్భావ దినాన్ని నిర్వహించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పతాకాన్ని జిల్లా గౌరవాధ్యక్షురాలు కళావతమ్మ ఆవిష్కరించారు. మాట్లాడుతూ మహిళల హత్యలు వారిపై అత్యాచారాలు, వరకట్న వేధింపులు, పని ప్రదేశాల్లో మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారు. కేసులు పెడుతున్న కోర్టులో రుజువు కాక నేరస్తులు తప్పించుకుంటున్నారని, లేదా తక్కువ శిక్షలతో బయటపడుతున్నారని, నేరస్తులకు భయం ఉండటం లేదన్నారు. శిక్షలు పడేలా పోలీసులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళలు ఐక్యమై పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రధాన కార్యదర్శి గీత, పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్లు శిరీష, శ్రీదేవి, జయశ్రీ, జ్యోతి, కావేరి, భాగ్యమ్మ, బబ్బి పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ముందుగానే ప్రచారం



కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజాపక్షం/వనపర్తి : వనపర్తి మండలం అంకూర్, బలిజపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను జిల్లా కలెక్టర్ సందర్శించారు. రెవెన్యూ సదస్సులో పెట్టిన భూ రికార్డులు, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామ ప్రజలకు దరఖాస్తు ఫారాలు ఒకరోజు ముందుగానే పంచార లేదా, గ్రామంలో రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని టామ్ టామ్ చేశారా అని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులపై ప్రజలకు ముందుగానే ప్రచారం చేయాలని ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అక్కడే పరిష్కరించదగిన వాటిని రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. నోటీస్‌లు జారీ చేసి గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**చౌక ధరల దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలి..**

జిల్లాలోని అన్ని చౌక ధర దుకాణాల్లో బియ్యం రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బుధవారం వనపర్తి మండలంలోని అంకూర్, పెద్దమందడి మండలంలోని జంగమయ్యపల్లి గ్రామ పంచాయతీల్లోని చౌక ధర దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌక ధర దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి చోట జరగకుండా ఆన్‌లైన్ రికార్డుతో పాటు స్టాక్ రిజిస్టర్, ఇతర రికార్డులు తప్పనిసరిగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను ఆదేశించారు. బియ్యం ఇచ్చిన రసీదులను లబ్దిదారులకు ఇవ్వాలని సూచించారు. సన్న బియ్యం లబ్దిదారులతో కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సన్నబియ్యం బాగుందా ? ఇదే బియ్యం తింటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. చౌక ధర దుకాణాల్లో ఇస్తున్న సన్న బియ్యం బాగుందని దీనినే తింటున్నామని లబ్దిదారులు కలెక్టర్‌కు వివరించారు. ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి, పంచాయతీరాజ్ సెక్రటరీ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగపర్చుకోవాలి



ప్రజాపక్షం/వంగూర్ : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా గ్రామాలలో వ్యవసాయ భూముల్లో ఎలాంటి సమస్యలున్న ఈనెల 16వతేది వరకు మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ మురళి మోహన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉప్పల్‌పాడు, నిజాంబాద్ గ్రామాలలో బాధితుల నుండి భూ సమస్యల ఆర్జీలను స్వీకరించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. బాధితులు ఉదయం 9గంటలనుండి సాయంత్రం 5గంటలవరకు ప్రతి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న సదస్సులను సద్వినియోగపర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపతహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఆర్ఐలు సుధారాణి, వసీం అక్రమ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# భూసమస్యల పరిష్కారానికి గొప్పవేదిక భూభారతి

కలెక్టర్ బదావత్‌సంతోష్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : భూభారతి రెవెన్యూ సదస్సులో సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆదేశించారు. బుధవారం కోడేరు మండల పరిధిలోని తీగలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సందర్శించారు. రెవెన్యూ సదస్సులో పెట్టిన భూరికార్డులు, ప్రజలనుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. గ్రామప్రజలకు దరఖాస్తు ఫారాలు ఒకరోజు ముందుగానే పంచారా లేదా, గ్రామాలలో రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని టామ్‌టామ్ చేశారా అని పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులపై ప్రజలకు ముం దుగానే సమాచారం అందజేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అక్కడే పరిష్కరించదగిన వాటిని రెవెన్యూ సదస్సులోనే పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025 రెవెన్యూ గ్రామసభలు ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 20వరకు జిల్లావ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహిం చి భూ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించడం కోసం ఈ సదస్సులను ప్రభుత్వ ఆదేశాలప్రకారం ఏర్పాటు చేయనైనదని అన్నారు. కలెక్టర్ వెంట కోడేరు తహసీల్దార్ విజయ్, ఇతర రెవెన్యూ అధికారులు ఉన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**



కొల్లాపూర్ నియోజకవర్గపరిధిలోని కోడేరు మండల పరిధిలోని పస్పుల గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంత ధాన్యం కేంద్రానికి వచ్చిందని ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయని, వర్షానికి వడ్లు తడిచిపోకుండా కప్పి ఉంచాలన్నారు. లారీలకొరత లేకుండా చూసుకోవాలని, తేమశాతం 17వరకు ఉన్న వెంటనే తూకం వేసి లారీల్లో ఎక్కించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం రైతులనుండి ధాన్యం పక్కాగా సేకరించడం జరుగుతుందని, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతులఖాతాలో డబ్బులుపడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చివరిదశలో ఉందని వారంరోజుల్లో ఈప్రక్రియ పూర్తి కావొస్తుందని రైతులు ఎవరూ అధైర్యపడవద్దన్నారు. కలెక్టర్‌తో సంబంధితశాఖల అధికారులు ఉన్నారు.

# సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు

కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : భూ భారతి ద్వారా అన్ని మండలాల, గ్రామాల్లో ఈ నెల 20 వరకు భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. బుధవారం కోయిల్‌కొండ మండలం చంద్రాస్‌పల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని భూ సమస్యలపై దరఖాస్తులను పరిశీలించారు. రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో పాల్గొనేలా అవగాహన కలిగించాలని అన్నారు. గ్రామ రెవెన్యూ సదస్సుల్లో షెడ్యూల్ గురించి విస్తృతంగా గ్రామాల్లో తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు ప్రజలు భూ సమస్యలను పరిష్కారం చేసేందుకు గ్రామాల్లో నిర్వహించే భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని దరఖాస్తులు అందచేయాలని సూచించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తు పూరించాలి సూచనలు, సలహాలు అంచేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం చంద్రాస్ పల్లి గ్రామంలో పల్లె దవాఖానను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పల్లె దవాఖానలో పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నవి అని డాక్టర్, సిబ్బందిని అడిగారు. ఐదు గ్రామాలు ఉన్నాయని తెలిపారు. గర్భిణీలు ఎంత మంది నమోదు అయ్యారు. ఎంతమంది డెలివరీకి ఉన్నారు. అని కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగారు. 33 మంది డెలివరీ ఉన్నారు. హైరిస్క్ కేసులు ఎన్ని ఉన్నాయి. అని అడగగా 8 హై రిస్క్ కేసులు ఉన్నాయని కలెక్టర్‌కు తెలిపారు. అన్ని డెలివరీలు పక్కా గా డేటా సిద్ధంగా ఉంచాలని అన్నారు. మే నెలలో ఎన్ని డెలవరీలో అయ్యాయి మే నెలలో 7 డెలివరీలు జరిగాయని తెలిపారు. మాతా శిశు సంరక్షణ గర్భిణీ స్త్రీల చెకప్, హైరిస్క్ కేసుల చికిత్స తదితర అంశాలపై వారికి అవగాహన కలిగించాలి అన్నా రు. అదే విధంగా రక్తహీనత ఉన్న మహిళలకు కూడా ప్రత్యేక శ్రద్ధ కనపరచి చికిత్స అందించాలని అన్నారు. చిన్న పిల్లలకు టీకా లు వేసే కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలి డయబెటిస్ పేషెంట్స్ ఎంతమంది ఉన్నారని అడిగింది. డయాబెటి పేషెంట్స్ 78 మంది ఉన్నారు. ఏమైనా ఇబ్బంది ఉందా మందుల కొరత ఏమైనా ఉందా అని తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు తహశీల్దార్, రెవెన్యూ, వైద్య సిబ్బంది ఉన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రాణాలు పోతే సహించేది లేదు

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ



ప్రజాపక్షం/జడ్చర్ల : విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు పోయే పరిస్థితులు ఏర్పడితే సహించేది లేదని, అందుకు కారకులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. జడ్చర్ల పట్టణంలోని మూడవ వార్డులో బుధవారం విద్యుత్ షాక్‌తో శ్రేయాన్స్ అనే పదేళ్ల బాలుడు మృతి చెందడం పట్ల ఆయన తీవ్ర ఆవేదనను వ్యక్తం చేసారు. జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని వాటి కారణంగా ప్రజల ప్రాణాలకు ఆపద వాటిల్లకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారుల దేనని స్పష్టం చేసారు. ప్రత్యేకించి వానా కాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అన్ని ప్రాంతాల్లోనూ రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను గురించి సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని బుధవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి కోరారు. శ్రేయాన్స్ తండ్రి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొక్కా రాఘవేందర్‌ను ఎమ్మెల్యే ఫోన్‌లో పరామర్శించారు. ఆ కుటుంబానికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాతృమూర్తి, శశికళారెడ్డి, శ్రేయాన్స్ భౌతికకాయానికి పూల మాలల వేసి నివాళ్లుర్పించారు. బొక్కా రాఘవేందర్ కుటుంబ సభ్యులు ఓదార్చారు.

# పాత అలవాట్లు పక్కనబెట్టి పని చేయండి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : వనపర్తి మున్సిపాల్టీలో పని చేసే అధికారులు, సిబ్బంది అందరూ వారి వారి పాత అలవాట్లను పక్కకు పెట్టి పట్టణాభివృద్ధి కోసం పని చేయాలని మీకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అండగా ఉంటానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి మున్సిపాల్టీలో నిర్వహించిన 100 రోజుల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వార్డు అధికారులుగా, మెప్మా ఆర్పీలుగా, జవాన్లుగా మీరు నిరంతరం వనపర్తి పట్టణ ప్రజలకు అందించే సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వారిని అభినందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి వనపర్తి జిల్లా కేంద్రంపై ఉందని త్వరితగతిన అభివృద్ధి చెందే వనపర్తి పట్టణాభివృద్ధిలో మీరందరూ భాగస్వాములు కావాలన్నారు. గతంలో మీరు ఎలా పని చేశారన్నది పక్కకు పెడితే నేటి నుంచి నిబద్ధతతో పని చేయాలని, విధి నిర్వహణలో మీ దృష్టికి వచ్చే పొరపాట్లను నివృత్తి చేస్తూ సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఓటర్ లిస్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించి నిజమైన పట్టణ ఓటర్లను గుర్తించి, డబల్ ఎంట్రీలు ఉన్న వాటిని తొలగించాలని ఆయన సూచించారు. పని విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , మధుసూదన్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు

ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి కండికంటి పద్మావతి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : పాలకవర్గాలు, రాజకీయ పార్టీలు మాటల్లో మహిళలను మభ్యపెట్టకుండా చిత్తశుద్ధితో చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి కొండికంటి పద్మావతి డిమాండ్ చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు 71వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం వెంకటరామిరెడ్డి భవన్ ఎదుట మహిళ హక్కుల పోరాట జెండాను ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు భార్గవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ మహిళల హక్కుల సాధనకై భారత జాతీయ మహిళా సమాఖ్య 1954 జూన్ 4వ తేదీన కలకత్తా నగరంలో స్థాపించబడిందని అన్నారు. ఆ చికటీ రోజుల్లో మహిళలను మనుషులుగా కూడా చూడకుండా ఎన్నో అణచివేతలు అవమానాలను గురయ్యారని అన్నారు. మహిళల హక్కులకై సాధికారతకై అరుణ ఆసఫ్ అలీ, రేణు చక్రవర్తి, అజారా బేగం విమలాఫరూఖి, గీతా, ముఖర్జీ లాంటి ఎందరో వీర వనితలు తమ సారథ్యంలో భారత జాతీ య మహిళా సమాఖ్య నిర్మాణం చేశారని తెలిపారు. అంతేకాకుండా బాల్యవివాహాల రద్దు, వరకట్న నిషేధం, సతీసహగమనం వంటి సాంఘిక దురాచారాలు, రూపుమాపి, విద్యాహక్కు చట్టం, సమానపనికి సమానవేతన చట్టం, గృహ హింస నిరోధక చట్టం, తీసుకురావడంలో వారి కృషి ఎనలేనిదని సగర్వంగా చెప్పవచ్చు. నేటి పాలకులు ఓవైపు మహిళలపై జరుగుతున్న దాడులను పట్టించుకోకుండా అదే మహిళలు ధరిస్తున్న ఆభరణాలు బొట్టు, గాజులు ఆయుధాలుగా మలుచుకుని మోడీ ప్రభుత్వం ఆపరేషన్ సిందూరంటునే మరోవైపు ఆపరేషన్ కగార్ హక్కుల కోసం పోరాడుతున్న వారి ప్రాణాలను తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతూనే ఉందని అన్నారు. చట్టసభల్లో మహిళలకు సమాన వాటా ఇవ్వడంలో జాప్యం ఏమిటని ప్రశ్నించారు. డీలిమిటేషన్ పేరుతో మహిళా బిల్లును తొక్కేయడం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు. ప్రముఖ రచయిత గాయని శ్యామల మాట్లాడుతూ పురుషాధిక్య సమాజంలో మహిళలు అడుగడుగునా సామాజిక అణిచివేతకు గురవుతున్నారని వాపోయారు. మహిళల రక్షణకై ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలపై హింస దాడులు దౌర్జన్యాలు అఘాయిత్యాలు మాత్రం ఆగడం లేదని వాపోయారు. పాలక ప్రభుత్వాలు మద్యం పాలసీని పూర్తిగా రద్దు చేయాలని మహిళలపై హింసను ప్రేరేపించే సాహిత్యం, సీరియల్, యూట్యూబ్, ఛానల్ ఇతర సామాజిక మాధ్యమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు జి.భార్గవి, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.ఇందిరా, సింధుజ, మాధవి, అనన్య, తదితరులు ఉన్నారు.

## ప్రపంచ సైకిల్ దినోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న బాలబాలికలు




ప్రజాపక్షం/నారాయణపేట : తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జూన్ 1న, నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో బాల బాలికలకు జిల్లా స్థాయి సైకిల్ పోటీలను సొంత ఖర్చులతో నిర్వహించారు. ఈ పోటీలలో 150 మంది బాల బాలికలు పాల్గొని విజేతలుగా 12 సంవత్సరాలలోపు బాలికలు కావాలి సిరి ప్రార్థన (ప్రథమ), శ్రీ చందన (ద్వితీయ), సాయి కీర్తన (తృతీయ) 14 సంవత్సరాల లోపు, జె.పల్లవి (ప్రథమ), కీర్తి (ద్వితీయ) అంజలి (తృతీయ) 18 సంవత్సరాలలోపు కే.వరలక్ష్మి (ప్రథమ) 19 సంవత్సరాలు పైబడిన మహిళ టి. అనూష(ప్రథమ), బాలుర విభాగంలో 12 సంవత్సరాలలోపు తనూజ్ (ప్రథమ), హిమాన్సు (ద్వితీయ), ప్రశాంత్ రాకేశ్ (తృతీయ) 18 సంవత్సరాల లోపు ఆర్.మోహన్ ప్రథమ సుశాంత్ యాదవ్ (ద్వితీయ) వీరందరికి మెడల్స్ ప్రశంసాపత్రాలు జిల్లా కార్యదర్శి బి.గోపాలం అందజేశారు. అనిరుద్, అజయ్, సాత్విక్ రామ్, రమేష్, వెంకటేష్, ప్రశాంత్, రాకేశ్ ఈనెల 10,11 తేదీలలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరుగు సైక్లింగ్ అకాడమికి జరుగు రాష్ట్రస్థాయి ఎంపికలో పాల్గొంటారని బి.గోపాలం తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన మిగతా బాల బాలికలు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో, ఖేలో ఇండియా పోటీలలో పాల్గొంటారని బి.గోపాలం తెలిపారు. సైకిల్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి సైకిల్ క్రీడాకారులను, పిఈటిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు ఎస్,రమేష్ కుమార్, విష్ణువర్ధన్, అమ్రేష్, మీనాకుమారి, దామోదర్, జయమ్మ 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

## పెండ్లిపాకల రిజర్వాయర్‌కు నిధులు కేటాయించండి

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ నియోజకవర్గంలోని పెండ్లీపాకల రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు కేటాయించి సత్వరమే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని, దేవరకొండ నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ కోరారు. ఎంఎల్‌ఏ బాలునాయక్‌తో పాటు డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.



## దరఖాస్తులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/డిండి:** డిండి ప్రభుత్వ ఐటిఐ, ఏటిసిలో కోప, డ్రాట్స్‌మెన్, సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, స్టెనోగ్రఫీ(ఇంగ్లీష్), వెల్డర్ మరియు కొత్త అడ్వాన్స్ కోర్సులు మ్యాన్యుఫ్యాక్చరింగ్, ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమెషన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్(మెకానికల్), ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, అడ్వాన్స్ సిఎన్‌సి మెసినింగ్ టెక్నిషియన్ మరియు మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ ట్రేడ్ల యందు మొదటి విడత సీట్ల భర్తీ కొరకు పదవ తరగతి ఉత్తీర్ణులై, పద్నాలుగ సంవత్సరాల వయస్సుపై బడిన విద్యార్థులు అడ్మిషన్ కొరకు 02062025 నుండి 21062025 లోగా ఆన్‌లైన్ https://iti.telangana.gov.in లో రిజిస్ట్రేషన్/ దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వీరపల్లి రాధాకృష్ణ తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు ఎస్ఎస్‌సి మెమో, బోనోఫైడ్, కుల ధృవీకరణ పత్రం, ఈమెయిల్ ఐడి, ఫోన్ నెంబర్, ఫోటోతో ఇంటర్నెట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్లై చేసే ముందు ఎస్ఎస్‌సి మెమోలో పేరు మరియు పుట్టినతేది ప్రకారం ఆధార్ కార్డులో ఉండాలని ఆన్‌లైన్ అప్లికేషన్ చేయడానికి రూ. 100 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని తెలిపారు.



## ఫీజులో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి

### డిఇఒకు టియుడబ్ల్యుజె (ఐజెయు) వినతి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న వారి పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి, జర్నలిస్టు సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం డిఇఒ బిక్షపతికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన డిఇఒ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇప్పించేందుకు అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అమలయ్యేందుకు కృషి చేస్తానని డిఇఒ హామీ ఇచ్చారు. ఏదైనా పాఠశాల యజమాన్యం వినకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.వెంటనే ప్రాసీడింగ్ ఇవ్వాలని అధికారులను వెంటనే ఆదేశించారు. డిఇఒకు వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా నాయకులు పులిమామిడి మహేంద్ర రెడ్డి, టౌన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏరెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, జర్నలిస్టులు జిల్లా యాదయ్య,తెల్గమళ్ళ దశరథ, గంగాధర్ వెంకటేశ్వర్లు,సోమ చంద్రశేఖర్, అంజయ్య, అశోక్, రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

## 9న సిపిఐ మండల మహాసభ

### మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు



**ప్రజాపక్షం/చింతపల్లి :** ఈ నెల 9వ తేదీన మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లోని బిజె గార్డెన్‌లో నిర్వహించే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 15వ మహాసభను జయప్రదం చేయాలని మునుగోడు మాజీ ఎంఎల్‌ఏ ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సిపిఐ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. డిండి ఎత్తిపోతల పథకం ద్వారా మండలానికి సాగునీరందించాలని డిమాండ్ చేశారు. మాల్‌లో ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయాలని, తదితర ప్రజా సమస్యలను పరిష్కరించుటకు భవిష్యత్తులో సిపిఐ నిర్వహించే పోరాటాలకు ఈ మహాసభను వేదికగా చేసుకుని ముందుకు సాగడం జరుగుతుందన్నారు. పార్టీ శ్రేణులు సకాలంలో హాజరయి ఈ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య,

## ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

### ముందస్తు అడ్మీషన్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు : ఏఐఎస్ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/దేవరకొండ:** ఈనెల 12వ తేది నుండి పాఠశాలలు పునప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం దేవరకొండ ఎంఈవో కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్ మాట్లాడుతూ దేవరకొండ మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, దుస్తులు, సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు, సరిపడా ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బందితో పాటు అనేక సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. దేవరకొండ పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ఎలాంటి అనుమతులు లేనప్పటికి విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేస్తూ విద్యను వ్యాపారం చేస్తున్నారని, ఒక బ్రాంచ్ పర్మిషన్‌తో రెండు, మూడు బ్రాంచ్‌లు నడుపుతున్నారని, ఒలంపియాడ్, టెక్నో, సిబిఎస్ఈ తోక పేర్లు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వేలకు వేల ఫీజులు వసూలు చేస్తూన్నారని అన్నారు. పర్మిషన్ లేని పాఠశాలలను వెంటనే సీజ్ చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ సహాయ కార్యదర్శి ఎనిమల సాయి, నాయకులు కిరణ్, ప్రశాంత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సభ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ సిపి



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని తిర్మలాపురం గ్రామం వద్ద 6 తేదీన ఏర్పాటు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ భద్రతా ఏర్పాట్లను బుధవారం రాచకొండ సిపి సుధీర్ బాబు పరిశీలించారు. 6వ తేదీన ఆలేరు నియోజకవర్గ స్థాయిలో సుమారు 1500 వందల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి, శంకుస్థాపన చేయడానికి వస్తున్న సీఎం సభా ఏర్పాట్లు, శాంతి భద్రతల ఏర్పాట్లను పరిశీలించినట్లు, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలు, రూట్ బందోబస్తు, ఇతర భద్రత సౌకర్యాలను పర్యవేక్షించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు సభకు చేరుకుని, తిరిగి మళ్ళీ ఇంటికి వెళ్లే ప్రతి బస్సులో ఒక పోలీసు అధికారిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.పెద్ద ఎత్తున సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడడం జరుగుతుందని, ప్రజలు కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించాలని, రెవెన్యూ శాఖకు, పోలీసు శాఖలకు సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట గుట్ట సిఐ శంకర్ గౌడ్, తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్, రాష్ట్ర, జిల్లా స్థాయి పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పిల్లర్లతోనే ఇంటి నిర్మాణం

### ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వ నిబంధనలు సరికావు

### జిల్లా కలెక్టర్లు నిర్మాణ ఖర్చులు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

### మునుగోడు నియోజకవర్గంలో పదివేల ఇల్లు నిర్మించేందుకు కృషి

### పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన కామెంట్స్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం ప్రభుత్వం పెట్టిన నిబంధనలు సరికావని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ప్రస్తుతం 400 నుండి 600 స్క్వేర్ ఫీట్లలో మాత్రమే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనా మార్చుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఇందిరమ్మ ఇంటిని పిల్లర్లు ఏర్పాటు చేసుకొని నిర్మించాలని లబ్ధిదారులకు సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సంస్థ నారాయణపురం మండలాల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించే కార్యక్రమాన్ని దామెర గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కలెక్టర్ హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గానికి 3500 కాకుండా మరో 10 వేల ఇండ్లను మంజూరు చేస్తామని ఇప్పటికే తాను జిల్లా మంత్రితో మాట్లాడానని చెప్పారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో మొదటగా పెద్ద ఎత్తున ఇండ్ల మంజూరు సంతోషంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఇండ్లు ఇప్పించే బాధ్యత తనదని ఎవరు అధైర్య పడవద్దని చెప్పారు. గత ప్రభుత్వం పార్టీ కార్యకర్తలకే సంక్షేమ పథకాలు ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వంలో నిజమైన అర్హులైన వారికే పథకాలు అందిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని,అనర్హులకు ఇండ్లు వస్తే రద్దు చేస్తామని హెచ్చరించారు.సంక్షేమ పథకాలకు దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్ల నిర్మాణం కుదరదని ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు ఇండ్లకు సరిపోవని,సిమెంట్ కంపెనీలతో మాట్లాడి ధర తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు కట్టించి రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పంపిణి చేస్తున్నారని అన్నారు. అత్యంత నిరుపేదలకు మొదటగా ప్రాధాన్యం ఇస్తూ,పార్టీ కార్యకర్తలకు కాకుండా నిరుపేదలకు లబ్ది చేకూరెలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభపరిణామం అన్నారు. గతంలో జరిగిన తప్పులను పునరావృతం కాకుండా పేదలకు లబ్ది చేకూర్చేందుకు పని చేయడం సంతోషం అన్నారు. డబల్ బెడ్ రూమ్ పేర్లతో గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుతం నియోజకవర్గానికి 3500 కాకుండా మరి కొన్ని ఇండ్లు పెంచాలని కోరారు. ఇంటి స్థలాలు లేని వారికీ కూడా ఇండ్లు నిర్మించి ఆత్మ గౌరవంతో బతికేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సొంత ఇల్లు ఆత్మ గౌరవ ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, నారాయణపురం మండల స్పెషల్ ఆఫీసర్ జయశ్రీ, చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి పాల్గొన్నారు.

# భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/వలిగొండ :** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి గొప్ప వేదిక భూభారతి చట్టం అని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బుధవారం వలిగొండ మండలం నాగారం గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని భూ సమస్యలపై దరఖాస్తులను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల తహసిల్దార్ దశరథ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు .భూ భారతి చట్టం అమలులో భాగంగా ఈ నెల 3 నుండి 20 వరకు జిల్లాలోని అన్ని రెవిన్యూ గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతున్నదని, రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణ లో భాగంగా బుధవారం పెద్దవూర మండలం వెలమ గూడ లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. సుమారు 70 వరకు దరఖాస్తులు సమర్పించగా, వీటిలో సాదా బైనామాలు, పెండింగ్ మ్యుటేషన్లు, సక్సేషన్ల కరెక్షన్ ,భాగ పంపిణీ, శివాయ్ జమేదార్, పట్టా పాస్ బుక్ లో తప్పుల సవరణకు సంబంధించి ఎక్కువగా వచ్చాయి. ఈ సదస్సులో మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్,పెద్దవూర తహసిల్దార్ శ్రీనివాసరావు ,ఆర్ ఐ శ్రీనివాస్ రెడ్డి,హాబీబ్ అలీ, తదితరులు ఉన్నారు.



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** భూ సమస్యలు పరిష్కరించడానికే రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని మేళ్ళచెర్వు మండలం రేవూరు,హుజూర్‌నగర్ టౌన్‌హాల్‌లో జరిగిన రెవిన్యూ సదస్సులలో ఆయన పాల్గొన్నారు. గరిడేపల్లి మండలంలో 11 గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి దరాకస్తులను స్వీకరించడం జరిగిందని తెలిపారు. అలాగే రేవూరు,మేళ్ళచెర్వులలోని రేషన్ దుకాణాలు తనిఖీ చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా సన్నబియ్యం పంపిణీ చేయాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. అనంతరం మేళ్ళచెర్వులోని శ్రీనివాససాయిశివయ్య రైస్‌మిల్ ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు,తహశీల్దార్లు రాజేందర్ రెడ్డి,నాగార్జున రెడ్డి,ఆర్ఐలు సుశీల,మోషిన్ బాబా,జానకి రాంరెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఖానాపూర్ భూ భారతి సదస్సు

**ప్రజాపక్షం/డిండి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో భూ భారతి చట్టాన్ని అమలు చేసేందుకు నిర్వహిస్తున్న సదస్సులు ప్రజలకు పరిష్కారం చూపే విధంగా రైతులు తమ భూ సమస్యలను గ్రామ సదస్సుల్లో ఆర్జీలు అందించే రెవెన్యూ సదస్సులో సమస్యలను వివరించి పరిష్కరించే విధంగా ఏర్పాటు చేస్తున్న సదస్సులను మండలంలో రెండవ రోజు ఖానాపూర్ గ్రామంలో జరిగిన సదస్సుకు అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ హాజరయ్యారు. సదస్సులో ప్రజల ఆర్జీలు రెవెన్యూ యంత్రాంగం తీసుకుంటున్న జాగ్రత్తలు పరిష్కారం చూపే విధానాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణా రెడ్డి, తహాశీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కాలుష్యాలను నిర్మూలిద్దాం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. కాలుష్యం వల్ల కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం జూన్ 5 న నిర్వహించనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ బుధవారం తన ఛాంబర్ లో ఆవిష్కరించారు.వివిధ రకాల కాలుష్యాల వల్ల ప్రతి నిత్యం సమాజం అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నదని, అందువల్ల అన్ని రకాల కాలుష్యాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ప్లాస్టిక్ స్థానంలో పేపర్ ,గుడ్డ కు సంబంధించిన పరికరాలు వాడాలని, స్టీల్ బాటిళ్లు, టిఫిన్ బాక్సులు, క్లాత్ బ్యాగుల వంటివి ఉపయోగించాలని కోరారు. కాలుష్య నియంత్రణ మండలి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న ,నాగరాజు,సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**చికిత్స చేసేందుకు ముందుకు రావాలి :** దివ్యాంగులు, మానసిక వికలత్వంతో బాధపడే చిన్నారులు, రక్తహీనత ,ఇతర నరాల వ్యాధులతో బాధపడేవారికి చికిత్స ద్వారా సహాయం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈసీఐఎల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్‌తో కోరారు.బుధవారం ఈసీఐఎల్ కి చెందిన చీఫ్ మెడికల్ ఆఫీసర్ వేణుబాబు,హెచ్ఆర్ మేనేజర్ దుర్గా ప్రసాద్‌లు జిల్లా కలెక్టర్ ను జిల్లా కలెక్టర్ చాంబర్లో కలిసి సామాజిక బాధ్యత కింద దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ మోటార్ సైకిళ్ళు,కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు,మూడు చక్రాల సైకిళ్ల వంటివి తాము పంపిణీ చేస్తున్నామని, జిల్లాకు 100 బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిల్స్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ కు వివరించారు.దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో సుమారు 52 వేల మంది విభిన్న సామర్థ్యాలు (దివ్యాంగులు) కలిగిన వారు ఉన్నారని, ఇందులో గతంలో ఫ్లోరైడ్ వ్యాధికి గురైన వారితో పాటు,మానసిక వికలత్వం కలిగిన వారు,నరాల బలహీనత ఉన్న వారు,700 మంది చిన్నారులు మానసిక వికలత్వంతో బాధపడుతున్న వారు అలాగే కదలలేని పరిస్థితిలో మంచానికే పరిమితమైన వారున్నారని తెలిపారు.ఈ సమావేశంలో సిడిపిఓ హరిత, జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయం ప్రోగ్రాం అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## కామ్రేడ్ రావి నారాయణరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం

### నివాళులర్పించిన సిపిఐ నాయకులు

**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపి అమరజీవి కామ్రేడ్ రావినారాయణ రెడ్డి 118వ జయంతిని పురస్కరించుకొని బుధవారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ (సిపిఐ కార్యాలయంలో ) రావి నారాయణరెడ్డి చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి అగ్రభాగాన ఉండి పోరాటం నిర్వహించాడన్నారు. రావి జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలని, నేటియువత రావి నారాయణరెడ్డి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని నర్సింహారెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు, సినియర్ నాయకులు పాండురంగారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, పట్టణ సహాయ కార్యదర్శి జ్యోతిబస్, నాయకులు మల్లేష్, అంజయ్య, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శివకుమార్, సహాయ కార్యదర్శి సాయి, కేశవులు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.





**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తెలంగాణ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎంపి కామ్రెడ్ రావి నారాయణరెడ్డి ఆశయసాధన కోసం కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కామ్రెడ్ రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటి సభ్యులు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పెండ్రా కృష్ణ, రేగటి లింగయ్య, శ్రీనివాస్, హేమలత, కోటమ్మ, ఎండి పాషా పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి 118 జయంతిని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శి ఉప్పల ముత్యాలు, మారుపాక వెంకటేశం మాట్లాడుతూ 11 ఆంధ్ర మహాసభలో భువనగిరిలో నిర్వహించగా రావి నారాయణరెడ్డి నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, సిపిఐ సీనియర్ నాయకుడు సుల్తాన్ పురుషోత్తం, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు జక్క దయాకర్ రెడ్డి, బొబ్బల లాల్ రెడ్డి, గుర్రం రాజమణి, కసరబోయిన సత్తయ్య, మారుపాక అంజయ్య, కలువల నరసయ్య, అంబోజు రాములు మరిపెల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/వలిగొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో వలిగొండ మండల కేంద్రంలోని స్వతంత్ర సమరయోధులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరజీవి కామ్రేడ్ రావి నారాయణరెడ్డి 11వ జయంతి సందర్భంగా రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, పట్టణ కార్యదర్శి రవీందర్, మండల నాయకులు బొడిగె సుదర్శన్, మచ్చ లక్ష్మీ నారాయణ, కనకబోయిన ఆంజనేయులు, తాలూకా యాదగిరి, పారుపల్లి నరసింహ, సొప్పరి వెంకటేశం ఎడవెల్లి వేమన్న తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** స్వాతంత్ర సమరయోధులు మాజీ పార్లమెంట్ సభ్యులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారధి కామ్రేడ్ రావి నారాయణరెడ్డి 119వ జయంతిని పురస్కరించుకొని మంగళశారం యాదగిరిగుట్ట సిపిఐ పట్టణ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి మహేందర్, మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యులు పేరబోయిన పెంటయ్య, మండల కార్యవర్గసభ్యులు బంగారు నివాళులు అర్పించారు.


**ప్రజాపక్షం/భువనగిరి :** సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన విప్లవ సేనాని రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ నిజాం సంస్థానంలో రాచరిక వ్యవస్థ పై తిరుగుబాటు చేసి భారత యూనియన్‌లో కలిపేటందుకు నైజామును గద్దె దించాలని సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ముద్దసాని రాములు తదితరులు పాల్గొన్నారు.



# కళారంగం

ఫోకస్

## కాలానుగుణ మార్పులతో కరేబియన్ డాన్స్ కనువిందు



ఇటీవల కాలంలో అత్యంత ప్రాచుర్యం పొందిన నృత్యంగా కరేబియన్ డాన్స్‌ను పేర్కొవాలి. కాలానుగుణంగా మార్పులను సంతరించుకుంటూ ఈ ఆఫ్రికన్ నృత్యరీతులు ప్రేక్షకులకు కనువిందు చేస్తున్నాయి. ఉల్లాసభరితమైన పండుగలను జరుపుకోవడమేకాదు... రకరకాల సంస్కృతులు, వాటి మధ్య ఐక్యతను చాటిపెట్టే నృత్య కళారూపాలుగా కరేబియన్ డాన్స్‌ను ఉదహరిస్తారు. శరీర అభివ్యక్తికి సంబంధించిన సామూహిక ఉత్సాహాన్ని ప్రతిబింబించే ఒక ప్రాచీన నృత్యరూపం. ఇది ప్రధానంగా క్యూబా, జమైకా, హైటీ, ట్రినిడాడ్ అండ్ టొబాగో, డొమినికన్ రిపబ్లిక్ వంటి దేశాలలో అభివృద్ధి చెందింది. ఇది ఆఫ్రికన్, యూరోపియన్‌తోపాటు,స్థానిక అమెరికన్ సంస్కృతుల కలయికగా అభివృద్ధి చెందిన నృత్యరూపం. కరేబియన్ డాన్స్ రకాల్లో సల్సా ప్రధానమైనది. ఈ నృత్య మూలాలు క్యూబా, పోర్టోరికోకు సంబంధించినవి. అత్యంత వేగంగా కదలడం, దృఢమైన పదవిన్యాసం, భాగస్వామ్య ప్రదర్శన అనేవి సల్సాలో కీలకం. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన నృత్యాల్లో సల్సా ఒకటి. ఆఫ్రికన్ మూలాలున్న రుంబా డాన్స్‌ను ప్రేమ, ఆకర్షణను ప్రతిబింబించే నృత్య విధానంగా పేర్కోవచ్చు. ఇందులో డ్రమ్స్ పాత్ర ఎక్కువ. డ్రమ్స్‌తో పోటీపడుతూ, లయబద్ధంగా కొనసాగే నృత్యం ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. కాగా, శాంతి, ప్రేమ, సామాజిక న్యాయం వంటి అంశాలపై కేంద్రీకృతమైన నృత్యం రెగ్గే. జమైకా నుంచి ఇది ఇతర ప్రాంతాలకు విస్తరించింది. బాబ్ మార్లే వంటి గాయకుల ప్రభావంతో విశ్వవ్యాప్తమైంది. జమైకా నుంచే వెలసిన ఆధునిక శైలి డాన్స్‌హాల్. దీనికి యువతలో విపరీతమైన క్రేజ్ ఉంది. శరీరానికి సవాలుగా నిలిచే ముద్రలు, శక్తివంతమైన కదలికలు ఈ డాన్స్ ప్రత్యేకతలు. డొమినిక్ రిపబ్లిక్ మూలాలున్న బచాటా డాన్స్ అనేది ప్రేమ కథల ఆధారంగా ఉండే రొమాంటిక్ నృత్యం. ఇందులో నృత్యకారుల కదలికలు చాలా నెమ్మదిగా ఉంటాయి. రొమాంటిక్ కదలికలు దీని స్పెషాలిటీ. కలిప్సో, సొకా అనేవి ట్రినిడాడ్ అండ్ టొబాగో కేంద్రంగా విస్తరించాయి. సంగీతపరమైన ఉత్సవాలు, పండుగల్లో వీటి ప్రదర్శనలు ఎక్కువ. ఉల్లాసభరితమైన సంగీతానికి సామాజిక వ్యాఖ్యలు జోడుకావడం దీని ప్రత్యేకత.

కరేబియన్ నృత్య రీతులకు సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది. కార్నివాల్ వేడుకల్లో ఈ నృత్యాలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. స్వేచ్ఛను, నిరసనను, ఆనందాన్ని వ్యక్తపరిచే నృత్య రూపాలుగా వీటికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆఫ్రికన్ జానపద భక్తి నృత్యాలు అభివృద్ధి చెంది, నేడు ఆధునిక డాన్స్ క్లబ్‌లను అలరిస్తున్న కరేబియన్ డాన్స్ ఎన్నో రకాలుగా విశిష్టతను పదిలపరచుకుంటున్నాయి. నడుము, భుజాలు వంటి శరీర భాగాల వివిధ కోణాల్లో తిరగడం అనుకున్నంత సులభం కాదు. పాద కదలికలు శీఘ్రంగా, ఆధునిక సంగీతంతో పోటీపడుతూ ఉండాలి. అందుకే ఇవి ఆకర్షణీయంగానూ, ఆకట్టుకునేవిగానూ ఉంటాయి. కరేబియన్ డాన్స్ డాన్స్ అనేది శక్తివంతమైన శరీర ఆవిష్కరణ మాత్రమే కాదు, అనేక తరాలుగా సంక్రమిస్తూ వచ్చిన ఒక ఆత్మీయ సంస్కృతిక ఉద్యమం. ఇది సాంప్రదాయాన్ని, ఆధునికతను కలిపి ఒక ప్రాణవంతమైన రూపంలో ప్రపంచాన్ని అలరిస్తోంది.



## గోడరాతలకు కొత్త రూపం గ్రాఫిటీ ఆర్ట్







గోడరాతలు ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో కనిపిస్తుంటాయి. ఒకప్పుడు ఇవి రాజకీయ పార్టీల ప్రచారాలకు, ప్రజాసంఘాల నినాదాలకు మాత్రమే పరిమితమై ఉండేవి. క్రమంగా రూపు మార్చుకొని, ప్రకటనలకు కూడా గోడలు నెలవులయ్యాయి. ఇప్పుడు మరింతగా రూపాంతరం చెంది, గ్రాఫిటీ ఆర్ట్‌గా మారాయి. ఇప్పుడు గ్రాఫిటీ లేదా వాల్ ఆర్ట్ అనేది ఒక శక్తివంతమైన ప్రత్యామ్నాయ కళారూపం. ఇది ప్రజల భావోద్వేగాలను, నిరసనలను, సామాజిక సందేశాలను నేరుగా పబ్లిక్ స్పేస్‌లలో వ్యక్తీకరించే మాధ్యమం. గోడలపై ఉచితంగా వ్యక్తీకరించబడే ఈ కళ రూపం, శిల్పకళ, రచన, రాజకీయ స్పందన, సంఘటిత వాదనలు వంటి అంశాలను కలగలిపి ఒక బలమైన సందేశాన్ని ఇస్తుంది. గ్రాఫిటీకి మూలాలు రోమన్లు, ఈజిప్టు పిరమిడ్లు, గుహా చిత్రాల వరకు వెనక్కి వెళ్లవచ్చు. ఆధునిక గ్రాఫిటీ 1960, 70 దశకాల్లో, అమెరికాలో పుట్టింది. ముఖ్యంగా న్యూయార్క్ నగర రైలు గోడలపై ఎక్కువగా కనిపించేది. ఇది ప్రారంభంలో 'ట్యాగింగ్' (పేర్లను గోడలపై రాయడం)గా మొదలై, తర్వాత రాజకీయ, సామాజిక సందేశాలుగా మారింది. పబ్లిక్ ప్లేస్‌లలో గోడలపై సాధారణంగా అనధికారిక ప్రదేశాలలో కనిపిస్తుంది. దీని కోసం పెయింట్లు, స్ప్రేలు, స్టెన్సిళ్లు ఉపయోగిస్తారు. విప్లవాత్మక భావాలు రాజకీయం, కులవ్యవస్థ, లింగ వివక్ష, వర్గ పోరాటం మొదలైన వాటిపై స్పందన ఎక్కువగా గ్రాఫిటీ ఆర్ట్‌లో దర్శనమిస్తుంది. గుర్తించదగిన శైలి రంగుల వాడకం, పెద్ద అక్షరాలు, అందమైన రాత, ఆకట్టుకునే డిజైన్ గ్రాఫిటీ ఆర్ట్‌కు కీలకం. బ్రిన్స్కీని ప్రపంచ ప్రసిద్ధ గ్రాఫిటీ కళాకారుడిగా పేర్కొంటారు. అయితే, అది మారుపేరు మాత్రమే. అతని నిజమైన పేరు వెలుగులోకి రాలేదు. అతని కళలు సామాజిక వ్యంగ్యానికి నిలువెత్తు నిదర్శనాలు. యుద్ధం, వలసవాదం, శాసనాల విమర్శ ఇతని గ్రాఫిటీ ఆర్ట్‌లో ప్రధానాంశాలు. మన దేశంలో 'ఢిల్లీ స్ట్రీట్ ఆర్ట్' వంటి సంస్థలు ఈ కళను ప్రోత్సహిస్తున్నాయి. ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో చాలా చోట్ల గోడలపై సామాజిక, క్రీడా అంశాలను, స్ఫూర్తిదాయకమైన దృశ్యాలను చిత్రీకరించడాన్ని చూడవచ్చు. స్వచ్ఛ భారత్, విద్యాబోధ, మహిళల భద్రత వంటి అంశాలపై గోడ చిత్రాలు కనిపిస్తాయి. ఉమ్మడి కళా పథకాల్లో గ్రామస్తులు కూడా భాగస్వామ్యులవుతున్నారు. కుల వివక్ష, మూఢనమ్మకాలు, లింగ అన్యాయాలపై నిరసనాత్మక చిత్రాలు... వ్యక్తుల స్వేచ్ఛను ప్రతిబింబించే కళారూపాలు... ప్రజా ఉద్యమాలు... రైతుల నిరసనలు వంటి అనేకానేక అంశాలు గ్రాఫిటీ ఆర్ట్స్ రూపంలోనే బహుముఖంగా ప్రచారమయ్యాయి. ఈ కళపై విమర్శలు లేకపోలేదు. ప్రజలకు సంబంధించిన స్థలాల్లో చేసిన గ్రాఫిటీని అనధికార కళగా కొంత మంది పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో అశ్లీలత, అసందర్భ నినాదాలతో అర్థరహిత కళారూపంగా మారే ప్రమాదం ఉందని కొంత మంది అనుమానం. అయితే, స్థూలంగా చూస్తే మాత్రం, సామాజిక స్పృహను పాదుకొల్పే గ్రాఫిటీ ఆర్ట్ వల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయి.



## సమకాలీన కళలకు సిసలైన వేదిక 'వెనిస్'

ఇటలీలోని చారిత్రక వెనిస్ నగరం సమకాలీన కళలకు సిసలైన వేదికగా నిలుస్తోంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే వెనిస్ బియన్నాలే (Venice Biennale) సంప్రదాయ కళలతో పాటు ఆధునిక కళలకు సంబంధించి ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రదర్శనగా పేరు గడించింది. బై యాన్యువల్ (రెండేళ్లకో సారి) అనే పదానికి ఇటాలియన్ సంక్షిప్త పదమే 'బియన్నాలే'. వెనిస్‌లో రెండేళ్లకోసారి జరిగే కళాప్రదర్శన కాబట్టి దీనిని 'వెనిస్ బియన్నాలే' అంటున్నారు. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన కళా ప్రదర్శన కూడా ఇదే. దీనిని 1895లో. అంటే 130 సంవత్సరాల క్రితం మొదలు పెట్టారు. అంతటి సుదీర్ఘ చరిత్ర ఈ ఉత్సవానికి ఉంది. ప్రారంభంలో ఇది ఎక్కువగా ఇటాలియన్ కళాకారులను ప్రోత్సహించడానికి ఉద్దేశించినప్పటికీ, తర్వాత ఇది అంతర్జాతీయ కళా రంగంగా ఎదిగింది. గియార్డిని (గార్డెన్స్), అర్సనేల్ అనే రెండు ప్రదేశాల్లో జరిగే ఈ ప్రదర్శనలో ప్రపంచంలోని 80కి పైగా దేశాలు పెవిలియన్ (Pavilion)ల రూపంలో పాల్గొంటాయి. ఆ ప్రత్యేక ప్రదేశంలో ఆయా దేశాలు తమతమ కళలను ప్రదర్శిస్తాయి. భారతదేశం కూడా కొన్ని సంవత్సరాలుగా ఇందులో పాల్గొంటోంది. వెనిస్ బియన్నాలేలో కళ మాత్రమే కాదు, సినిమా, ఆర్కిటెక్చర్, డాన్స్, మ్యూజిక్, థియేటర్ కూడా భాగమే. దీనికి అనుబంధంగా నిర్వహించే వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్ 1932లో ప్రారంభమైంది. ప్రపంచంలోనే మొదటి ఫిల్మ్ ఫెస్టివల్ ఇదే. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'గోల్డెన్ లయన్' అవార్డును వ్యక్తిగతంగా కళాకారులకుగానీ, మొత్తం పెవిలియన్‌కు లేదా దేశానికిగానీ అందచేస్తారు. మరియా అబ్రమొవి, బ్రూస్ నౌమన్, ఎయ్ వెయ్‌వెయ్ వంటి ప్రఖ్యాత కళాకారులు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు. 2019లో మన దేశం తరపున ఎన్ఎస్ హర్ష, జితిష్ కల్లాట్, శిల్పా గుప్త, సుబోధ్ గుప్తా వంటి మేటి కళాకారులు వెనిస్ బియాన్నాలేలో భాగస్వాములయ్యారు. కాగా, 2024లో 'ఫారినర్స్ ఎవ్రివేర్' అనే థీమ్‌తో ఈ కళా వేడుకను నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా తత్వశాస్త్రం, రాజకీయాలు, పరాయితనం, గ్లోబలైజేషన్ వంటి అంశాలపై ఈ వేదిక దృష్టి పెట్టింది. ఇందులో చాలా మంది శరణార్థ కళాకారులు కూడా పాల్గొనడం విశేషం. వెనిస్ బియన్నాలే ఒక స్వేచ్ఛా వేదిక. పాలిటికల్ ఆర్ట్, ఫెమినిజం, వాతావరణ మార్పు, లింగవివక్ష, శారీరక వికలాంగత వంటి సమస్యలపై కళాకారులు తమ అభిప్రాయాన్ని ప్రకటిస్తారు.









## మోదీ హయాంలో నిరుద్యోగం, ఆకలి, ఆర్థిక అసమానతలు పెరిగాయ్

జూలై 5న మహబూబాబాద్ జిల్లా సిపిఐ మహాసభలు : విజయసారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** జూలై 5,6 తేదీల్లో రెండు రోజులు పాటు కురవి మండల కేంద్రంలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కరణం రాజన్న అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నాల్గవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగిందని గొప్పలు చెపుపతున్న మోదీ హయాంలో మునుపెన్నడూలేని విధంగా నిరుద్యోగం, ఆకలి, ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయన్నారు. తలసరి ఆదాయం పెరగడంతో పాటు పేదరికం పెరిగి కార్పొరేట్‌ల దగ్గర లక్షలకోట్ల రూపాలయలు పోగుపడ్డాయని విజయసారథి విమర్శించారు. జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్, అధ్యక్షులుగా బి.విజయసారథి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా నలు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా తమ్మెర విశ్వేశ్వరావు, ప్రధానకార్యదర్శిగా బి.అజయసారథిరెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శిగా కట్టబోయిన శ్రీనివాస్, కోశాధికారిగా కరణం రాజన్నతో ఆహ్వాన సంఘం ఏర్పాటుచేశారు. కురవిలో జరిగే మహాసభలు రాబోయే మూడు సంవత్సరాలకు ప్రజాసమస్యలపై పోరాటాలకు పార్టీ పటిష్టతకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలవడానికి కార్యాచరణ సిద్ధం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిలా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరావు, పెరుగు కుమార్, మామిండ్ల సాంబలక్ష్మి , చింతకుంట్ల వెంకన్న, రేషపల్లి నవీన్, వరిపల్లి వెంకన్న, పాండురంగాచారి, బిక్షపతి, సమ్మయ్య, తదితరలు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలి

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం పేదలకు శాపం : కర్రే భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ అంబేద్కర్ కాలనీలో ఉంటున్న పేదలకు గత ప్రభుత్వం డబల్ బెడ్‌రూమ్ నిర్మించి అర్హులైన పేదలకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం అర్హులైన పేదలకు డబల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ అంబేద్కర్ కాలనీలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం డబల్ బెడ్‌రూమ్ నిర్మించి వదిలేసిన ఇండ్లను సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో 592 డబల్ బెడ్‌రూమ్ నిర్మించి అంబేద్కర్ కాలనీలో ఉంటున్న అర్హులైన పేదలకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం తప్పకుండా ఇస్తామని చెప్పి వారిలో కేవలం 6 కుటుంబాలకు మాత్రమే ఇంటి పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోవడంతో పేదలు అధికారుల చుట్టూ తిరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల స్వయంగా వారే ఖాళీగా ఉన్న డబల్ బెడ్‌రూమ్‌లో నివాసముంటామని వంటావార్పు చేసుకుంటూ ఉంటున్నారని, స్థానిక ఎమ్మా ర్వో, ఆర్డీవో, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చొరవతో అర్హులైన పేదలను గుర్తించి సర్వే చేసి డబల్ బెడ్‌రూమ్‌లో పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. డబల్ బెడ్ రూం పంపిణీ చేయని యెడల దశలవారీగా అర్హులైన పేదలకు దక్కేంత వరకు సిపిఐ జిల్లా సమితి వారికి అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, నాయకులు మునగాల బిక్షపతి, వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక దోపిడీ అంతం కోసం సిపిఐ పోరాటం

● అసమానతలు లేని వ్యవస్థ వచ్చే వరకూ ఉద్యమం ఆగదు ● సమసమాజ స్థాపనే ధ్యేయంగా ముందుకు ● ఎమ్మెల్సీ, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ /నల్లగొండ టౌన్ (మాడ్గులపల్లి):** ఎర్రజెండా ద్వారానే అసమానతలు లేని సమసమాజ వ్యవస్థ సాధ్యమని ఎమ్మె ల్సీ, సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండల సిపిఐ 10వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక సమానత్వం కోసం ఒక మనిషిని ఇంకొక మనిషి దోపిడి చేయని సమసమాజ స్థాపన కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. పెట్టుబడిదారుల, దోపిడిదారుల సమాజంలో అసమానతలు విపరీతంగా పెరిగి ధనికులు మరింత ధనికులుగా పేదవాళ్లు మరింత పేదవాళ్లుగా మారారని, ఆర్థిక అంతరాలు పెరిగిపోయి పేదరికం సమాజంలో విలయ తాండవం చేస్తుందని, పెట్టుబడిదారి వ్యవస్థ లక్షణం అసమానతలను పెంచి పోషిస్తుందని, ఈ విధానాలకు ప్రత్యామ్నాయంగా ఈ సమాజంలో అసమానతలు, దోపిడి పోవాలంటే అది కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. అసమానతలు లేని సమసమాజ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం పోరాటం తప్పదని సోషలిజం సమసమాజం కోసం అవిశ్రాంత పోరాటం భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తుందన్నారు. పేదల తరుపున కష్టజీవుల తరుపున నిరంతరం ఉద్యమాలు నిర్వహించి అసమానతలు లేని సమాజం కోసం పేదల పక్షాన నిలబడి విప్లవ పోరాటాల చరిత్ర కమ్యూనిస్టుల సొంతమని, నిరంతం ప్రజా పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు ఉద్యమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో మరింత చైతన్యవంతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిసుతన్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని కోరారు. అదేవిధంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నిక ల్లో సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చే యాలని కోరారు. అంతకుముందు పార్టీ జెండాను పల్లా దేవేందర్‌రెడ్డి ఎగురవేశారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ మండల కార్యదర్శి ఎండి.సయీద్, దామరచర్ల మండల కార్యదర్శి డి.లింగానాయక్, వేములపల్లి మండల కార్యదర్శి జిల్లా యాదయ్య, నాయకులు బిల్లా కనక య్య, బంటు రాజేశ్వరి, రామలింగం, జి.యాదగిరి, పద్మ, శాంత, వల్లంపట్ల వెంకన్న, జి.మట్టయ్య, ముత్తు, జగన్, సైదమ్మ, రమేష్, రాములు, మర్తమ్మ, అనిత, ఇద్ద య్య, సీహెచ్.రాములు, లక్ష్మి , ధనమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

### అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి : నెల్లికంటి సత్యం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షే మ పథకాలు అర్హులైన పేదలందరికీ అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యదర్శి పుల్లెంల అబ్రహం అధ్యక్షతన నిర్వహించిన మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి మండల పరిధిలోని చెరువులను నింపే వరద కాలువ, డి 40 కాలువలకు లైనింగ్ పనులు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించాలన్నారు. వానాకాలం సీజన్‌లో నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించాలన్నారు. కమ్యూనిస్టులకు కంచుకోటగా పేరున్న తోపుచర్ల, ఫిర్కాలో సిపిఐ బలోపేతానికి మండల నాయకులు మరింతగా కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కేవలం పెట్టు బడి వర్గానికి వత్తాసుగా ఉంటూ శ్రామిక వర్గాల ను అనుగదొక్కే కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు.ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,వేములపల్లి మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, నల్లగొండ పట్టణ కార్యదర్శి కెఎస్ రెడ్డి, ఏఐపిఎస్ఓ నాయకులు జల్లోజు రఘునాథచారి,నాయకులు కంకణాల శ్రీనివాస్ రెడ్డి, పుల్లెంల లెనిన్, పుష్పలత,శిరీష, యాదమ్మ, లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై మొట్ట మొదటి సారి మండల మహాసభకు విచ్చేసిన ఎమ్మెల్సీ సత్యంను సిపిఐ నాయకులు శాలువా కప్పి సన్మానించారు.

# అంతరాలు లేని సమాజమే లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్ నిలిపి వేయాలి : మంద పవన్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** భూమికోసం, భుక్తి కోసం, శ్రామిక జన విముక్తి కోసం, సమ సమాజ స్థాపన ధ్యేయంగా అంతరాలు లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా సిపిఐ 100 ఏండ్లుగా పోరాటం చేస్తున్నట్లు సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గజ్వేల్ మండల 17వ మహాసభ నిర్వహించిన సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని ఇందిరా పార్కు నుండి అంబేద్కర్ విగ్రహం మీదుగా కోలా అభిరామ్ గార్డెన్ వరకు పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐ సీనియర్ నేత బట్టు దయానందరెడ్డి పార్టీ పతాక ఆవిష్కరణ చేసి మహాసభలను ప్రారంభించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ, దేశంలో పీడితుల పక్షాన పోరాడుతున్న కమ్యూనిస్టులు, మేధావులపై అక్రమ కేసులు పెడుతూ జైలులో నిర్బంధిస్తుండగా, సమాజంలోని అసమానతలు రూపుమాపడానికి పాలక ప్రభుత్వాలను ప్రశ్నిస్తే దేశ వ్యతిరేక ముద్ర వేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తులు నిరంతరం దళితులు, ఆదివాసీలు, ఈ దేశ ప్రజలపై దాడి చేస్తూ మతం, కులం పేరుతో కుట్రలు చేస్తూ మసీదులు, చర్చిలను కూల్చాలని నినాదాలిచ్చి కల్లోలం సృష్టిస్తున్నట్లు విమర్శించారు. మధ్య భారతంలో ఛత్తీస్‌గడ్ ఎఒబిలోని అపార ఖనిజ సంపదలను కార్పొరేట్, పెట్టుబడిదారి వర్గాలకు అప్పజెప్పడం కోసం ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పే రుతో అమాయక ఆదివాసీలు, గిరిజనులను నక్సలైట్ల పేర్లతో భయభ్రాంతులకు గురిచేస్తూ ఎన్‌కౌంటర్లు చేస్తున్నట్లు తెలిపారు. పోరుగు దేశమైన పాకిస్థాన్‌తో యుద్ధం చేసే సందర్భంలో అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కాళ్ళ కింద దేశ ఆత్మగౌరవాన్ని నరేంద్ర మోడీ తాకట్టు పెట్టినట్లు చెప్పారు. ఉగ్రవాదులతో, పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకున్న ప్రభుత్వం 50 ఏళ్ల నుండి ఈ దేశంలో అంతరాలు లేని సమాజం కోసం ఆదివాసుల పక్షాన పోరాడుతున్న మావోయిస్టులతో శాంతి చర్చలు చేయకుండా ఆ పార్టీ కేంద్ర కార్యదర్శిని ఎన్కౌంటర్ పేరుతో హత్య చేయడం సిగ్గుచేటని నిలదీశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి గజ్వేల్ ప్రాంతంలో ముంపు బాధితుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ సర్కార్ వైఫల్యాలు ప్రజలలోకి తీసుకెళ్లి పరిష్కారం కోసం సిపిఐ ఉద్యమాలు చేస్తుందని పేర్కొన్నారు. సిపిఐ సీనియర్ నేత, జిల్లా కార్యవ ర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి మాట్లాడుతూ సిపిఐ పార్టీ పోరాటాలతో అనేక ప్రజా సమస్యలు పరిష్కారం కాగా, పార్టీ నిర్మాణం కోసం గ్రామా ల్లో కార్యకర్తలు అహర్నిశలు పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల నిర్మాణం చేపట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టాపురం లక్ష్మణ్, ఎడల వనేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, శివలింగు కృష్ణ, జేరిపోతుల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టడంలో మహిళా సమాక్య ముఖ్యపాత్ర

భారత జాతీయ మహిళా సమాక్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** భారతదేశం నుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టి ప్రజలను విముక్తి పోరాటంలో భారత జాతీయ మహిళ సమాఖ్య ముందు ఉండి నడిపిచిందని, భారత మహిళ సమాఖ్య 1954 జూన్ 4న కలకత్తా నగరంలో స్థాపించబడి నేటికి 71 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంఘమని ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మబిక్షం భవన్‌లో భారత జాతీయ మహిళ సమాఖ్య 71వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అరుణ అసపాలి, రేణు చక్రవర్తి, అజారాబేగం, విమల ఫరుఖి, గీతాముఖర్జి లాంటి మహిళ ఉద్యమ నేతల సారధ్యంలో మహిళ సమాఖ్య నిర్మాణం చేయబడి మహిల విముక్తి కోసం నిరంతరం క్రియాశీల పోరాటాలను కొనసాగిస్తుందని తెలిపారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సనాతన భావాలకు నిరసనగా ఉద్యమించి అనేక విజయాలు సాధించడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు నిరసన తెలియజేసే హక్కు ఉంటుందని, శాంతియుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన మహిళ ఉద్యమకారులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు డిలిమిటేషన్‌తో సంబంధం లేకుండా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షురాలు అనంతుల మల్లేశ్వరి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోటమ్మ, దేవరం మల్లేశ్వరి, హేమలత, పొదిలి వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.





# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/అల్వాల్ :** వెంకటాపురం డివిజన్ లోని 14 లక్షల వ్యయంతో కూడిన సిసి రోడ్డు పనులకు మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డివిజన్లోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ప్రతి డివిజన్లో సిసి రోడ్లు డ్రైనేజీలు శానిటేషన్ విధి స్తంభాలు ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శివ శంకర్ రెడ్డి, గోపాల్, అనిల్ రెడ్డి, శ్రీనివాస్, డోలి రమేష్, సయ్యద్ మోసిన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



## భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

టిపిసిసి ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** భూ సమస్యలను పరిష్కరించుటకు భూ భారతి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకవచ్చిందని రైతుల సమస్యలను ఫిర్యాదుల రూపంలో తీసుకుని అధికారులు పరిష్కరిస్తారని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీలోని పోతారం, కేశ్వాపూర్, యాకత్‌పూర, శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటీలోని మందాయిపల్లి, అంతాయిపల్లి వార్డుల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. పోతారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్‌లు సందర్శించారు. రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించుటకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోతారంలో 8 అర్జీలు వచ్చాయని తహాశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బండి జగన్నాదం, బస్వారెడ్డి, ప్రతాప్‌రెడ్డి,అఖిలేష్‌రెడ్డి, శామీర్‌పేట తహాశీల్దార్ యాదగిరిరెడ్డి, డిప్యూటి తహాశీల్దార్లు అనూష, సంయుక్త, ఆర్‌ఐలు కవిత, అన్వేష్, రైతులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో ప్రజలకు మెరుగైన వైద్యం



**ప్రజాపక్షం/అల్వాల్ :** అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇండియన్ ఆయిల్ సంస్థ వారి సిర్ ఎస్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ సర్వీసెస్ నిధులు ద్వారా మహిత స్వచ్ఛంద సంస్థ సహకారంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా రేడియేషన్ లేకుండా రొమ్ము క్యాన్సర్ కార్వికల్ క్యాన్సర్‌ను తెలుసుకునే అత్యాధునిక స్క్రీనింగ్ ఇనిషియేటివ్ మిషన్‌ను తెలంగాణ డయాగ్నస్టిక్స్ మినీ హబ్‌ను మల్కాజ్గిరి లోక్ సభ నియోజకవర్గం ఎంపి ఈటెల రాజేందర్ తో కలిసి ప్రారంభించిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, అల్వాల్ పట్టణ కేంద్రం లోని పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు కావలసిన పరికరాలను అందించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఉమ గౌరీ, డిప్యూటీ డాక్టర్ శోభ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సీజీఎం బద్రీనాథ్, కైలాష్, అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ శ్వేత, మహిత డైరెక్టర్ రమేష్ శేఖర్ రెడ్డి, మంకెన శ్రీనివాస్ రెడ్డి నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ , బిఆర్‌ఎస్ నాయకులు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట, జీపు జాత కార్యక్రమం నిర్వహించిన టిఎస్ యుటిఎఫ్



**ప్రజాపక్షం/బొంరస్‌పేట్ :** కొడంగల్ నియోజకవర్గంలోని బొంరస్‌పేట్ మండల కేంద్రంలో బడిబాట, జీపు జాత కార్యక్రమాన్ని బొంరస్‌పేట్ మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ , జయశంకర్, సావిత్రిబాయి పూలే, మహత్మగాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలకు పూలమాలలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ యాత్ర తంకిమెట్ల, రుగడిమైలారం కొండగలలోని ప్రధాన నగరాలలో ప్రభుత్వ పాఠశాలలో ఎన్రోల్మెంట్‌పై అవగాహన కల్పించడం జరుగుతుందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వెంకటరత్నం ,ఉపాధ్యాక్షులు సుశీలమ్మ , మొత్తెప్ప,శివరాజ్ ,గోపాల్ , లీమొద్దీన ,వెంకటయ్య, తదితరులు పాల్గోన్నారు.

## జర్నలిస్టుల ఇళ్ళస్థలం ఫెన్సింగ్ కూల్చివేసి కబ్జాకు యత్నం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ళ నిర్మాణం కోరకు ప్రభుత్వం చందానగర్‌లో కేటాయించిన స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి స్థలం చుట్టూ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను బౌన్సర్‌లను ఏర్పాటు చేసుకొని దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ ఫైన్సింగ్‌ను కడ్డీలను తొలగించడంతో పాటు విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో స్థలం మధ్యలో నుంచి విద్యుత్ లైన్ స్తంబాలను ఏర్పాటు చేసి కబ్జాకు ప్రయత్నించారు. విషయం తేలుసుకున్న జర్నలిస్టులు అక్కడికి వేళ్ళగా చంపుతామని బెదించడంతో శేరిలింగంపల్లి ఎమ్మేల్యే అరికెపూడీ గాంధీకి, చందానగర్ డిప్యూటీ కమీషనర్‌కు, చందానగర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి మండల పరిధీలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ళ నిర్మాణం కోరకు శేరిలింగంపల్లి ఎమ్మేల్యే అరెకపూడీ గాంధీ, చందానగర్ కార్పొరేటర్‌ల సహకారంతో చందానగర్‌లోని సర్వే నెం 174లో ఓక ఎకార స్థలాన్ని గతంలో కేటాయించి కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించి పోజిషన్ అందజేయగా రక్షణ కోరకు ఓక ఎకర స్థలం చుట్టూ కడీలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. జర్నలిస్టులు విద్యుత్ శాఖ అధికారులను నీలదీయగా జర్నలిస్టుల స్థలంలో అక్రమంగా వేసిన స్థంబాలను తోలగించారు. జర్నలిస్టుల స్థలాన్ని కబ్జా చేయాడానికి ప్రయత్నించిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రెడ్డి రఘునాథ్ రెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ యూనియన్‌ల నాయకులు జర్నలిస్టులు , టెంజు కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్పీకర్ జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ ఎమ్మెల్యే స్పీకర్ ప్రసాద్‌కుమార్ జన్మదీన వేడుకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. స్పీకర్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డితో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# సమస్యలపై గళమెత్తిన కార్పొరేటర్లు

సమస్యలపై జిహెచ్‌ఎంసి పాలకమండలి సర్వసభ్య సమావేశంలో సభ్యుల ప్రశ్నల వర్షం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర సమస్యలపై మహానగర కార్పొరేటర్లు గళమెత్తారు. చాలా రోజుల తర్వాత సమస్యలపై గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేటర్లు అర్థవంతమైన చర్చ జరిపారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పాలకమండలి సర్వసభ్య సమావేశం బుధవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కొంతమంది అధికారులు ఆరకొర సమాధానాలతో దాటవేశారు. సభ్యులకు ప్రశ్నలు అడిగిన ప్రశ్నలకు నిర్దిష్టమైన సమాధానాలు ఇవ్వాలని అధికారులను మేయర్ ఆదేశించారు. కానీ సమస్యల పరిష్కారంపై మేయర్ నిర్దిష్టంగా రూలింగ్ మాత్రం ఇవ్వలేకపోయారు. దీంతో అధికారులు సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకుంటామని సభకు తెలిపారు. ముందుగా పహల్గామ్ టెర్రరిస్టుల కాల్పుల్లో మృతులకు సభలో సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. బొరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వేధింపులు భరించలేక సర్దార్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారని, ఆవ్యక్తి ఫొటోతో బిఆర్‌ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. ఈ అంశంపై బాబా ఫసియుద్దీన్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు అయిందని మే యర్ తెలిపారు. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినంత మాత్రన బాబా ఫసియుద్దీన్ దోషికాదని బిజెపి ఎంపి రఘునంద న్ రావు అన్నారు. ఆధారాలు లేకుండా వ్యక్తులపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం జిహెచ్‌ఎంసికి హెచ్‌సిటీ పనులు చేపట్టేందుకు రూ.1328 కోట్లు విడుదల చేసిందని మేయర్ తెలిపారు. అందుకు సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులకు ధన్యవాదాలు చెప్పారు. నగరంలో వీధి దీపాల నిర్వహణ అధ్వాన్నంగా మారిందని బిజెపి సభ్యులు నిరసన ప్రదర్శన చే స్తూ సభకు హాజరయ్యారు. సభలో ప్రధానంగా వీధి దీపాలు, నాలాల విస్తరణ, ట్రాఫిక్, క్రీడలు, టౌన్‌ప్లానిం గ్ సంబంధించిన బిల్డ్‌నౌ, జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీలో అవకతవకలు, పార్కులు, ఇంకుగు గుం తల నిర్మాణం, అడ్వటైజ్‌మెంట్, పనులలో జాప్యం, దో మల నివారణ, హైడ్రా, మూసీ అంశాలపై చర్చించారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి కొంత సమయం పాటు సభకు అధ్యక్షత వహించారు. వివిధ అంశాల పై జరిగిన చర్చ లో ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఈటల రాజేందర్, రఘునందన్ రావు, మాజీద్ హుస్సేన్, జూ ల్ఫీకర్ అలీ, రహమత్ అలీబేగ్, దానం నాగేందర్, కౌసర్ మొయినుద్దీన్‌లు పాల్గొన్నారు. మొదటిసారిగా సభకు మెదక్ ఎంపి రఘునందన్ రావు, ఎంఎల్‌ఏసి విజయశాంతి(రాములమ్మ), అద్దంకి దయాకర్‌లు హాజరయ్యా రు. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చే అధికారం లేనప్పుడు కూల్చే అధికారం ఎక్కడిది?

ఇండ్లకు అనుమతులు ఇచ్చే అధికారం లేనప్పుడు కూల్చే అధికారం జిహెచ్‌ఎంసికి ఎక్కడిందని బిఆర్‌ఎస్ సభ్యులు దేదీప్య, హేమలత ప్రశ్నించారు. నగరంలో వేలాది నోటరి డాక్యుమెట్‌లు ఉన్నాయని, వారికి అనుమతులు ఇవ్వడం లేదని, అనుమతులు ఇవ్వపోతే ఇండ్లు నిర్మించేవారివి కూల్చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో నిర్మాణదారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నార న్నారు. బిల్డ్‌నౌ సాఫ్ట్‌వేర్ అమలుపై కాంగ్రెస్ సభ్యుడు సి.ఎన్.రెడ్డి లెవనేత్తిన చర్చలో దేదీప్య, హేమలత పాల్గొన్నారు. ఆక్యూపెన్సీ సర్టిఫికేట్ వచ్చిన వాటిని కూడా సీజ్ చేస్తున్నారని తెలిపారు. నోటరి డాక్యుమెట్‌లు ఉన్నవారికి కూడా భవన నిర్మాణ అనుమతులు ఇ వ్వాలని పలువురు కార్పొరేటర్లు డిమాండ్‌కు మేయర్ విజయలక్ష్మి సైతం ఏకీభావించారు. ఉప్పల్ ఒక స్థలం లో అనుమతులు పొంది, మరో చోట ఉన్న ప్రభుత్వ స్థ లంలో నిర్మాణాలు జరుపుతుంటే ఎం చేస్తున్నారని బిజె పి కార్పొరేటర్ ప్రశ్నించారు. ఈ విషయంలో ఇప్పటికే నిర్మాణ సంస్థకు షోకాస్ నోటీసు ఇచ్చామని, కోర్టులో విచారణ జరుగుతుందని కమిషనర్ సభ్యులకు తెలిపా రు. కోర్టు విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్పొరేటర్లు లెవనేత్తిన ప్రశ్నలకు చీఫ్ సిటీప్లానర్(సిసిపి) కె.శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు.

### బక్రీద్ సమయంలో రాంకీ బ్లాక్‌మెయిలింగ్ : మాజీద్ హుస్సేన్

మూడు రోజులు బక్రీద్ పండుగ ఉన్న నేపథ్యంలో రాంకీ ఎన్వీరో బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతుందని నాంపల్లి ఎంఎల్‌ఏ మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల నుంచి డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే 25 టన్నర్ వాహనాలను నిలిపేసిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లలో ఎక్కడికక్కడ చెత్త గుట్టలుగా పేరుకుపోయిందని తెలిపారు. బక్రీద్ పండుగ ముందు రాంకీ చెత్త తరలింపు చేయకుండా బ్లాక్‌మెయిలింగ్ పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు కమిషనర్ బిల్లుల చెల్లింపులో సమస్య తలెత్తిందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

### స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి జిహెచ్‌ఎంసి కార్యాలయాన్ని ఎప్పుడు తరలిస్తారు..

మొఘల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయాన్ని మరోచోటుకు తరలించాలని గత పదేళ్లుగా తాను చెప్పుతున్నా ఇప్పటికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంఐఎం కార్పొరేటర్ సయ్యద్ సోహెల్ ఖాద్రి ప్రశ్నించారు. పదేళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కోచ్‌లను రెగ్యులరైజ్ చేయాలన్నారు. త్వరలోనే సర్కిల్ కార్యాలయాన్ని తరలిస్తామని అధికారులు తెలిపారు. మొఘల్‌పుర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నాలుగు పర్యాయాలు అగ్నిప్రమాదం జరిగిందని, అగ్ని ప్రమాదం జరిగిన ప్రతిసారి టౌన్‌ప్లానింగ్ విభాగం ఫైళ్లు కాలిపోయాయని బిజెపి ఎంపి రఘునందన్ రావు ప్రశ్నించారు. 2016లో టౌన్‌ప్లానింగ్ ఫైళ్లను డిజిటలైజ్ చేశామని, కాలిపోయిన ఫైళ్లు కూడా భద్రంగా ఉన్నాయని సిసిపి శ్రీనివాస్ తెలిపారు.

### వీధి దీపాల నిర్వహణపై నిలదీసిన కార్పొరేటర్లు..

నగరంలో వీధి దీపాల నిర్వహణ అధ్వాన్నంగా మారిందని పలువురు కార్పొరేటర్లు అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణ సంస్థ కాలపరిమితి ముగిసిపోకముందే ముందస్తుగా ఎందుకు టెండర్లు ఆహ్వానించలేదని మేయర్‌తో సహా కార్పొరేటర్లు అధికారులను నిలదీశారు. వీధి దీపాల నిర్వహణ అంశాన్ని రాగం నాగేందర్ యాదవ్, మిర్జా ముస్తాఫాబేగ్ లెవనేత్తగా చర్చలో మహాలక్ష్మి , బొంతు శ్రీదేవి పాల్గొన్నారు. పండుగల సీజన్ రాబోతుందని, తీరా ఇప్పుడు టెండర్లు ఆహ్వానిస్తే మూడు నాలుగు నెలల సమయం పడుతుందన్నారు. ముందుస్తుగా చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు.

### జనన, మరణ ధృవపత్రాల జారీలో అక్రమాలపై సభ్యుల ఫైర్

జనన, మరణ ధృవపత్రాల జారీలో అవకతవకలు జరుగుతున్నాయని, అందుకు పాల్పడుతున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బిజెపి కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి సభ్యులు ప్రశ్నించారు. దాదాపు 30 వేల ధృవపత్రాలు జారీ చేశారని, ఇప్పటికే వాళ్లు విదేశాలకు సైతం వెళ్లిపోయి ఉంటారన్నారు. ఈ అంశంపై గతంలోనే విచారణ జరిపామని అదనపు కమిషనర్ ఎస్.పంకజ తెలిపారు. 22 ధృవపత్రాలను రద్దు చేశామని, దీనిపై పోలీస్ కేసు నమోదు చేశామని, పోలీసుల విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. ఇద్దరు వైద్యులకు చార్జ్‌మెమోలు ఇచ్చామని, 17 మంది కంప్యూటర్ ఆపరేటర్లను విధుల నుంచి తొలగించామని చెప్పారు.

### మూసీ ప్రక్షాళనకు మద్దతు ఇవ్వాలి : దర్పెల్లి

సబర్మతి నదిని ప్రక్షాళన చేసిన విధంగా మూసీ ప్రక్షాళనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారని, అందుకు మద్ధతు ఇవ్వాలని ఎంపిలు ఈటల రాజేందర్, రఘునందన్ రావులను కాంగ్రెస్ సభ్యుడు దర్పెల్లి రాజశేఖర్ రెడ్డి కోరారు. అందుకు ఎంపి ఈటల రాజేందర్ స్పందిస్తూ పేదల ఇళ్లను కూల్చేస్తే తాను వ్యతిరేకించామని, మూసీ ప్రక్షాళనకు మద్ధతు ఇస్తామని, అయితే అందుకు సంబంధించి చర్చ పెట్టాలన్నారు. నాలాల ఆధునికరణపై సుదీర్ఘకంగా చర్చించారు. త్వరితగతిన నాలాల ఆధునికరణ, వరద ముంపు సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు.

## సమస్యలు పరిష్కరించేందుకు ప్రజల వద్దకు పాలన

రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం / కొడంగల్ :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం కొడంగల్ నియోజకవర్గంలోని బోంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో పాల్గోని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ భూ భారతి చట్టంలోని అంశాలను వివరించారు. రైతులు పడుతున్న సమస్యలను స్వయంగా అడిగి వారికి పరిష్కార మార్గాన్ని చూపారు. ప్రస్తుతం జిల్లాలోని మండలాల్లో రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. తహసీల్దార్, నయాబ్ తహసీల్దార్‌ల నేతృత్వంలో రెండు బృందాలను నెలకొల్పి ప్రతి రోజు ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహించేలా చర్యలు తీసుకొవడం జరిగిందని తెలిపారు. భూ మికి సంబంధించిన రికార్డులలో తప్పులు పార్ట్ బిలో చేర్చిన భూముల సమస్యలు స్వీకరించి భూ భారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువులోపు స మస్యలను పరిష్కరించడం జరుగుతుందని రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల కు అనుగుణంగా ఆగస్టు 14వ తేదిలోపు భూ భారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ధరఖాస్తుల వివరాలను సంబందిత శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరంనాగిరెడ్డిపల్లి గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఏవైన సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని అన్నా రు. బొంరాస్‌పేట మండలలో ఉన్న రేషన్‌షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మూడు నెలలకు సంబంధించి అందిస్తున్న సన్నబియ్యం ఒకేసారి ఇచ్చేందుకు పక్క ప్రణాళిక రూపోందించుకోవాలని సంబందిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఐకేపి సెంటర్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వరి ధాన్యం తడిసి రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యాన్ని రైస్‌మిల్లర్లకు చేరవేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డిఎస్ఓ మోహన్‌బాబు, తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ వెంకన్నలతో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులున్నారు.

## సూట్ కేసులో మృతదేహం లభ్యం

దర్యాప్తు చేసిన పోలీసులు

**ప్రజాపక్షం/దుండిగల్ :** సూట్ కేసులో మృతదేహం లభించిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది నిర్మానుష ప్రాంతంలో ట్రావెల్ సూట్‌కేసులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. అక్కడ పని చేస్తున్న వాచ్‌మెన్‌కి సూట్‌కేసు నుంచి భరించలేని దుర్వాసన వస్తుండడంతో, ఆయన బాచుపల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాచుపల్లి పోలీసులు, డాగ్ స్క్వాడ్‌తో కలిసి ఘటనాస్థలానికి చేరుకొని సూట్‌కేసును తెరిచి చూడగా, అందులో ఒక మహిళ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండడం గుర్తించారు. మృతురాలి వివరాలు ఇంకా తెలియరాలేదు, ఆమె వయస్సు సుమారు 30 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. శవం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో, సుమారు 10–15 రోజుల క్రితమే మృతిచెంది ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేసారు. ఈ హత్య వేరే చోట చేసి శవాన్ని ఇక్కడికి తీసుకొచ్చి పడేశారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల నమోదైన మహిళ మిస్సింగ్ కేసులను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసు డాగ్ స్క్వాడ్ బృందం, క్లూస్ టీమ్‌ను రప్పించి ఆనవాళ్ల కోసం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వాచ్‌మెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురికి తరలించారు. సూట్ కేసులో లభించిన మహిళ మృతదేహం ఇక్కడికి ఎలా తీసుకువచ్చారు? ఏ వాహనంలో వచ్చింది. ఎటువైపు నుంచి వచ్చింది అను కోణంలో బాచుపల్లి పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఆ మార్గంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా చేపడుతున్నారు. ఇది అత్యాచారం చేశారా..? లేక కేవలం హత్య చేసి ఇక్కడ నిర్మానుష ప్రాంతంలో తీసుకువచ్చి పడేసారా..? అనే విషయం నిజాలు వెలుగులోకి తెచ్చేందుకు ప్రత్యేకంగా నాలుగు దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసినట్లు సిఐ ఉపేందర్ తెలిపారు.

## కొనసాగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** రైతులు భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మి నారాయణ సూచించారు. భూ భారతి రెవెన్యూ సదస్సు రెండవ రోజు కొత్తగడి ,గోదుమగూడ , భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా రైతులకు కావాల్సిన సేవాలను అందించాడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సాదా బైనామా , పిఒపి , భూ విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు పాసు పుస్తకాల అందజేత తదితర అంశాలపై క్షుణంగా పరిశీలించి సమస్యల పరిష్కర దిశగా రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను రిజిస్టర్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తులను క్షుణంగా పరిశలించిభూభారతి చట్టం ప్రకరం రైతుల సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ సదస్సులను వికారాబాద్ మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామల్లో నిర్వహించడం జరుగుతుంది కావున రెవెన్యూసదస్సులను సమస్యలు ఉన్న రైతులు ఉపయోగించుకొని సమస్యలను పరిష్కరించుకోగలరని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ అనిత , సీనీయర్ అధికారి సురేష్ , ఆర్‌ఐ సంజయ్ , సిబ్బంది పాల్గోన్నారు.



## కబ్జాదారుడి చేతుల్లో... అటవిశాఖ అధికారులు కీలుబొమ్మలు!

అటవి భూమి అక్రమణ దర్యాప్తుపై అధికారుల నిర్లక్ష్యం



**ప్రజాపక్షం/కొడంగల్ :** ఇటీవల 'ప్రజాపక్షం' వెలికితీసిన అటవి భూమి అక్రమణ ఘటనలో సంబంధిత అటవి శాఖ అధికారుల నిర్లక్ష్యం రోజు రోజుకు పెరుగుతుంది. అక్రమణపై అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్థులు, పలు ప్రజా సంఘాల నేతలు, అటవి ప్రేమికులు పలు అనుమనాలను వ్యక్తపరుస్తున్నారు. కబ్జాదారుని చేతుల్లో అధికారులు కీలు బొమ్మలుగా మారుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గత నెల 24న ప్రజాపక్షం దినపత్రికలో అటవి భూముల అక్రమణ వార్తా కథనం వికారాబాద్ జిల్లాలో సంచలనం రేపింది. దీనిపై స్పందించిన అటవి శాఖ అధికారులతో పాటు ఫ్లైయింగ్ స్కాడ్ బృందం కబ్జాకు గురి అయిన అటవి భూమిని తనిఖీలు చేసింది. కాగా జిల్లా అటవి శాఖ అధికారులు దీనిపై నిమ్మకు నిరెత్తినట్లుగా కునుకు పాటు వ్యవహారంతో తప్పుదోవ పట్టించేందుకు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 4 ఎకరాలకు పైగా అటవి భూమి అక్రమణ జరిగినప్పటికి, 2వందలకు పైగా పచ్చని చెట్లు నరికి వేసినప్పటికి, అటవి భూమిలో మట్టి తవ్వకాలు చేపట్టి దర్జాగా మట్టి రోడ్డు ఏర్పాటు చేసిన పట్టించుకునే అధికారి లేకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవి చట్టం ప్రకారం సంబందిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా కంటితూడుపు చర్యలకు పాల్పడుతున్నారని అటవి శాఖ అధికారుల పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 లక్షలకు పైగా అటవి ప్రాంతంలో నష్టం జరిగినప్పటికి చిన్నపాటి జరిమానా విధించి వదిలిపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం అవుతున్న ట్లు తెలుస్తోంది..! కాగా ఇదివరకు అటవి ప్రాం తంలో చోటుచేసుకున్న చెట్ల నరికివేత, పోడు భూ ముల సంఘటనలో సంబంధిత గిరిజన రైతుల పట్ల అటవి శాఖ అధికారులు తీసుకున్న కఠిన చ ర్యలు ఉదాహరణలుగా నేటికీ కనిపి టస్తున్నాయని చెబుతున్నారు. ఈ సంఘటనలో మాత్రం అటవి శాఖ అధికారులు ఏ మాత్రం చలనం లేకుండా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అటవి భూమిని, చెట్లను, వన్య ప్రాణుల ను రక్షించాల్సిన అధికారులు, సిబ్బంది భూ కబ్జాదారులకు వత్తాసు పలుకడం, కనికరం చూపడం లో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చివరకు ఈ సంఘటన కేసును కంటితూడుపుగానే మూసివేసేందుకు అటవి శాఖ జిల్లా స్థాయి నుంచి బీట్ అధికారి వరకు ముడుపుల పర్వంలో మునిగి ఉన్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఏ మాత్రం జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఈ సదస్సులను భూసంబంధిత సమస్యలున్న వారు సద్వినియోగపరచుకోవాలని కోరారు.. మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును బుధవారం ఆయన పరిశీలించారు. తమ అర్జీలను నిర్దేశిత కోడ్‌లలో నమోదు చేయాలని, రైతులకు సంబంధించిన డాక్యుమెంట్లను జత చేయాలని, అర్జీదారులతో సౌమ్యంగా వ్యవహరించి వారికి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందికి ఆయన సూచించారు. సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సదస్సుల ద్వారా రెవెన్యూ రికార్డులను సక్రమంగా నిర్వహించే వీలు కలుగుతుందన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ భూభారతి చట్టంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని సిబ్బందికి సూచించారు. ఘట్‌కేసర్, శామీర్‌పేట తహసీల్దార్లు రజని, యాదగిరి రెడ్డి, డిప్యూటి తహసీల్దార్ భాస్కర్, ఆర్‌ఐ కావ్య సాయిరాం తదితర రెవెన్యూ సిబ్బంది ఈ సదస్సుల్లో పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం : మునిసిపల్ కమిషనర్ సునీత



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ సునీత అన్నారు. బుధవారం పట్టణంలని వివిధ వార్డుల్లో పర్యటించి తడి, పొడి చెత్త, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ సునీత మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీరు నిల్వ లేకుండా చేయడంతోపాటు ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా పెట్టెందుకు కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల న్నారు. వాణిజ్య సముదాయ యాజమానులు వృత్తి వ్యాపారులు నోటీసులు తీసుకొని పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంను కలుసుకున్న ట్రైనీ ఐఎఎస్‌లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ కేడర్‌కు చెందిన 2024 బ్యాచ్ ట్రైనీ ఐఎఎస్ అధికారులు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సిఎంను కలిసిన వారిలో డాక్టర్ ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో శిక్షణ పొందుతున్న ఐఎఎస్‌లు సౌరభ్ శర్మ, సలోని ఛబ్రా, హర్ష చౌదరి,, కరోలిన్ చింగ్తియన్మయి, కొయ్యడ ప్రణయ్ కుమార్‌తో పాటు డాక్టర్ ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి చైర్‌పర్సన్ శాంతికుమారి, కోర్సు డైరెక్టర్ ఉషారాణి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులు ఉన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఎఎస్‌లను సిఎం రేవంత్ రెడ్డి అభినందించి, బాధ్యతల నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు.

## ఘనంగా రావి నారాయణరెడ్డి జయంతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** తెలంగాణ సాయుధ పోరాట యోదుడు, ప్రజల పక్షపాతి రావి నారాయణరెడ్డి జయంతి వేడుకలను సిపిఐ హయత్ నగర్ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శేషురాజుపల్లి శ్రీదేవి, బొంగు అరుణ్‌కుమార్ గౌడ్, మర్రి శోభన్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, సక్రు నాయక్, మందుల కృష్ణ, సుజాత, సరిత, అరుణ, సౌజన్య, సుమతి, ఆదిలక్ష్మి, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వనస్థలి శబరిమల అయ్యప్ప దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఘనంగా వనస్థలిశబరిమల అయ్యప్ప దేవస్థానం 28వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మూడే రోజుల పాటు నిర్వహచనున్న బ్రహ్మోత్సవ వేడుకలు మంగళవారం నుండి గురువారం వరకుఎ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాగంణంలో జరుగుతన్న బ్రహ్మోత్సవ వేడుకలలో భాగంగా బుధవారం కనుల పండుగగా వైభవంగా నిర్వహించారు. బాదంపూడి నాగ సుబ్రహ్మణ్య శర్మ, వల్లంబట్ల కమాలాకర్ శర్మ (శివ) ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవ వేడుకలను కనుల పండుగ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎం.విఠల్‌యాదవ్, అధ్యక్షులు జి.దాసు గౌడ్, ప్రధాన కార్యదర్శి వి.ఆనంద్ రావు, కోశాధికారి బి.అరవింద్‌గౌడ్, సభ్యులు సంజీవరెడ్డి, ఓకారం, రత్నమాల, శ్రీకాంత్ జాదవ్, గుండం సత్యనారాయణ, భాస్కర్ రావు, కృష్ణరెడ్డి, గోపాల్‌రావు, ప్రేమ్ రాజ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే ఇందిరమ్మ ఇంటి నిర్మాణ కల సహకారం

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** కాంగ్రెస్ పార్టీతోనే ఇందిరమ్మ ఇంటి నిర్మాణ కల సహకారం అవుతుందని మాజీ కౌన్సిలర్ నడికూడ సరిత యాదగిరి యాదవ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు రతన్‌కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సరిత యాదగిరి యాదవ్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ పారీ లక్ష్యమని, ఆ దిశగా చర్యలు ముమ్మరం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో నేతలు గుబ్బ శ్రీను, నరసింహులు యాదవ్, లక్ష్మ ణ్, కాపర్తి రాజు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాశ్వత భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి చట్టం తీసుకువచ్చినట్లు ఫరూఖ్‌నగర్ తహశీల్దార్ పార్థసారధి వివరించారు. బుధవారం మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో రెవిన్యూ సదస్సును నిర్వహించారు. అదే విధంగా మండల పరిధిలోని శేరిగూడ గ్రామంలో డిప్యూటి తహసీల్దార్ ఆనంద్ ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సును నిర్వహించి రైతుల నుండి భూ సమస్యలపై ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పార్థసారధి మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రెడ్డి, మండల రెవిన్యూ అధికారులు బానుచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, ఆర్ల యాదయ్యతోపాటు రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మాడ్గుల్ గ్రామపంచాయతీ కార్యదర్శితో పాటు సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా మాడ్గుల్ గ్రామపంచాయతీ కార్మికులు బుధవారం పంచాయతీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు గ్రామపంచాయతీ కార్యాలయం మాడ్గుల్‌లో గ్రామపంచాయతీ కార్యదర్శిపై దాడి చేస్తున్నప్పుడు అడ్డుగా వెళ్లిన పంచాయతీ కారొబార్ సయ్యద్ అజీముద్దీన్, వాటర్ మాన్ భూతరాజు లక్ష్మయ్య లపై కామోజు వినోద్ తండ్రి అంతయ్య దాడి చేయడానికి వారు ఖండించారు. దాడి చేసిన వ్యక్తి పై చర్య తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకునేంతవరకు గ్రామపంచాయతీ సిబ్బంది,పారిశుద్ధ్య పనులు నీటి సరఫరా వంటి పనులను, విధులను ఆపి వేస్తున్నట్టు గ్రామపంచాయతీ సిబ్బంది ప్రకటించారు. మాడ్గుల్ పంచాయతీ సిబ్బంది చేస్తున్న నిరసనకు మండలంలోని గ్రామపంచాయతీల సిబ్బంది సంఘీభావం తెలిపారు.

# ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలి

### దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని లాలాగూడ్ సెంట్రల్ ఆసుపత్రిలో ధన్వంతరీ ప్రత్యేక వార్డును బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ప్రారంభించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరక్టర్ నిర్మాలా రాజారామ్, హైదరాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ లోకేశ్ విష్ణోయ్, లాలాగూడ్ సెంట్రల్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ ఐ.శివ నాగ ప్రసాద్, లాలాగూడ సెంట్రల్ ఆసుపత్రి చీఫ్ స్టాఫ్ సర్జన్ డా.ఎన్విబికె సాయి, డివిజన్‌కు చెందిన సీనియర్ అధికారులు, డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ధన్వంతరి ప్రత్యేక వార్డులో దక్షిణ మధ్య రైల్వేకి చెందిన సూపరవైజరీ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు సేవలందిస్తారు. ఇక్కడ ప్రత్యేక విడివిడి వార్డులు, రోగుల వెంట ఉండే అటెండర్కు కాట్ వసతి, సెంట్రలైజ్డ్ ఆక్సిజన్ సరఫరా, ఇతర సౌకర్యాలు, ఎలక్ట్రిక్ మంచాలు, ఎయిర్ కండీషన్లు, అటాచ్డ్ మరుగుదొడ్లు, లిఫ్ట్ సౌకర్యం, రాంప్ సౌకర్యాలతో పాటు 24 గంటలు వైద్య సదుపాయాలు, నర్సింగ్ పర్యవేక్షణ ఏర్పాటు చేయబడ్డాయి. పర్యావరణ సంరక్షణ, అభివృద్ధిలో భాగంగా జనరల్ మేనేజర్ ఆసుపత్రి పరిసరాలలో ఇతర అధికారులతో, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు సౌకర్యం కోసం నూతన లిఫ్ట్, రాంప్ను ఆయన ప్రారంభించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడనికి, ప్రోత్సాహంలో భాగంగా ఈ వార్డులో విలువైన సమాచారం అందించేలా గోడలపై ప్రత్యేక చిత్రాలతో అలంకరించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ప్రసంగిస్తూ రోగులు మరియు వారితోపాటు వచ్చే వారికి ఆసుపత్రిలో ప్రత్యేక సౌకర్యాలు, వసతులు కల్పించిన మెడికల్ సిబ్బందిని అభినందించారు. ఈ సౌకర్యాలు చికిత్స పొందేవారికి ఎంతో మెరుగ్గా ఉపయోగపడతాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేకంగా పవిత్రమైన నందన వనం ఏర్పాటు చేపట్టిన వైద్య బృందాన్ని ఆయన అభినందించారు.

## విపత్తుల సమయంలో తక్షణ సహాయ చర్యలపై మాక్ డ్రిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విపత్తు నిర్వహణ మరియు రుతుపవనాల తయారీలో భాగంగా భవనాల పతనంపై మాక్ డ్రిల్ నిర్వహించారు.' సంబంధిత విభాగాల అధిపతులు, ఇతర సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఈ మాక్ డిల్ జరిగింది. డ్రిల్ అంతటా, టిజిఐసిసిసి, ఎంఎఒసి అధికారులు ప్రతి సహాయక చర్యను పర్యవేక్షించి డాక్యుమెంట్ చేశారు. సహాయక చర్యలపై వార్ రూమ్‌లో పోస్ట్‌డ్రిల్ సమీక్ష సెషన్ జరిగింది. దీనిలో పాల్గొనే విభాగాలు పనులను విశ్లేషించాయి. విపత్తుల సమయంలో తక్షణ సహాయ చర్యలపై ఆయా విభాగాలు ఎలా స్పందిస్తాయాయో ఈ మాక్ డ్రిల్ ద్వారా తెలియజేశారు. విపత్తు నిర్వహణ మరియు రుతుపవనాల తయారీలో భాగంగా భవనాల పతనంపై మాక్ డ్రిల్ నిర్వహించారు.



# ప్రభుత్వ పనులకు టిజిఎండిసి నుంచి ఇసుక

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** వివిధ ఇంజనీరింగ్ శాఖల ద్వారా చేపట్టిన ప్రభుత్వ పనులకు అవసరమైన ఇసుకను టిజిఎండిసి నుంచి తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సంబంధిత ఆర్ అండ్ బి,ఇరిగేషన్,మిషన్ భగీరథ,ఎలక్ట్రిసిటీ, గ్రౌండ్ వాటర్ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో కావలసిన ఇసుక వివరాలు తయారు చేసి టిజిఎండిసి వారికి అందజేసినట్లయితే ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. 2026 మార్చి 31 వరకు ఆయా శాఖలకు ఎంత మేర ఇసుక అవసరం ఉన్నది ఎస్టిమేషన్ తయారు చేసి ఇవ్వాలని, అదేవిధంగా టిజిఎండిసి వద్ద అందుబాటులో ఉన్న ఇసుకను ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అందరికి అనువు గా ఉండేందుకు వీలుగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పరిధిలో ఓఆర్ఆర్ ను బేస్ చేసుకుని మూడు సాండ్ బజార్లను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్మెట్, ఆదిభట్ల, వట్టినాగులపల్లిలో సాండ్ బజార్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అబ్దుల్లాపూర్మెట్ సాండ్ బజారులో 40 మెట్రిక్ టన్నుల ఇసుక, ఆదిభట్ల సాండ్ బజారులో 90 వేల మెట్రిక్ టన్నుల ఇసుక, వట్టినాగులపల్లి సాండ్ బజారులో 40 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు మరియు సన్న రెండు రకాల ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సాండ్ బజార్లలో దొడ్డు, సన్న రెండు రకాల ఇసుకను అందుబాటులో ఉంచి టిజిఎండిసి ద్వారా డిపార్ట్మెంట్ వాహనాల ద్వారా ఇసుకను సరఫరా చేయడం జరుగుతుందని, అంతేకాకుండా కొనుగోలు చేసే వారి సొంత వాహనాల ద్వారా కూడా సరఫరా చేసేందుకు అవకాశం ఉన్నదని కలెక్టర్ స్పష్టం చేశారు. వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 125242 ను సంప్రదించాలని తెలిపారు.జిల్లాలోని మూడు సాండ్ బజార్లకు సంబంధించి వివరాలు తెలుసుకునుటకు అబ్దుల్లాపూర్మెట్ సాండ్ బజార్ ఇన్చార్జి నెంబర్ 9154863039, వట్టినాగులపల్లి సాండ్ బజార్ ఇన్చార్జి నెంబర్ 9154238603,ఆదిభట్ల సాండ్ బజార్ నెంబర్9154238600 లకు ఫోన్ చేసి సంప్రదించవలసిందిగా తెలిపారు. సమావేశంలో ఎస్.ఇ టిజిసిఎస్‌జిడిసిఎల్ డి. శ్రీరామ్ మోహన్,పిఆర్ ఈఈ ఆర్ సుదర్శన్ రెడ్డి,ఆర్‌అండ్ బి ఇఇ లు పి మధుసూదన్,జి. రవీందర్ కుమార్,డిప్యూటీ ఇఇ కె.జగన్మోహన్ రెడ్డి,సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు ట్రాన్స్ పోర్ట్,రెవెన్యూ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఉదయం 8 గంటలకే రేషన్ షాపులు

### అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ రేషన్ షాపుల ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** ఉదయం 8 గంటలకే షాపులు తెరచి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మూడు నెలల రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. ప్రభుత్వం మూడు (జూన్,జూలై,ఆగస్టు)నెలలకు గాను ఒకే సారి జూన్ నెలలోనే బియ్యం పంపిణీ నిర్ణయించిన విధంగా జరుగుతున్నందున పంపిణీ విధానాన్ని అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ బుధవారం జిల్లాలోని వివిధ రేషన్ షాపులను టతనిఖీ చేసి బియ్యం పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. శంషాబాద్‌లోని మూడు రేషన్ షాపులలో మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ జరుపుతున్న క్రమాన్ని డీలర్లను, వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. మొదట్లో కొంత ఇబ్బంది జరిగినప్పటికీ,ప్రస్తుతం నిలకడగా ఉందన్నారు. ఒక్క రేషన్ కార్డుకు ఇ పాస్ మిషన్ ద్వారా ట్రాన్స్‌యాక్షన్ చేయడానికి కొంత సమయం పడుతున్నప్పటికీ రేషన్ కార్డుదారులు సీరియల్ నంబర్ పాటిస్తూ బియ్యం తీసుకోవాలని అదనపుకలెక్టర్ సూచించారు. రేషన్ డీలర్లు ప్రతిరోజు ఉదయం ఎనమిది గంటల లోగా ఆరోజు టోకెన్ల జారి పూర్తి చేయాలని, అదే విధంగా బియ్యం నిల్వలు ఎప్పటికప్పుడు సరిపడ ఉండేలా మండల స్థాయి గోదాము ఇంచార్జీలతో మాట్లాడుతూ సరుకులు తెప్పించుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. మూడు నెలల బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తయ్యేందుకు అందరు సహకరించాలని అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.



## రైతుల సమస్యలు పరిష్కరించేందుకు భూభారతి

### చల్లా నరసింహారెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి రెవెన్యూ చట్టం 2025 తీసుకువచ్చిందని, ఇందులో భాగంగానే భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతు భూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం మండలం చిన్నతుప్పర గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు పూర్తి చేసిన విరాసత్ ధ్రువపత్రాన్ని లబ్ధిదారునికి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. చాలాకాలంగా రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.భూముల సమస్యలు ఉదాహరణకు పట్టాదారు పాసుపుస్తకంలో పేర్లు తప్పుగా నమోదు కావడం, భూవిస్తీర్ణంలో తప్పుగా నమోదు కావడం లాంటి సమస్యలతో పాటు మరెన్నో పరిష్కరించేందుకు నూతన చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. రెవిన్యూ సదస్సులను రైతులు భూ యజమానులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం డిప్యూటీ తహసీల్దార్ నవత, ఆర్ఐ స్వర్ణకుమారి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల యాదయ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లూర్ రాజు, గ్రామ శాఖ అధ్యక్షులు ఆదిల్ షేక్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**ప్రజాపక్షం/యాచారం :** రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో కూరగాయల మార్కేటు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కోసం స్థలం పరిశీలన చేశారు. ఈ సంధర్భంగా జరిగిన సమావేశంలో ఎంఎల్ఏ మాట్లాడుతూ రైతులకు మేరుగైన మార్కేటు సౌకర్యం కల్పించడానికి తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. ఫార్మాసిటి పేరుతో మేడిపల్లి, నానాక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో రైతుల నుండి భూములను తక్కువ ధరలకు తీసుకోని రైతులను మోసం చేశారన్నారు. ఫార్మసిటిలో భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రేస్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. రైతులను అదుకోవడానికి కృషి చేస్తున్నామన్నారు. కాలుష్యం లేని పరిశ్రమలు ఎర్పాటు చేయడానికి తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి, గడ్డమల్లాయగూడ, మొండిగౌరేల్లి,గున్‌గల్ గ్రామాలకు చెందిన రైతులను దృష్టింలో తెలంగాణ రాష్ట్ర రైతు కమిషిన్ కూరగాయల మార్కేటు ఎర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిషన్ చైర్మేన్ ముదిరెడ్డి కొదండరెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి,రైతు కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి,రామ్‌రెడ్డి గోపాల్‌రెడ్డి,మరికంటి భవాణి,గోవింద్,హరి వెంకట ప్రసాద్, మార్కెటింగ్ అడిషినల్ డైరెక్టర్ రవికుమార్, జిల్లా వ్యవసాయధికారి నరసింహ్మరావు, జిల్లా ఉధ్యానవన శాఖ , పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేశ్,అర్డిఒ అనంతరెడ్డి, ఎడిఎ సుజాత, మండల వ్యవసాయధికారి రవినాథ్ పాల్గొన్నారు.



## పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం

### ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట:** శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను బుధవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ 85మంది లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేసి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం పేదోడి సొంతింటి కలలను నెరవేరిచేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు. పేద ప్రజల ఇంటి నిర్మాణానికి రూ. 500000లు ఉచితంగా ఇవ్వడం చరిత్రలోనే మొదటిసారి అని వాటిని ప్రతి ఒక్కరు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ పారీ లక్ష్యమని, ఆ దిశగా చర్యలు ముమ్మరం చేసినట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించిన డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని వివరించారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మున్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్ యాదవ్ , మాజీ జెడ్పిటిసి తన్విరాజ్, నరేందర్ ,చంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి పరిధిలోని తుర్కాపల్లి, లేమామిడిలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో, కేశంపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేయడంతో పాటు లబ్దిదారులకు ధృవపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులను ఇస్తున్నామని వివరించారు. గ్రామీణ ప్రాంత పేదలకు సొంతింటి కల నేరవేర్చాలంటే ఇందిరమ్మ రాజ్యంలోనే సాధ్యమవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని గుర్తు చేశారు. రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తీరుతామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి అండగా నిలిచేందుకు కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేష్, మాజీ జడ్పిటిసితాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డి, జగదీశ్వరప్ప, మార్కెట్ డైరెక్టర్లు భాస్కర్, కరుణాకర్‌తోపాటు అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### భూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి

రెవిన్యూ అధికారులు మానవీయ కోణంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో పాల్గొన్నారు. రైతులు ఇచ్చిన ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు మానవతా దృక్పధంతో పనిచేయాలని సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే విధంగానే భూ భారతి పోర్టల్‌ను తీసుకువచ్చినట్లు వివరించారు. రైతులకు అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అధికారులు రైతులకు, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

### భరద్వాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



**ఫరూఖ్‌నగర్ :** సివిల్స్ ర్యాంకర్ భరద్వాజ్‌ను ఆదర్శంగా తీసుకొని యువత అన్ని రంగాల్లో ముందుకు వెళ్ళాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. బుధవారం షాద్‌నగర్‌లో సివిల్స్‌లో 905 ర్యాంక్ సాధించిన భరద్వాజ్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించి అభినంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కృషి, పట్టుదలతో విద్యను అభ్యసిస్తే సాధించలేనిది ఏమి ఉండదని భరద్వాజ్ నిరూపించాడన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మాజీ జడ్పిటిసి తాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, చెన్నయ్య, కృష్ణారెడ్డి, శ్రీశైలం గౌడ్, రాజునాయక్, విజయ్‌కుమార్‌రెడ్డి, బుచ్చయ్య, కొప్పునూరి ప్రవీణ్, దిలీప్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ



## ఇంగ్లాండ్‌ను వెంటాడుతున్న బౌలింగ్ కష్టాలు..!



ఇంగ్లాండ్ జట్టుకు వరుసగా షాకులు తగులుతున్నాయి. టీమిండియాతో ఐదు టెస్టుల సిరీస్‌ను విజయంతో ఆరంభించాలని కసితో ఉన్న ఆతిథ్య జట్టుకు బౌలింగ్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పేసర్ మార్క్‌వుడ్ జోఫ్రా ఆర్చర్ గాయపడ్డారు. క్రిస్ వోక్స్ సైతం ఫిట్‌నెస్ కోసం నానా పాట్లు పడుతున్నాడు. అంతలోనే యువ పేసర్ గస్ అట్కిన్సన్ సైతం గాయం పడ్డాడు. దాంతో ఇండియాతో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. కండరాల గాయంతో బాధపడుతున్న ఈ స్పీడ్‌స్టర్ కోలుకునేందుకు సమయం పట్టనుంది. సో.. జూన్ 20 మొదలయ్యే మొదటి టెస్టులో అతడు ఆడడం దాదాపు అసాధ్యమే. 'యువ పేసర్ గస్ అట్కిన్సన్ కుడి కాలి తొడకండరాల గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. అతడు ఇండియాతో జూన్ 20న జరుగబోయే తొలి టెస్టుకు దూరమయ్యే అవకాశముందని ఇంగ్లాండ్ బోర్డు తెలిపింది. స్వదేశంలో జింబాబ్వేతో జరిగిన ఏకైక టెస్టులో అట్కిన్సన్ గాయపడ్డాడు. దాంతో.. అతడు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సీజన్‌లో భాగంగా టీమిండియాతో సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండకపోవచ్చు. ఒకవేళ తొలి టెస్టులోపు అట్కిన్సన్ కోలుకొని, ఫిట్‌నెస్ సాధించకుంటే ఇంగ్లాండ్‌కు పెద్ద దెబ్బే. గత వేసవిలో అరంగేట్రం చేసిన అట్కిన్సన్ 12 మ్యాచుల్లో 55 వికెట్లు పడగొట్టాడు.

**గిల్ సారథ్యంలో..** శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు జూన్‌లో ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. లీడ్స్‌లోని హెడింగ్లే మైదానంలో జూన్ 20న ఇరుజట్ల మధ్య తొలి టెస్టుతో సిరీస్ మొదలవ్వనుంది. జూలై 2న రెండో టెస్టు, జూలై 10న మూడోది, జూలై 23న నాలుగో మ్యాచ్, జూలై 31న ఐదో టెస్టులో భారత్, ఇంగ్లాండ్ తలపడుతాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025–27 సైకిల్‌లో ఇరుజట్లకు ఇదే మొదటి సిరీస్. కాబట్టి.. ఇరుజట్లు విజయం కోసం తమ అస్త్రాలను ఉపయోగించనున్నాయి. సిరీస్ కొల్లగొట్టేందుకు సర్వశక్తులు ఒడ్డనున్నాయి. కోహ్లీ, రోహిత్, అశ్విన్ వంటి సీనియర్లు వీడ్కోలు పలికిన నేపథ్యంలో.. కుర్రాళ్లతో నిండిన జట్టును గిల్ ఎలా నడిపిస్తాడు అనేది ఆసక్తికరంగా మారనుంది.

## చైనాలో ఆసియా కప్..



## ట్రోఫీ విజేతకే వరల్డ్ కప్ బెర్తు!

మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్ షెడ్యూల్ విడుదలైంది. చైనాలోని హాంగ్జౌ వేదికగా సెప్టెంబర్ 5 నుంచి ఈ మెగా టోర్నీ షురూ కానుంది. 10 రోజుల పాటు జరుగనున్న ఆసియా కప్‌లో మొత్తం 8 జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. గ్రూప్ బీలో చోటు దక్కించుకున్న భారత జట్టు తొలి పోరులో థాయ్‌లాండ్‌ను ఢీ కొట్టనుంది బుధవారం హాకీ ఇండియా ఆసియా కప్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. గత ఎడిషన్‌లో కాంస్యం కొల్లగొట్టిన టీమిండియా ఈసారి పసిడిపై గురి పెట్టింది. మరో విషయం ఏంటంటే.. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన జట్టు 2026 మహిళల ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్ పోటీలకు నేరుగా అర్హత సాధించనుంది. సో.. భారత జట్టు ఈ ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే కసితో ఉంది.

**సెప్టెంబర్ 6న జపాన్‌తో..**

ఆసియా కప్ పోటీలకు అర్హత సాధించిన జట్లను గ్రూప్ ఏ, గ్రూప్ బీలుగా విభజించారు నిర్వాహకులు. పూల్ – ఏలో చైనా, కొరియా, మలేషియా, చైనీస్ తైపీ జట్లకు చోటు దక్కింది. పూల్ – బీలో భారత్, జపాన్, సింగపూర్, థాయ్‌లాండ్ జట్లు ఉన్నాయి. తొలి మ్యాచ్‌లో భారత జట్టు థాయ్‌లాండ్‌తో తలపడనుంది. సెప్టెంబర్ 6న డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్, సెప్టెంబర్ 8న సింగపూర్‌తో అమీతుమీ తేల్చుకోనుంది టీమిండియా. 'పూల్ బీలో డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌తో మ్యాచ్ మాకు పెద్ద సవాల్. కానీ, ఆరంభంలోనే కఠిన ప్రత్యర్థిని ఎదుర్కోవడం ద్వారా మా క్రీడాకారిణుల నైపుణ్యాలు మెరుగుపడతాయి. ప్రస్తుతానికి బాగా ఆడడంపైనా, క్రమశిక్షణతో ఉండడం మీద మాత్రమే మేము దృష్టి పెడుతున్నాం. ఒక్కో మ్యాచ్ గెలుస్తూ ముందుకు సాగాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఫైనల్‌కు చేరడంతో పాటు ట్రోఫీ గెలవాలనే కసితో ఉన్నాం. తద్వారా 2026 మహిళల ఎఫ్ఐహెచ్ వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధించాలనేది మా ప్రధాన ఉద్దేశం' అని భారత సారథి సలీమా టెటే వెల్లడించింది. 2017లో చివరిసారిగా భారత జట్టు ఆసియా కప్ విజేతగా నిలిచింది.

## స్టార్ జోడీకి చుక్కెదురు..

### కరుణాకరన్, ఆద్య ముందంజ

ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు సత్తా చాటుతున్నారు. సింగిల్స్‌లో సింధు, డబుల్స్‌లో సాత్విక్ జోడీలు ముందంజ వేయగా.. మిక్స్‌డ డబుల్స్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్ – ఆద్యా వరియత్ ద్వయం సైతం అదరగొట్టింది. అలవోకగా రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. అయితే.. ఇదే విభాగంలో పోటీపడిన భారత క్రీడాకారులు తొలి రౌండ్‌లోనే ఓటమితో ఇంటి దారి పట్టారు. ఇండోనేషియా ఓపెన్‌లో కరుణాకరన్ – ఆద్యా వరియత్ జోడీకి తొలి రౌండ్‌లో కఠిన ప్రత్యర్థి ఎదురైంది. అయినా సరే పట్టుదలగా ఆడిన భారత మిక్స్‌డ జంట చైనీస్ తైపీకి చెందిన యె హాంగ్ వీ, నికొలె గొంజలెస్ చాన్ ద్వయాన్ని మట్టికరిపించింది.



ఉత్కంఠగా సాగిన పోరులో 1521తో తొలి సెట్‌లో ఓడినా ఒత్తిడికి లోనవ్వలేదు కరుణాకరన్, ఆద్యా. 45 నిమిషాల పాటు నువ్వానేనా అన్నట్టు జరిగిన మ్యాచ్‌లో భారత రాకెట్ ద్వయం 2116, 2117తో చివరి రెండు సెట్లలో ప్రత్యర్థి ఆట కట్టించింది.

**ఫేవరెట్ ద్వయం ఓటమి**

మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్ – రుత్విక శివానీ గద్దే జోడీకి మాత్రం నిరాశే మిగిలింది. యుచీ షిమొగమీ, సయక హొబర(జపాన్) చేతిలో భారత ద్వయం 1421, 921 చిత్తుగా ఓడిపోయింది. అశిత్ సూర్య – అమృత ప్రముతేశ్ జోడీకి సైతం మొదటి రౌండ్‌లోనే చుక్కెదురైంది. ఫేవరెట్ అయిన ధ్రువ్ కపిల – తనీషా క్రాస్టో ద్వయం కూడా ముందంజ వేయలేకపోయింది. సెకండ సీడ్ టాంగ్ జీ చెన్, ఈ వీ తోహ్(మలేషియా)లకు కనీసం పోటీ ఇవ్వలేక మ్యాచ్‌ను చేజార్చుకుంది.



అక్కినేని అఖిల్ వివాహ ఆహ్వాన పత్రికను డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లుకు సినీ నటుడు అక్కినేని నాగార్జున అందించారు. ఈనెల 6వ తేదిన అన్నపూర్ణ స్టూడియోలో వివాహం జరుగనుంది. వ్యాపారవేత్త కుమార్తె జైనాబ్‌ను అఖిల్ వివాహం చేసుకుంటున్నారు.

## కుబేర సెన్సార్ పూర్తి

తమిళ నటుడు ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా కుబేర. అక్కినేని నాగార్జున కీలక పాత్ర పోషించిన ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ప్యాన్ ఇండియా సినిమాగా తెరకెక్కిన ఈ సినిమా తమిళ ఆడియోను ఇటీవలే విడుదల చేశారు. తెలుగు, హిందీ ఆడియోను కూడా త్వరలోనే ఆవిష్కరించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని నిర్మాతల్లో ఒకరైన పుష్కర్ రామ్మోహన్ రావు తెలిపారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమాను ఈనెల 20న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ధనుష్ సరసన రష్మిక మందాన హీరోయిన్‌గా నటించింది. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందించారు.





# రీల్

## హరిహర వీరమల్లు విడుదల వాయిదా!





పవన్ కళ్యాణ్ హీరోగా ఏ ఎం రత్నం నిర్మించిన 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల వాయిదా పడుతోందా? అంటే అవుననే ఫిలిం నగర్ వర్గాలు అంటున్నాయి. నిజానికి ఈనెల 12న విడుదల కావాల్సి ఉంది. కానీ సాంకేతిక కారణాల వల్ల ఈ సినిమా విడుదల వాయిదా వేస్తున్నారు. అయిదేళ్ళ క్రితం ఈ సినిమా క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) దర్శకత్వంలో హరిహర వీరమల్లు సినిమా షూటింగ్ ప్రారంభం అయింది. అనేక కారణాల వల్ల ఈ సినిమా షూటింగ్ ఆలస్యమైంది. మధ్యలో దర్శకుడు క్రిష్ ఈ సినిమా నుంచి బయటికి వెల్లిపోయారు. దీంతో ఈసినిమా బాధ్యతలు ఏ ఏం రత్నం కొడుకు జ్యోతి క్రిష్ణ దర్శకత్వం వహించారు. పవన్ కళ్యాణ్ ఏపి ఉప ముఖ్యమంత్రి గా బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా షూటింగ్ చేసి సినిమా పూర్తి చేశారు. ఎట్టకేలకు ఈనెల 12న వి దుదల చేయాలనుకున్నారు. ఆ దిశగా ప్రయత్నాలు వేగవంతం చేశారు. కానీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది.

## 'దేవిక అండ్ డానీ' వెబ్ సిరీస్

**6 నుంచి జియో హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్**



దేవిక అండ్ డానీ వెబ్ సిరీస్ జూన్ 6 నుంచి జియో హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ వెబ్ సిరీస్‌లో రీతూ వర్మ, సూర్య వశిష్ట, శివ కందుకూరి, సుబ్బరాజు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, కోవై సరళ, సోనియా సింగ్, గోకరాజు రమణ, శివన్నారాయణ, వివాహర్ష, షణ్ముఖ్, అభినయశ్రీ, మౌనికా రెడ్డి, ఈశ్వర్య వుల్లింగల తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. బి.కిషోర్ దర్శకత్వంలో సుధాకర్ చాగంటి దీన్ని నిర్మించారు. హీరోయిన్ రీతూ వర్మ మాట్లాడుతూ "వెబ్ సిరీస్ చేయాలని చాలా రోజుల నుంచి అనుకుంటున్నాను. ఔట్ ఆఫ్ ది బాక్స్ కాన్సెప్ట్ వస్తే చేద్దామనుకున్నాను. ఆ సమయంలో 'దేవిక అండ్ డానీ' వంటి నిజాయతీతో కూడిన కథ నా దగ్గరకు వచ్చింది. ఇది నా అదృష్టంగా భావిస్తున్నానని ఆమె అన్నారు. సూర్యవశిష్ట్ మాట్లాడుతూ "సాధారణంగా ఊర్లలో ఉండే అమ్మాయిలకు చాలా ఇబ్బందులుంటాయి. ఈ పని చేయాలని, ఆ పని చేయకూడదని అంటుంటారు. అలాంటివాళ్లు బయటకు వెళితే ఎలా మారుతారనే ఓ విషయాన్ని చక్కగా 'దేవిక అండ్ డానీ'లో చూపించారు. దేవిక అనే అమ్మాయి జీవితాన్ని డానీ, సుబ్బు లాంటి పాత్రలు ఎలా మార్చాయనేది కూడా ఇందులో చూడొచ్చు. తప్పకుండా ఈ సిరీస్ అందరికీ నచ్చుతుంది. నిర్మాత సుధాకర్ చాగంటి మాట్లాడుతూ "'దేవిక అ్‌డ డానీ' వంటి సిరీస్‌తో మీ ముందుకు రానుండటం ఎంతో ఆనందంగా ఉంది. ఇది ఏడు ఎపిసోడ్స్ ఉన్న సిరీస్. జియో హాట్‌స్టార్ వారు ఎంతగానో సపోర్ట్ చేశారు. జూన్6న స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్‌ను ఎంతగానో ఎంజాయ్ చేస్తారు అని చెప్పారు. డైరెక్టర్ బి.కిషోర్ మాట్లాడుతూ 'శ్రీకారం' తర్వాత ఈ సిరీస్ చేయటం చాలా ఆనందంగా ఉంది. టీజర్, ట్రైలర్, ఇప్పుడు చూసిన రెండు ఎపిసోడ్స్ అందరికీ నచ్చే ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మౌనిక, నందిని, సినిమాటోగ్రాఫర్ వెంకట్ సి.దిలీప్, మ్యూజిక్ డైరెక్టర్ జై క్రిష్, ఎడిటర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాడ్ నెస్ షురూ!

బన్నీ వాస్ వర్క్స్‌తో కలిసి నవతరం నిర్మాణ సంస్థలు సప్త అశ్వ క్రియేటివ్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ ఒక ఆసక్తికర చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి కట్టిపడేసే ప్రీలుక్ పోస్టర్ విడుదలైంది. ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి, ట్రేడ్‌తో పాటు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ తొలిసారిగా సినిమాను సమర్పిస్తుండటం.. ఈ ప్రాజెక్ట్‌పై నమ్మకాన్ని మరింత బలపరుస్తోంది. ఈ చిత్రంతో విజయేంద్ర ఎస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ సినిమాకి సోమరాజు పెన్మెత్స సహ నిర్మాత. ఆర్.ఆర్. ధృవన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా సిద్ధార్థ్ ఎస్.జె, ఎడిటర్‌గా పీకే, ఆర్ట్ డైరెక్టర్‌గా గాంధీ నడికుడికర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా రాజీవ్ కుమార్ రామా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా శిల్పా టంగుటూరి వ్యవహరిస్తున్నారు.



## మాజీ సిఎస్ సోమేష్‌కుమార్‌కు

# బిగిస్తున్న ఉచ్చు

### తెరపైకి జిఎస్‌టి కుంభకోణం కేసు



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేష్‌కుమార్‌కు సిఐడి ఉచ్చు భిగిస్తుంది. 202022 మధ్య తెలంగాణ రాష్ట్రంలో సుమారు రూ.1,400 కోట్ల విలువైన జిఎస్‌టి కుంభకోణం గత ఏడాది జూలైలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. దీనిపై ముందుగా హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఈ కేసును ప్రభుత్వం రాష్ట్ర నేర పరిశోధక విభాగం (సిఐడి)కి బదిలీ చేశారు. సిఐడిలో ఈ కేసు సుమారు ఏడు నెలల నుంచి పెండింగ్‌లో ఉంది. తాజాగా సిఐడి అధికారులు ఈ కేసుపై దృష్టి సారించినట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులుగా మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్.వి. కాశీ విశ్వేశ్వర రావు,వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ ఏ. శివరామ ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్, ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వంటి సంస్థలు ప్రధాన నిందితులుగా ఉన్నారు.ప్రస్తుతం సిఐడి ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తోంది. ముఖ్య నిందితులను విచారణకు పిలవాలని యోచిస్తోంది. వాణిజ్య పన్నుల శాఖ, జిఎస్‌టి కమిషనరేట్ నుండి అవసరమైన డేటాను సేకరిస్తోంది. త్వరలో సోమేష్‌కుమార్‌తో పాటు నిందితులను సిఐడి విచారించనుంది. విచారణ ప్రారంభమైతే పలువురి అరెస్టులు కూడా కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఈ మోసానికి సహకరించేందుకు 'Special Initiatives' అనే వాట్సాప్ గ్రూప్‌ను ఉపయోగించినట్లు సమాచారం.

**కేసు నేపథ్యం..**

ఈ కుంభకోణం 2020 నుండి 2022 మధ్యకాలంలో జరిగింది. బిగ్ లీప్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ అనే సంస్థ మానవ వనరుల సరఫరాదారుగా నమోదు చేసుకుని, ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా రూ.25.51 కోట్ల విలువైన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి) క్లెయిమ్ చేసింది. ఈ విధంగా, మొత్తం సుమారు రూ1,400 కోట్ల విలువైన ఐటిసి అక్రమంగా క్లెయిమ్ చేయబడినట్లు గుర్తించారు.

**స్కామ్ విధానం..**

వాణిజ్య పన్నుల శాఖ, ఐఐటిహైదరాబాద్ సహకారంతో, పన్ను రిటర్‌లను పరిశీలించడానికి స్మార్టినీ మాడ్యూల్స్‌లు అభివృద్ధి చేసింది. అయితే, ఈ మాడ్యూల్స్‌లో మార్పులు చేసి, కొన్ని రిటర్లను గుర్తించకుండా చేశారు. దీంతో, 75 సంస్థలు అక్రమంగా ఐటిసి క్లెయిమ్ చేయగలిగాయి. ఉదాహరణకు, తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఒక్కటే రూ.1,000 కోట్ల వరకు ఐటిసి క్లెయిమ్ చేసినట్లు గుర్తించారు.

## 'రావి'కి ఘన నివాళి



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రైతాంగ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఘనంగా నివాళ్లు అర్పించారు. దివంగత కమ్యూనిస్టులు నాయకులు రావి నారాయణరెడ్డి 118 జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జ్యోతి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతరాజు ఉప్పలయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మగ్రిశ్రీమాన్, సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవిందు, బోయ శ్రీరాములు, అంజయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 'ఫాల్కన్ స్కామ్' కేసులో ప్రధాన నిందితుల అరెస్ట్





**పరారీలో కీలక నిందితుడు**
**సిఐడి డిజి శిఖాగోయల్ ప్రకటన**

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ కుంభకోణం కేసులో ఇద్దరు ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్లు సిఐడి డిజి శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే కేసులో గతంలో ఏడుగురు నిందితులకు అరెస్టు చేయగా పరారీలో కీలక నిందితుడు కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ కుమార్‌తో పాటు అతని సహచరుడు రవి కుమార్‌ను సిఐడి పోలీసులు చాకచక్యగా అరెస్టు చేశారు. నిందితుల నుండి రూ.2.5కోట్ల విలువైన మూడు కార్లు, రూ.10కోట్ల విలువైన 14 ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు 'ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్' 'క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేర్లతో కంపెనీలను పెట్టారు. అధిక శాతం వడ్డీలు ఇస్తామని సుమారు 7,056 మంది పెట్టుబడిదారుల నుండి రూ.4,215 కోట్లు సేకరించారు. ఇందులోకనీసం 4,065 మంది పెట్టుబడిదారులు రూ.792 కోట్లు నష్టపోయారు. నిందితులు బాధితుల నుంచి సేకరించిన డబ్బును క్రిప్టోకరెన్సీ ప్లాట్‌ఫారం, మల్టీలెవెల్ మార్కెటింగ్ సీమ్‌లు, లగ్జరీ హాస్పిటాలిటీ, ప్రైవేట్ చార్టర్ సర్వీసులు, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాల్లో పెట్టుబడి పెట్టారని సిఐడి దర్యాప్తులో తేలినట్లు శిఖాగోయల్ తెలిపారు. నిందితులపై ఈ కేసులో భారతీయ న్యాయ సనిహిత (బిఎన్‌ఎస్) సెక్షన్లు 316(2), 318(4), 61(2), తెలంగాణ రాష్ట్ర డిపాజిటర్ల రక్షణ చట్టం, 1999 సెక్షన్ 5 కింద కేసులు నమోదు చేశామని తెలిపారు. వీరిపై సిఐడిలో మొత్తం మూడు కేసులు నమోదు చేశామన్నారు. అధిక లాభాలు హామీ ఇచ్చే పెట్టుబడులు అడిగే కంపెనీల గురించి అనుమానాలు ఉంటే తమకు సమాచారం అందించాలని సిఐడి చీఫ్ శిఖాగోయల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వర్షాకాల సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశ పర్చాలని ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో రిజిజ్ ప్రకటన చేయడం గమనార్హం. ప్రతి సెషన్ కూడా తమకు ప్రత్యేకమేనన్నారు. వర్షాకాల సమావేశాల్లో నిబంధనల మేరకు అన్ని ముఖ్యమైన అంశాలను చర్చించవచ్చన్నారు. పార్లమెంట్ ఉభయసభల బిజినెస్ అడ్వయిజరీ కమిటీ పార్లమెంట్‌లో చర్చించే అంశాలపై నిర్ణయం తీసుకుంటుందన్నారు.

**ప్రత్యేక సమావేశాల నుంచి తప్పించుకునేందుకే...**

పహల్గామ్ దాడి, ఉగ్రవాదులను చట్టం ముందు నిలబెట్టడంలో కేంద్రం వైఫల్యంపై చర్చించడానికి తక్షణం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏరాటు చేయాలనే కాంగ్రెస్, ఇండియా కూటమి చేసిన డిమాండ్ నుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం పార్లమెంటు వర్షాకాల సమావేశాలను 47 రోజుల ముందుగానే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిందని కాంగ్రెస్ బుధవారం ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ సాధారణంగా పార్లమెంట్ సమావేశాల తేదీలను కొన్ని రోజుల ముందుగానే ప్రకటిస్తారు, కానీ సమావేశం గడువుకు 47 రోజుల ముందు తేదీలను ఎప్పుడూ ప్రకటించలేదు అని అన్నారు. 'పహల్గామ్ దాడులను చర్చించడానికి తక్షణ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు పదే పదే చేస్తున్న డిమాండ్ నుండి పారిపోవడానికే తేదీలను ప్రకటించారన్నారు. హత్యలు చేసిన ఉగ్రవాదులను చట్టం ముందు నిలబెట్టడంలో వైఫల్యం, ఆపరేషన్ సిందూర్ ప్రభావాలు, దాని స్పష్టమైన రాజకీయాకరణ, సింగపూర్‌లో సిడిఎస్ వెల్లడి, భారత్, పాక్‌ల మధ్యవర్తిత్వం, పాకిస్తాన్ వైమానిక దళంలో చైనాను చొప్పించడం, అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వంపై నిరంతర వాదనలు, మన విదేశాంగ విధానం, దౌత్యపరమైన ఒప్పందాల్లో వైఫల్యాలు అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, వర్షాకాల సమావేశంలో ఇప్పటికీ అత్యున్నత జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ అంశాలే వస్తాయని, ప్రధాన మంత్రి ప్రత్యేక సమావేశం నుండి పారిపోవచ్చు కానీ, ఆరు వారాల తర్వాత చాలా కఠినమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

## మట్టి మ(హా)రాజులు

(మొదటి పేజీ తరువాయి)

లేదు. మాముళ్ల మత్తులో జోగుతున్న అధికార యంత్రాంగానికి తరలిపోతన్న మట్టి, కనుమరుగవుతున్న మట్టి గుట్టలు కనిపించటం లేదు. కొందరు ప్రజాప్రతినిధుల ఊతం, మరి కొందరి వాటాలు ఈ పరిస్థితికి కారణమవుతున్నాయి. ఈ అక్రమానికి తెరపడేవిధంగా చర్యలు తీసుకోకపోతే అక్రమార్కులు మరింత రెచ్చిపోయే అవకాశం ఉంది. ఉత్తగా పారబోసే దినస్సు ఇసుక పిరమైందన్నట్లు ఇప్పుడు మట్టికి ఎనలేని డిమాండ్ ఏర్పడింది. అభివృద్ధితో ప్రకృతి వినాశనం అవుతుంది అన్నట్లుగానే రియల్ వెంచర్లు, రోడ్ల నిర్మాణం ఇతరత్రా అభివృద్ధి పనులకు మట్టిని ఉపయోగిస్తున్నారు. పట్టా భూమిలో మట్టిని తరలించాలన్న ప్రభుత్వ అనుమతి తప్పనిసరి, ఇది సామాన్యుడికే అక్రమార్కులు మట్టిని ప్రభుత్వ భూముల నుంచి, రిజర్వు ఫారెస్ట్ నుంచి, కొండలు, గుట్టల నుంచి తరలించినా పట్టించుకునే నాధుడే లేడు. హైవేల నిర్మాణం కోసం మట్టి తరలింపుకు అధికార యంత్రాంగం అనుమతులు ఇచ్చినా ఆ మాటున ప్రైవేటు వ్యక్తులు మట్టిని తరలించుకుపోతున్నారు. మట్టి వ్యాపారం కాసులు కురిపిస్తుంది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో మట్టి దందా యధేచ్చగా కొనసాగుతుంది. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా మట్టి అవసరమైన వారు వీరిని సంప్రదిస్తే చాలు మీకు అవసరం ఉన్న చోటుకు మట్టి తరలి వస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం తాళ్లగొమ్మూరు గుట్ట ఇప్పుడు తరలి పోతుంది, (కరిగిపోతుంది)భద్రాచలం వెళ్తుంటే ఎత్తుగా ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా ఉన్న ఈ గుట్టపై మట్టి మాఫియా కన్నుపడింది. పట్టపగలే యంత్రాలతో పెకిలించి మట్టిని తరలించుకుపోతున్నారు. యంత్రాల చప్పుళ్లు వినపడని అధికారులకు ట్రాక్టర్లలో తరలిపోతున్న మట్టి కనిపించటం లేదు. 1/70 చట్టం పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి. కనీసం గ్రామ పంచాయతీ అనుమతి లేకుండానే తరలించుకుపోతున్నారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఏజెన్సీ పరిధిలోని ఆళ్లపల్లి, గుండాల మొదలు అన్ని ఏజెన్సీ మండలాల్లోనూ మట్టి అక్రమ రవాణా యధేచ్చగా జరుగుతుంది. ఏన్కూరు మండలంలో మాయమవుతున్న గుట్టలపై ఆందోళనలు నిర్వహించినా మట్టి తరలింపు ఆపలేకపోయారు. ఇక పట్టణ సమీప ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణం. ప్రైవేటు తరలింపు సంగతి ఇలా ఉంటే ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి మట్టి కేటాయింపులు అధికారికంగా జరుగుతాయి. కానీ ఎక్కడ అనుమతి తీసుకున్నారో అక్కడి నుంచి కాకుండా సమీప ప్రాంతాల నుంచి మట్టిని తరలిస్తూ గుత్తేదారులు తమ పని పూర్తి చేసుకుంటున్నారు. ఖమ్మం రూరల్ మండలంలో ఒక రోడ్డు నిర్మాణానికి అనుమతులు లేకుండానే చెరువు మట్టి వినియోగించాడని ఆరోపణలు వినవస్తున్నాయి ఇది ఒక ఉదాహరణ మాత్రమే. చాలా మంది గుత్తేదారులు ఇదే పని చేస్తున్నారు. అక్రమంగా మట్టి తోలకాలు, తరిగిపోతున్న గుట్టలకు సంబంధించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**మత్తులో మైనింగ్ శాఖ :**

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో మైనింగ్ శాఖ మత్తులో జోగుతుంది. అక్రమ మట్టి తోలకాల గురించి మైనింగ్ శాఖకు పట్టింపు లేదు. ఏది ఎటు తరలిపోయినా వారు పట్టించుకునే స్థితిలో లేరు. వారికి ముట్టాల్సింది ముడితే చాలునన్న భావనలో ఉన్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏదో మత్తులో లేకపోతే కండ్ల ముందే గుట్టలు కనిపించకుండా పోతుంటే ఎందుకు స్పందించారన్న ప్రశ్న వినిపిస్తుంది. ఉన్నతాధికారులు, చట్టసభల సభ్యులు అమాత్యులు అక్రమ మట్టి తోలకాలను నిరోధించకపోతే ఒకప్పటి కథగా గుట్టలు ఉండేవి, మట్టి దిబ్బలు ఉండేవి అని చెప్పుకోవాల్సి వస్తుంది.

## ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దు

(మొదటి పేజీ తరువాయి)

మేరకు పనులు చేపట్టవద్దని సూచించగా అందుకు అంగీకరించారు. రాత్రికి రాత్రే తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయగా రెండు జెసిబిలు పనిచేసేందుకు సిబ్బంది రావడంతో ఆగ్రహించిన రైతులు మారోమారు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలో అఖిలపక్షం నాయకులు సైతం ధర్నాలో పాల్గొనేందుకు సిద్ధం కాగా, నాగర్‌దొడ్డి వెంకటరాములు, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్, కురువ పల్లయ్యను ముందస్తు అరెస్టు చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణ స్థలానికి రైతులు రాకుండా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించడంతో రైతులకు పోలీసులకు తోపులాట జరిగింది. ఈ ఘటనలో మరియమ్మ అనే మహిళ తలకు గాయాలయ్యాయి. దీంతో పరిసర ప్రాంతాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. కంపెనీ సిబ్బంది ఇద్దరు రైతులపై దాడి చేయడంతో ఆగ్రహించిన ప్రభావిత 12 గ్రామాల రైతులు పెద్ద ఎత్తున నిర్మాణ స్థలికి చేరుకోగా వారిని శాంతింపచేసేందుకు పోలీసు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆవేశంతో ఉన్న మహిళలు, రైతులు అక్కడ ఏర్పాటు చేసిన కంటైనర్‌ను తగల పెట్టగా సామాగ్రిని, రెండు కార్ల అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో రైతులను చెదరగొట్టేందుకు పోలీసులు అధిక సంఖ్యలో వచ్చారు. ఇథనాల్ ఫ్యాక్టరీ కోసమని భూములు సేకరిస్తున్నామని చెప్పకుండా తమను మోసం చేశారని, కేవలం సాగు పేరుతో 27 ఎకరాలు సేకరించారని, కాలుష్య ఫ్యాక్టరీ నిర్మాణం చేపడితే ఇక్కడి భూములు దెబ్బ తినడంతో పాటు అనేక పచ్చని పొలాలు బీడుగా మారి వాతావరణ కాలుష్యం వల్ల రాజోలి మండలంలో నివసించే ప్రజలు తీవ్ర శ్వాసకోస, చర్మ సంబంధించిన వ్యాధులతో బాధపడే పరిస్థితి దాపురిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా నిర్మాణానికి ప్రయత్నం చేస్తుండగా రైతులు ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేసుకుని అనేక రూపాలలో రిలే నిరాహార దీక్షలు, రాస్తారోకో కార్యక్రమాలను చేపట్టారు. సమస్య తీవ్రతను గమనించిన స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ రైతులకు సంఘీభావం తెలిపారు. కంపెనీ నిర్మాణం చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను సైతం కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ జీవితాలను పన్నంగా పెట్టైనా కంపెనీ నిర్మాణాన్ని ఆపేందుకు సిద్దంగా ఉన్నామని రైతులు పేర్కొంటున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com